ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in

ప్రజా కలం

Published From Nizamabad

PRGI No.TELTEL/2010/33275

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds
5 Lines Rs.250 only
&
Public Notice Advertising
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

బుధవారం | 30-09- 2026 | సంపుటి: 17, సంచిక: 179, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- | ఎడిటర్: కలకొండ రామకృష్ణ

పేదల కన్నీటికి

పిలువ కట్టలేం

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



- ఏడాదిలోపే ఇందిరమ్మ ఇళ్ల తాళాలు అందిస్తాం
- పేదవాడి సొంతింటి కలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం
- ధరణి పేరిట రికార్డులు తారుమారు చేసి మా భూములను ఎర్రవెల్లిలోని సర్వేనెంబర్ 325లో కలిపారు
- సర్వేచేసి మా భూములు మాకు ఇప్పించండి
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి శివారు వెంకటాపూర్ గ్రామస్థుల వేడుకోలు
- శివారు వెంకటాపూర్ భూ సమస్యపై సమగ్ర విచారణకు హామీ
- రికార్డులు, గ్రామ నక్షా, క్షేత్రస్థాయి సర్వేతో వాస్తవాలు తేలుస్తాం

హైదరాబాద్, సెప్టెంబర్ 29 (ప్రజాకలం) :

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదవాడి కష్టం తెలిసిన ఇందిరమ్మ ప్రభుత్వమని, పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయాలన్న సంకల్పంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. పేదవాడు తన జీవితకాలంలో ఒక్కసారైనా సొంత ఇంటిని చూసుకోవాలన్న ఆకాంక్షను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. క్యూఆర్/కోర్ ప్రాంతంలో ప్రభుత్వానికి చెందిన వివిధ శాఖల భూములను గుర్తించి, వాటిని హౌసింగ్ శాఖకు బదలాయించి పేదల కోసం గ్రౌండ్ ప్లస్ టెన్ అంతస్తుల అపార్ట్‌మెంట్లు నిర్మించాలని నిర్ణయిం చినట్లు తెలిపారు. నాంపల్లి శాసనసభ నియోజకవర్గంలోని రెడ్ హిల్స్ లో మంగళవారం ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి మంత్రి పొంగులేటి సహచర మంత్రి అజారుద్దీన్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్‌తో కలిసి శంకుస్థాపన చేశారు.

తరువాయి 2వ పేజీలో...



తుమ్మిడిహెట్టి నిర్మాణానికి

అనుమతులు ఇప్పించండి

పీఆర్ఎల్ఐఎస్, సీతారామ ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు మంజూరు చేయండి


- కృష్ణా జలాల వినియోగంపై త్వరగా టెలీమెట్రీలు ఏర్పాటు చేయాలి
- జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వినతి

ఢిల్లీ: తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి త్వరగా అనుమతులు ఇప్పించాలని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర కోరిన సమాచారాన్ని ఇప్పటికే సమర్పించామని కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు.

ఢిల్లీలో జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మంగళవారం సాయంత్రం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కృష్ణా, గోదావరి బేసిన్లలో తెలంగాణ ప్రాజెక్టులకు సంబంధించిన పలు అంశాలపై కేంద్ర మంత్రితో వారు చర్చించారు. తుమ్మిడిహట్టి బ్యారేజీని ఎఫ్ఆర్ఎల్ 152 మీటర్ల స్థాయిలో నిర్మించేందుకు తెలంగాణ, మహారాష్ట్ర మధ్య త్వరగా అంగీకారం కుదిరేలా చూడాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు.

తరువాయి 2వ పేజీలో...

కలం కౌంటర్



తెలంగాణలో విస్తృతమైన

పెట్టుబడి అవకాశాలు

- ఇన్వెస్టర్స్ సద్వినియోగం చేసుకోవాలి
- అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్



ఫ్రాంక్‌ఫర్ట్, జర్మనీ : జర్మనీలో తెలంగాణ శాసనసభ స్పీకర్ శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ గారు, శాసన మండలి చైర్మన్ శ్రీ గుత్తా సుఖేందర్ రెడ్డి గారి నేతృత్వంలోని అసెంబ్లీ ప్రతినిధి బృందం పర్యటన కొనసాగుతోంది. జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌లో భారత కాన్సులేట్ జనరల్ కార్యాలయంలో తెలంగాణలో పెట్టుబడి అవకాశాలు, తెలుగు ప్రవాసులతో అనుసంధానం అంశాలపై సమావేశం నిర్వహించారు. తెలంగాణలో అందుబాటులో ఉన్న పెట్టుబడుల అవకాశాలు, పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, ఇన్నోవేషన్, టెక్నాలజీ వంటి వివిధ రంగాల్లో ఉన్న అవకాశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

తరువాయి 2వ పేజీలో...

ఉద్యోగులు.. క్రీడలు, కళలపై

ఆసక్తి పెంచుకోవాలి

మంత్రి జూపల్లి కృష్ణారావు



హైదరాబాద్, సెప్టెంబర్ 29 (ప్రజాకలం) :

ఉద్యోగులు విధులను సమర్థంగా నిర్వర్తించడంతో పాటు క్రీడలు, కళలు, సాంస్కృతిక కార్యక్రమాలపై ఆసక్తి పెంచుకోవాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. డా. బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సచివాలయ సాంస్కృతిక ఉత్సవానికి మంత్రి జూపల్లి కృష్ణారావు, స్పెషల్ సీఎస్ మహేష్ దత్ హెక్కా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఉద్యోగులు నిత్యం ఎంతో బిజీగా, పని ఒత్తిడితో విధులు నిర్వర్తిస్తుంటారని తెలిపారు. ఉద్యోగి పని సామర్థ్యంతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యం కూడా ముఖ్యమన్నారు. క్రీడలు, కళలు, సాహిత్యం, సంగీతం, నృత్యం మనసుకు శారీరక, మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని మంత్రి అన్నారు. సచివాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు,

తరువాయి 2వ పేజీలో...

ఈ ఖరీఫ్‌లో పప్పుధాన్యాల సాగు వృద్ధిలో 36% తో దేశంలోనే

రెండో స్థానంలో నిలిచిన తెలంగాణ

- రబీ సదస్సులో తెలంగాణ రాష్ట్ర అవసరాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లిన మంత్రి తుమ్మల
- క్రూడ్ పామ్ ఆయిల్ దిగుమతి సుంకాన్ని గతంలో ఉన్న 44 శాతానికి పునరుద్ధరించాలి
- ఎల్‌నినో, కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు మొక్కజొన్న, జొన్నను పీఎస్ఎస్ పరిధిలోకి తీసుకురావాలి
- లోటు, తీవ్ర లోటు వర్షపాత మండలాలకు ప్రత్యేక కేంద్ర సాయం అందించాలి
- తెలంగాణకు అదనంగా 16 కృషి విజ్ఞాన కేంద్రాలను మంజూరు చేయాలి : మంత్రి తుమ్మల
- కొడంగల్‌లో అగ్రి బిజినెస్ పార్క్, సెమీ-అరిడ్ హార్టికల్చర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు కేంద్రం సహకరించాలి
- పామాయిల్ ధరపై ప్రత్యేక కమిటీ వేస్తామని హామీ ఇచ్చిన కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29, 2026: పంటల వైవిధ్యీకరణలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న చర్యలతో ఈ ఖరీఫ్‌లో పప్పుధాన్యాల సాగులో గత ఏడాది ఖరీఫ్ కంటే 36% అధికంగా సాగుచేసి తెలంగాణ దేశంలోనే రెండో స్థానంలో నిలిచిందని మంత్రి తుమ్మల తెలిపారు. జాతీయ రబీ సదస్సులో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని రాష్ట్ర వ్యవసాయ రంగంలో సాధిస్తున్న ప్రగతితో పాటు రైతుల ప్రయోజనాల కోసం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు.



తరువాయి 2వ పేజీలో...

వివక్ష, దాడులపై దలితులు, ఆదివాసీలు

ఐక్యంగా పోరాడాలి

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



న్యూఢిల్లీ: భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు అయినా దళితులపై వివక్ష, దాడులు కొనసాగుతున్నాయని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. తమ ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణ కోసం దళితులు, ఆదివాసీలు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ ఎంపీల ఫోరం ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్‌లో దళిత-ఆదివాసీ ఆత్మగౌరవ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు సీతక్క, వివేక్ వెంకటస్వామి, ఎంపీలు మల్లు రవి, బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యే వినోద్ వెంకటస్వామి తదితరులు హాజరయ్యారు. అలాగే కాంగ్రెస్ నేతలు, ప్రజాప్రతినిధులు, దళిత-ఆదివాసీ వర్గాల ప్రతినిధులు పాల్గొన్నారు.

తరువాయి 2వ పేజీలో...



హాస్టల్ విద్యార్థుల సంక్షేమంపై

రాజీ పడేది లేదు

నాణ్యమైన విద్య, పౌష్టిక ఆహారాన్ని అందించడం లక్ష్యం

: సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి

వెల్గటూర్, సెప్టెంబర్ 29, ప్రజాకలం, ప్రతినిధి: తెలంగాణలోని సంక్షేమ హాస్టల్లలో చదువుతున్న విద్యార్థులకు కల్పించే సౌకర్యాల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా, చిన్న బోనాలలో గల ఎస్టీ సంక్షేమ

తరువాయి 2వ పేజీలో...

పార్టీ వైఫల్యాన్ని కేసీఆర్‌పై

మోపుతున్నావ్..

నాతో పెట్టుకోకు : కేటీఆర్‌పై కవిత ఫైర్



హైదరాబాద్, సెప్టెంబర్ 29 (ప్రజాకలం): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఉద్దేశించి తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు(టీఆర్ఎస్) కవిత తీవ్ర స్థాయిలో వ్యాఖ్యలు చేశారు. సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ తీరుపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ పలు ప్రశ్నలు సంధిం చారు. తాను బీఆర్ఎస్ పార్టీలోని ఓ వ్యక్తిని విమర్శించినందుకే తనను కొన్ని గంటల్లోనే పార్టీ నుంచి సస్పెండ్ చేశారని అన్నారు. ఇప్పు డు తాను విమర్శించిన వ్యక్తితో అంటకాగు తూ.. పార్టీ అధినేత తీరుతోనే నష్టపోయామని బహిరంగంగా వ్యాఖ్యలు చేయడం పార్టీ వ్యతిరేకం కాదా అని కేటీఆర్‌ను ప్రశ్నించారు. 'మీరు మీ పార్టీ అధినేత కేటీఆర్‌ను విమర్శించడం.. ఆయన తీసుకున్న

తరువాయి 2వ పేజీలో...

పేదల కన్నీటికి విలువ కట్టలేం

మొదటి పేజీ తరువాయి...

ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మహానగరంలో ఒక్కో ఎకరం భూమి విలువ రూ.200 కోట్లు, రూ.250 కోట్లు ఉన్నా.. ఆ భూమి ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చడం కంటే పేద కుటుంబానికి ఒక సొంత ఇల్లు ఇవ్వడమే ప్రజా ప్రభుత్వ ఉద్దేశమని స్పష్టం చేశారు. ఈరోజు పారదర్శకంగా నిర్వహించిన డ్రాలో 480 మంది లబ్ధిదారులను ఎంపిక చేశామని, మిగిలిన వారికి రెండో, మూడో, నాలుగో విడతల్లోనూ ఇళ్లు అందిస్తామని తెలిపారు. ఈ ప్రాంతంలోని మొత్తం 20 నియోజకవర్గాల్లో భూములను గుర్తించామని, సుమారు 16- 17 ప్రాంతాల్లో టెండర్ ప్రక్రియ పూర్తయిందని, త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని చెప్పారు.

ఏడాదిలోపే ఇంటి తాళాలు

ప్రస్తుతం నిర్మిస్తున్న ఒక్కో అపార్ట్‌మెంట్ విలువ సుమారు రూ.80 లక్షల నుంచి రూ.కోటి వరకు ఉంటుందని మంత్రి తెలిపారు. రెండు, మూడు సంవత్సరాల సమయం తీసుకోకుండా ఒక ఏడాదిలోపే నిర్మాణాలు పూర్తి చేసి, ఇదే వేదిక నుంచి లబ్ధిదారులకు ఇంటి తాళాలు అందిస్తానని హామీ ఇచ్చారు.

గతంలో మాదిరిగా కేవలం సర్టిఫికెట్లు ఇచ్చి వదిలేయకుండా.. అవసరమైతే పిల్లల చదువులు, వివాహాలు వంటి కుటుంబ అవసరాల కోసం రుణం పొందే అవకాశం ఉండేలా ఇళ్లను రూపాయి కమిషన్ లేకుండా, రిజిస్ట్రేషన్ ఛార్జీలు లేకుండా నేరుగా లబ్ధిదారుల పేర్లపై రిజిస్ట్రేషన్ చేయించే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం

టవర్స్‌లో నివసించే కుటుంబాలకు డ్రైనేజీ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను అక్కడికక్కడే ఆదేశించారు. నిర్మాణ ప్రాంతంలోని డ్రైనేజీని మెయిన్ ట్రంక్ లైన్‌కు అనుసంధానం చేసే బాధ్యతను హౌసింగ్ శాఖ తీసుకుంటుందని తెలిపారు. ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారుల భాగస్వామ్యాన్ని కూడా నిర్ధారిస్తామని చెప్పారు. వారానికి ఒక రోజు లబ్ధిదారులకు నిర్మాణ ప్రదేశాన్ని సందర్శించే అవకాశం కల్పించి, తమ ఇల్లు నాణ్యతతో నిర్మిస్తున్నారా లేదా అన్నది స్వయంగా పరిశీలించుకునే అవకాశం ఇస్తామని మంత్రి తెలిపారు.

నగరానికి దూరంగా ఇళ్లు కట్టి పేదలను ఇబ్బంది పెట్టం

గత ప్రభుత్వాలు నగరంలో పేదలు నివసించే ప్రాంతాలకు 30-40 కిలోమీటర్ల దూరంలో ఇళ్లు నిర్మించడం వల్ల జీవనోపాధి కోసం వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని మంత్రి విమర్శించారు. పేదల జీవనోపాధి, పిల్లల చదువులు, కుటుంబ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఇళ్ల నిర్మాణ ప్రాంతాలను ఎంపిక చేస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ప్రభుత్వం అంటేనే ఇందిరమ్మ ఇల్లు. ప్రతి తండాలో, ప్రతి గూడెంలో, ప్రతి డివిజన్‌లో, ప్రతి వార్డులో పేదలకు ఇళ్లు నిర్మించి చూపిస్తాం" అని మంత్రి స్పష్టం చేశారు. గత ప్రభుత్వం పదేళ్లలో చేసిన ఇళ్ల నిర్మాణం కంటే ప్రజా ప్రభుత్వం తొలి విడతలోనే రెట్టింపు ఇళ్లు నిర్మించి చూపిస్తుందని మంత్రి అన్నారు. పేదల సొంతింటి కలను ఎన్నికల హామీగా కాకుండా, ప్రభుత్వ బాధ్యతగా భావించి అమలు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే ఎంపికైన 480 మంది లబ్ధిదారులకు మంత్రి అభినందనలు తెలియజేస్తూ, రాబోయే రోజుల్లో రెండో, మూడో, నాలుగో విడతలను ప్రారంభించి, ఎన్నికలలోపు నాలుగు విడతల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి లబ్ధిదారులకు తాళాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భాగంగా మంత్రి పొంగులేటి లక్కీడ్రాలో విజేతలైన లబ్ధిదారులకు ఇళ్ల నెంబర్ల కేటాయిస్తూ వారి పేర్లను ప్రకటించారు. మంత్రి చేతుల మీదుగా మాదేసు లత అనే మహిళకు డ్రాలో ఇందిరమ్మ ఎ టవర్ లోని 801 ఇంటిని కేటాయిస్తూ ప్రకటన చేశారు. ఈ కార్యక్రమంలో గృహనిర్మాణ శాఖ ఎండీ విపి గౌతమ్, కలెక్టర్ ప్రియాంక అలా తదితరులు పాల్గొన్నారు.

మా భూములు మాకు ఇప్పించండి

సిద్దిపేట జిల్లా గజ్వేలు నియోజకవర్గంలోని మార్కూక్ మండలం శివారు వెంకటాపూర్ గ్రామ రైతులకు న్యాయం చేస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. ధరణి పోర్టల్‌లో రికార్డుల మార్పులతో తమ తాత ముత్తాతల నుంచి సాగు చేసుకుంటున్న భూములపై హక్కులు కోల్పోయామని రైతులు మంత్రికి విన్నవించిన నేపథ్యంలో, ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ జరిపి వాస్తవాలను వెలికితీసి అర్హులైన వారికి న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో శివారు వెంకటాపూర్ గ్రామానికి చెందిన తుమ్మల సత్యనారాయణ, శేరి పోషయ్య, శేరి శ్రీకాంత్, పుట్ట విఠల్, పుట్ట దయానంద్, బచ్చలి జహంగీర్ తదితరులు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.

గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. శివారు వెంకటాపూర్ గ్రామంలోని సర్వే నంబర్లు 38, 41, 47, 85, 88, 100లోని దాదాపు 134 ఎకరాల వ్యవసాయ భూముల్లో తమ తాత ముత్తాతల కాలం నుంచి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. అయితే ధరణి పోర్టల్ వచ్చిన తర్వాత రికార్డులను తారుమారు చేయడం ద్వారా తమ భూములపై హక్కులు లేకుండా చేశారని, తమ పొలాలు తమకు కాకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ధరణి అమలుకు ముందు తమ వద్ద ఉన్న పాస్‌బుక్కులు, గ్రామ నక్షా పత్రాలను కూడా రైతులు మంత్రికి చూపించారు. ఆనాటి ప్రభుత్వంలో అధికారులు కొత్త పాస్‌బుక్కులు ఇస్తామని చెప్పి తమ వద్ద ఉన్న పాత పాస్‌బుక్కులను తీసుకున్నారని, అయితే కొత్త పాస్‌బుక్కులు ఇవ్వకుండా తమను మోసం చేశారని వారు మంత్రికి వివరించారు. ఆనాటి ప్రభుత్వ హయాంలో ఓవర్ మ్యాపింగ్ పేరుతో శివారు వెంకటాపూర్ గ్రామ వ్యవసాయ భూములను ఎర్రవెల్లి గ్రామంలోని సర్వే నంబర్ 325లో కలిపి నక్షా రూపొందించారని, దీనివల్ల తమకు తీవ్ర అన్యాయం జరిగిందని రైతులు ఆరోపించారు. ప్రస్తుతం ఎర్రవెల్లిలోని సర్వే నంబర్ 325లో ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వే తరహాలోనే శివారు వెంకటాపూర్ గ్రామంలోనూ సమగ్ర సర్వే నిర్వహించి, గ్రామ సరిహద్దులను స్పష్టంగా గుర్తించి, రికార్డులు-పాత పాస్‌బుక్కులు-గ్రామ నక్షా-క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించి ఎవరికి చెందిన భూమి వారికి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన శివారు వెంకటాపూర్ గ్రామ రైతులకు ఇప్పటివరకు ఎలాంటి పరిహారం అందలేదని మంత్రికి వివరించారు. అదేవిధంగా దేవాసుకుంట, ముత్తిలింగం కుంటలను కూడా పాండురంగా రిజర్వాయర్‌లో విలీనం చేశారని తెలిపారు. రిజర్వాయర్ నిర్మాణం, భూముల మ్యాపింగ్, రికార్డుల మార్పుల కారణంగా తమ గ్రామ రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను విన్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి వాస్తవాలను నిర్ధారిస్తామని స్పష్టం చేశారు. అర్హులైన ఏ ఒక్కరికీ అన్యాయం జరగనివ్వం. ఎవరి భూమి వారికి దక్కేలా చట్టపరమైన అన్ని చర్యలు తీసుకుంటాం" అని మంత్రి హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో రెవెన్యూ సెక్రటరీ డిఎస్ లోకేష్ కుమార్, సర్వే ఒ ల్యాండ్ సెటిల్‌మెంట్స్ కమీషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

తుమ్మిడిహెట్టి నిర్మాణానికి
అనుమతులు ఇప్పించండి

మొదటి పేజీ తరువాయి...

ఆ స్థాయిలో బ్యారేజీ నిర్మిస్తే గ్రావిటీ ఆధారంగా నీటిని ఎల్లంపల్లికి తరలించేందుకు వీలుంటుందని తెలిపారు. దాంతో నీటి తరలింపునకు అవసరమయ్యే విద్యుత్ వినియోగం, విద్యుత్ వ్యయం తగ్గుతుందని వివరించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం (పీఆర్ఎల్ఐఎస్), డిండి ఎత్తిపోతల పథకం (డీఎల్ఐఎస్), సీతారామ సాగర్ బహుళార్థక ప్రాజెక్టు (ఎస్ఎస్ఎంపీ), గౌరవెల్లి రిజర్వాయర్లకు పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు విజ్ఞప్తి చేశారు. ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పర్యావరణ అనుమతులకు మార్గదర్శకాలను జారీ చేస్తామని కేంద్రం ప్రకటించిన నేపథ్యంలో ఆయా ప్రాజెక్టులకు వెంటనే పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని సీఎం కోరారు. అనుమతుల జాప్యంతో ప్రాజెక్టుల నిర్మాణ వ్యయం పెరుగుతోందని సీఎం తెలిపారు. సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) వద్ద పెండింగ్‌లో ఉన్న అనుమతులను త్వరగా మంజూరు చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టు డీపీఆర్‌ను సీడబ్ల్యూసీకి సమర్పించామని, నీటిపారుదల ప్రణాళిక, అంతర్రాష్ట్ర అంశాలకు సంబంధించిన అనుమతులు ఇవ్వాలని కోరారు. ఈ ప్రాజెక్టుకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నుంచి నిరభ్యంతర పత్రం పొందేందుకు తాము చర్చిస్తున్నామని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) ఆధ్వర్యంలో చేపడుతున్న టెలిమెట్రీ యంత్రాలను త్వరగా ఏర్పాటు చేయాలని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. మొదటి దశ టెలిమెట్రీ యంత్రాల ఏర్పాటుకు అవసరమైన రూ.4.15 కోట్లను తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే జమ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా సీఎం గుర్తు చేశారు. మొదటి దశ టెలిమెట్రీ యంత్రాలను ఏర్పాటు త్వరగా పూర్తి చేయడంతో పాటు రెండు, మూడో దశలకు సంబంధించిన యంత్రాలను త్వరగా ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర మంత్రి జి. వివేక్ వెంకటస్వామి, ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యే గడ్డం వినోద్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (నీటిపారుదల) ఆదిత్యనాథ్ దాస్, సీఎం సెక్రటరీ మాణిక్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో విస్తృతమైన పెట్టుబడి అవకాశాలు

మొదటి పేజీ తరువాయి...

ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ గారు, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ గార్లను భారత కాన్సులేట్ ప్రతినిధులు శాలువాతో సత్కరించారు. అంతకుముందు.. ఈ బృందానికి అక్కడి అధికారులు ఘన స్వాగతం పలికారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గారు మాట్లాడుతూ.. "తెలంగాణ రాష్ట్రంలో ఇన్వెస్టర్స్ కు అపారమైన అవకాశాలు ఉన్నాయని, గ్రేటర్ హైదరాబాద్ చాలా వేగంగా అభివృద్ధి చెందుతోందని చెప్పారు. హైదరాబాద్ పెట్టుబడులకు అనుకూలమైన ప్రాంతంగా అభివృద్ధి చెందిందని, ముఖ్యంగా ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఇన్నోవేషన్ వంటి రంగాల్లో హైదరాబాద్ ప్రత్యేక గుర్తింపు సాధించిందన్నారు. విదేశాల్లో స్థిరపడిన తెలుగు ప్రజలు తమ మాతృభూమితో తమ అనుబంధాన్ని కొనసాగిస్తూనే, తెలంగాణ అభివృద్ధిలోనూ భాగస్వాములు కావాలి" అని పిలుపునిచ్చారు. జర్మనీతో పాటు యూరప్‌లోని పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు తెలంగాణలో ఉన్న అన్ని అవకాశాలను పరిశీలించాలని కోరారు. ప్రవాస తెలంగాణ వాసులు రాష్ట్రానికి పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాలను తీసుకురావడంలో గొప్ప వారధిగా నిలవాలని స్పీకర్ ప్రసాద్ సూచించారు. "ప్రపంచంలోని వివిధ దేశాల్లో ఉన్న తెలుగు వాళ్లు తమ ప్రతిభతో ఉన్నత స్థానాలకు చేరుకోవడం చాలా గర్వకారణమని, వారు జన్మభూమి అభివృద్ధికి తమవంతు సహకారం అందించాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ గారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ శాసన మండలి సెక్రెటరీ డా నరసింహాచార్యులు, అసెంబ్లీ సెక్రెటరీ ఆర్ తిరుపతి, లేజిస్లేచర్ ప్రతినిధి బృందం సభ్యులు, భారత కాన్సులేట్ అధికారులు, తెలుగు ప్రవాసులు తదితరులు పాల్గొన్నారు. జర్మనీ-భారత పార్లమెంటరీ మైత్రి కార్యక్రమంలో భాగంగా 2024లో జర్మనీలోని రైన్‌ల్యాండ్ రాష్ట్ర స్పీకర్ హెండ్రిక్ హెరింగ్ గారి బృందం హైదరాబాద్‌లోని అసెంబ్లీని సందర్శించింది. ఇప్పుడు దానికి రిటర్న్ విజిట్‌గా తెలంగాణ స్పీకర్ గారి బృందం జర్మనీలో పర్యటిస్తోంది. యూరప్ లోని జర్మనీ తర్వాత ఆస్ట్రియా, స్విట్జర్లాండ్ లో ఈ బృందం పర్యటించనుంది.

వచ్చే నెల 9వ తేదీన శాసన సభ స్పీకర్ గారు, శాసన మండలి చైర్మన్ గారి నేతృత్వంలోని ప్రతినిధి బృందం తిరిగి హైదరాబాద్ కు చేరుకుంటుంది. సెప్టెంబర్ 13 నుంచి 18వ తేదీ వరకు దక్షిణాఫ్రికాలోని కేప్ టౌన్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ లో కామన్వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్స్ జరిగింది. కామన్వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్స్ కు కొనసాగింపుగా విదేశీ పర్యటనకు ఈ బృందం వెళ్లింది. విదేశీ పర్యటనలో భాగంగా రాష్ట్ర అసెంబ్లీ ప్రతినిధి బృందం ఆయా దేశాల పార్లమెంట్లను సందర్శించి, అక్కడి పార్లమెంటరీ విధానాలను పరిశీలిస్తుంది.

ఉద్యోగులు.. క్రీడలు, కళలపై ఆసక్తి పెంచుకోవాలి

మొదటి పేజీ తరువాయి...

సిబ్బందిలో దాగి ఉన్న కళా ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఉద్యోగులు కేవలం ఫైళ్లు, విధులు, బాధ్యతలకే పరిమితం కాకుండా తమలోని సృజనాత్మకతను కూడా వెలికితీయాలని సూచించారు. గెలుపు, ఓటమి కంటే కార్యక్రమాల్లో పాల్గొనడం, తమ ప్రతిభను ప్రదర్శించడం, సహోద్యోగులతో కలిసి ఆనందాన్ని పంచుకోవడం ముఖ్యమని చెప్పారు. ఉద్యోగుల్లో ఉత్సాహాన్ని పెంచేందుకు తరచుగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకోవాలని జూపల్లి సూచించారు. ఉద్యోగులు బాగా పనిచేస్తే దాని ప్రభావం ప్రభుత్వ పనితీరు, ప్రజలకు అందే సేవలపై ఉంటుందని అన్నారు. విధులతో పాటు ఆటలు, క్రీడలు, పాటలపై ఆసక్తి పెంచుకోవడం వల్ల ఉద్యోగుల్లో కొత్త ఉత్సాహం వస్తుందని పేర్కొన్నారు.

ప్రాచీన సంస్కృతిని కాపాడుకోవాలి

భారతదేశానికి ఎంతో ప్రాచీనమైన సంస్కృతి, సంప్రదాయాలు, కళలు ఉన్నాయని మంత్రి తెలిపారు. విదేశాల్లో స్థిరపడిన భారతీయులు సైతం తమ పిల్లలకు భారతీయ కళలు, సంస్కృతిని నేర్పిస్తున్నారని గుర్తుచేశారు. ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తిస్తూనే మన పూర్వీకులు అందించిన కళలు, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు.

పాటలే ఉద్యమానికి స్ఫూర్తి

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమాన్ని మంత్రి గుర్తుచేసుకున్నారు. 2011లో ఎమ్మెల్యే, మంత్రి పదవులకు రాజీనామా చేసి ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పాదయాత్ర చేపట్టిన సమయంలో ఆటపాటలే తనకు ఎంతో స్ఫూర్తినిచ్చాయని తెలిపారు.

తెలంగాణ రాష్ట్రం సిద్ధించి ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని ఎంతో మంది ప్రాణత్యాగాలు చేశారని అన్నారు. వారి త్యాగాలను స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని ఆకాంక్షించారు. ఉద్యోగుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఉద్యోగులు చేపట్టే సాంస్కృతిక కార్యక్రమాలకు సాంస్కృతిక శాఖ తరఫున అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంగీత దర్శకుడు రాధాకృష్ణ, తెలంగాణ సచివాలయ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు గిరి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జే. ప్రేమ్, ఉపాధ్యక్షుడు నవీన్‌కుమార్, కల్చరల్ సెక్రటరీ యామిని కనకతార తదితరులు పాల్గొన్నారు.

ఈ ఖరీఫ్‌లో పప్పుధాన్యాల సాగు వృద్ధిలో 36% తో దేశంలోనే
రెండో స్థానంలో నిలిచిన తెలంగాణ

మొదటి పేజీ తరువాయి...

పంటల వైవిధ్యీకరణ, వాతావరణ మార్పులను ఎదుర్కొనే వ్యవసాయం, డిజిటల్ వ్యవసాయం, వ్యవసాయ మౌలిక వసతులు, రైతులకు రుణ సదుపాయాలపై తెలంగాణలో అమలు చేస్తున్న చర్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. ఎల్‌నినో ప్రభావం, వర్షపాతంలో మార్పులు, దీర్ఘకాలిక పొడి పరిస్థితులు వంటి సవాళ్లను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి తెలిపారు.

వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతకు అనుగుణంగా రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లేలా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగానే పప్పుధాన్యాల సాగును ప్రోత్సహించడంతో 36% వృద్ధితో తెలంగాణ ముందువరసలో నిలిచిందని తెలిపారు. ప్రస్తుతం ఎల్‌నినో, కరువు పరిస్థితుల నేపథ్యంలో రైతులకు అండగా నిలిచేందుకు మొక్కజొన్న, జొన్నను ధరల మద్దతు పథకం (ూూ) పరిధిలోకి తీసుకురావాలని మంత్రి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలోని అనేక మండలాలు లోటు, తీవ్ర లోటు వర్షపాత పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని మంత్రి తెలిపారు. రాష్ట్ర సగటు వర్షపాతం ఆధారంగా కాకుండా మండలాల స్థాయిలో నెలకొన్న వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని, లోటు, తీవ్ర లోటు వర్షపాత మండలాలకు ప్రత్యేక కేంద్ర సహాయం అందించాలని కోరారు. సూక్ష్మ సాగునీరు, రక్షిత సాగునీరు, నీటి సంరక్షణ నిర్మాణాలకు ప్రత్యేక సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఆయిల్‌పామ్ సాగు విషయంలో తెలంగాణ రైతులు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపునకు సానుకూలంగా స్పందించారని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో అదనంగా దాదాపు 1.10 లక్షల హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగు విస్తరించిందని, సుమారు 72 వేల మంది కొత్త రైతులు ఆయిల్‌పామ్ సాగులోకి వచ్చారని వివరించారు. ఆయిల్‌పామ్ దీర్ఘకాలిక పంట కావడంతో రైతులకు స్థిరమైన, గిట్టుబాటు ధరలు ఎంతో ముఖ్యమని, రైతుల్లో నమ్మకాన్ని కొనసాగించేందుకు కేంద్రం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయిల్‌పామ్ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని క్రూడ్ పామ్ ఆయిల్ దిగుమతి సుంకాన్ని గతంలో ఉన్న 44 శాతానికి పునరుద్ధరించాలని మంత్రి తుమ్మల కేంద్రాన్ని కోరారు. దేశీయంగా ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తూ రైతులను ఈ దీర్ఘకాలిక పంట వైపు తీసుకెళ్తున్న సమయంలో దిగుమతుల విధానం కూడా రైతులకు అనుకూలంగా ఉండాల్సిన అవసరం ఉందని తెలిపారు. దీనిపై స్పందించిన కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్, ఆయిల్‌పామ్ ధరలపై ప్రత్యేక కమిటీని నియమించి రైతుల సమస్యలను పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు మంత్రి శ్రీ తుమ్మల తెలిపారు. తెలంగాణలో మట్టి ఆరోగ్య పరీక్షల లక్ష్యాన్ని ప్రస్తుతమున్న సుమారు లక్ష నుంచి రెండు లక్షల నమూనాలకు పెంచాలని మంత్రి కోరారు. శాస్త్రీయ మట్టి పరీక్షల ద్వారా సమతుల్య ఎరువుల వినియోగం, సాగు ఖర్చుల తగ్గింపు, ఉత్పాదకత పెంపునకు అవకాశం ఉంటుందని తెలిపారు. తెలంగాణలో 33 జిల్లాలు ఉండగా ప్రస్తుతం 16 కృషి విజ్ఞాన కేంద్రాలు మాత్రమే ఉన్నాయని మంత్రి తెలిపారు. వ్యవసాయ పరిశోధన, విద్య ద్వారా అభివృద్ధి చెందుతున్న కొత్త సాంకేతిక పరిజ్ఞానం వేగంగా రైతులకు చేరాలంటే వ్యవసాయ విస్తరణ వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణకు అదనంగా 16 కృషి విజ్ఞాన కేంద్రాలను మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వం, ఐసీఏఆర్‌ను కోరారు. కొడంగల్‌లో అగ్రి బిజినెస్ పార్క్, సెమీ-అరిడ్ హార్టికల్చర్ క్రాప్స్ కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం డీపీఆర్‌లను సమర్పించిందని మంత్రి తెలిపారు. ఈ రెండు కీలక ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం అవసరమైన సహకారం అందించాలని కోరారు.

రైతులకు కేవలం విత్తనాలు, ఎరువులు మాత్రమే కాకుండా సాంకేతిక పరిజ్ఞానం, నేల ఆరోగ్య సమాచారం, సకాలంలో రుణాలు, శాస్త్రీయ సలహాలు, నీటి పొదుపు విధానాలు, వ్యవసాయ విస్తరణ సేవలు, మౌలిక వసతులు, నమ్మకమైన మార్కెట్లు అవసరమని మంత్రి పేర్కొన్నారు. పరిశోధన, వ్యవసాయ విద్య, విస్తరణ వ్యవస్థలు సమన్వయంతో పనిచేసినప్పుడే కొత్త సాంకేతిక పరిజ్ఞానం రైతులకు వేగంగా చేరుతుందని తెలిపారు.

తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన ప్రత్యేక అవసరాలను కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి అవసరమైన సహకారం అందించాలని మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

పార్టీ వైఫల్యాన్ని కేసీఆర్‌పై
మోపుతున్నావ్..

మొదటి పేజీ తరువాయి...

విధానపరమైన నిర్ణయాలను బాహాటంగా తప్పుపట్టడం పార్టీ వ్యతిరేక చర్య కాదా? మీ ఫాంహౌస్‌లు, అక్రమంగా ఇచ్చిన పర్మిషన్లు.. ఆంధ్రా దోస్తులకు ఇచ్చిన నజరానాలు.. క్విడ్ ప్రోకో దందాలతో మీ పార్టీని పాతాళంలోకి నెట్టింది మీరు కాదా?' అని కవిత నిలదీశారు. నిన్నటి బీఆర్ఎస్ మీటింగ్‌లో ఓ రైతు ఫోన్ మాట్లాడు తుంటే 'నీ పెండ్లామా!? అంత అర్జెంటా!? అని అహంకారంతో అతని భార్యనే అవమానిం చారని మండిపడ్డారు. అలాగే ఓ మహిళా సాయం కోరి వస్తే 'నా కోసం కన్నావా' అని అమ్మనే అవమానించారని ఆరోపించారు. 'గుంటనక్క MIND GAME లో BLIND గా పడిపోయి పెద్ద మనిషినే తప్పు బడుతున్నావ్.. బీఆర్ఎస్‌కు గోతిని తవ్వుతున్నావ్' అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'కూర్చున్న కొమ్మనే నరుక్కున్నట్టు.. పార్టీలో మీ వైఫల్యాన్ని.. మీ చేతగానితనాన్ని బీఆర్ఎస్ అధినేతపై మోపు తున్నావు అంటే... ప్రత్యక్ష రాజకీయాల్లో మీ స్థానం ఏమిటో అర్థమవుతుందా? నిమజ్జనోత్స వంలో ఎంతమంది సోషల్ మీడియా influencersను బతిమాలుకున్నారో ఆ గణేశ్ మహారాజుకు, మీ అంతరాత్మకు తెలుసు. నేను నీలాగా విష నాగుల మాటలు విని మాట్లాడ ను.. నిర్దిష్టమైన ఆధారాలతోనే మాట్లాడు తాను.. నాతో 'పెట్టుకోకు!' అంటూ కేటీఆర్‌ను ఉద్దేశించి ఎక్స్‌లో కవిత పోస్ట్ చేశారు.

వివక్ష, దాడులపై దళితులు, ఆదివాసీలు
ఐక్యంగా పోరాడాలి

మొదటి పేజీ తరువాయి...

ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ.. అంటరానితనానికి వ్యతిరేకంగా మహాత్మా గాంధీ అధ్యక్షతన తీర్మానం జరిగిందని గుర్తు చేశారు. ఆ తర్వాత దేశంలో దళితుల రక్షణ కోసం అట్రాసిటీ చట్టం వచ్చిందని పేర్కొన్నారు. మనుధర్మ శాస్త్రం పేరుతో వెనుకబడిన వర్గాలపై దాడులు జరుగుతున్నాయని.. వారిపై దళితులపై అట్రాసిటీలు ఆగాలని డిమాండ్ చేశారు. దేశంలో ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు, గౌరవం, రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు ఉత్తరాఖండ్‌లో జరిగిన ఘటనపై భట్టి విక్రమార్క తీవ్రంగా స్పందించారు. అంచెలంచెలుగా ఎదిగి సీఎల్పీ నేతగా పని చేశారని, రాజ్యసభలో ప్రతిపక్ష నేతగా, ప్రస్తుతం ఏఐసీసీ అధ్యక్షుడిగా ఖర్గే కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారని అన్నారు. ఖర్గే హాజరైన వేదికను అనంతరం శుద్ధి చేయడం అత్యంత దారుణమని భట్టి విమర్శించారు. బీజేపీ పాలనలో దళితులను రెండో తరగతి పౌరులుగా చూస్తున్నారనే భావన కలుగుతోందని ఆరోపించారు. దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావాల్సిన అవసరం ఉందని, అప్పుడే ప్రతి ఒక్కరికీ రక్షణ, సమానత్వం దక్కుతుందని భట్టి విక్రమార్క అన్నారు.

అనంతరం కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ.. దేశంలో ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా బీజేపీ పాలన కొనసాగుతోందని ఆరోపించారు. సమాజానికి వ్యతిరేకంగా మనువాద భావజాలాన్ని అమలు చేస్తున్నారని విమర్శించారు. సనాతన ధర్మం పేరుతో అంటరానితనాన్ని పెంచి పోషిస్తున్నారని ఆరోపించారు.

ఉత్తరాఖండ్‌లో ఖర్గే సమావేశం అనంతరం జరిగిన పరిణామాలను బీజేపీ, ఆర్ఎస్ఎస్ వ్యతిరేకించక పోవడం పలు ప్రశ్నలకు తావిస్తోందన్నారు. తెలంగాణలో గతంలో కాంగ్రెస్ దళిత నేతలు కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్దకు వెళ్లిన సందర్భంలో పసుపు నీళ్లు చల్లిన ఘటనను కూడా అద్దంకి దయాకర్ ప్రస్తావించారు. 'ఢిల్లీలో పెద్ద మోదీ.. గల్లీలో చిన్న మోదీ కేసీఆర్' సనాతన ధర్మం పేరుతో మనువాదాన్ని అమలు చేస్తున్నారని ఆరోపించారు. ఖర్గేపై దాడిని రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా భావిస్తున్నామని అన్నారు. ఈ విషయంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ మూల్యం చెల్లించుకోక తప్పదని వ్యాఖ్యానించారు. కాగా, దళితులు, ఆదివాసీల ఆత్మగౌరవం, హక్కులు, సమానత్వం కోసం పోరాటాన్ని మరింత బలోపేతం చేయాలని సమావేశంలో కాంగ్రెస్ నేతలు పిలుపునిచ్చారు.

హాస్టల్ విద్యార్థుల సంక్షేమంపై రాజీ పడేది లేదు

మొదటి పేజీ తరువాయి...

హాస్టల్‌ను సందర్శించి, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులు, కిచెన్ షెడ్, డైనింగ్ హాల్ తోపాటు హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ సంక్షేమ హాస్టల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటుగా, పౌష్టిక ఆహారం అందించాలని లక్ష్యంగా పెట్టుకొని ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు. ఇందులో భాగంగా విద్యార్థులకు డైట్ చార్జీలు పెంచి, విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలని మెనూలో మార్పులు తీసుకువచ్చినట్లు వివరించారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుందని అన్నారు. చిన్న బోనాల ఎస్టి గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న బియ్యం నాణ్యతను పరిశీలించిన మంత్రి వాటిని వెనక్కి తీసుకొని నాణ్యమైన బియ్యం పంపించాలని అధికారులకు అప్పటికప్పుడు ఆదేశించారు. అదేవిధంగా చిన్న బోనాల గురుకుల పాఠశాలకు కావలసిన మౌలిక సదుపాయాలకు అవసరమైన అంచనాలు తయారు చేసి, తొందరగా అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఎరువులు పురుగు మందులు దుకాణాల ఆకస్మిక తనిఖీ

ఎండపల్లి, సెప్టెంబర్ 29 : (ప్రజా కలం ప్రతినిధి) మండలంలోని వివిధ



ఎరువులు, పురుగు మందుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి కామళ్ల మహేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లో ని ఎరువులు, పురుగు మందుల నిల్వలను పరిశీలించడం తో పాటు నిల్వ రిజిస్టర్లు, విక్రయ బిల్లులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలని సూచించారు. ప్రతి అమ్మకానికి రైతులకు తప్పనిసరిగా బిల్లు అందించాలని స్పష్టం చేశారు. అనుమతి లేని కంపెనీల నిల్వలను ఉంచినా, లైసెన్సులో నమోదు కానీ కంపెనీల ఉత్పత్తులను అమ్మినా, ఎంఆర్పీ రేటు కంటే ఎక్కువ ధరలకు విక్ర యించినా దుకాణదారుల పై చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ అధికారి కామల్ల మహేష్ హెచ్చరించారు.

పారిశుద్ధ్యం పరార్... రోగాల బారిన జనం

- రహదారులపై చీపురు పట్టిన గులాబీ శ్రేణులు



పెద్దపల్లి, సెప్టెంబర్ 29:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

పెద్దపల్లి పట్టణంలో మున్సిపల్ అధికారులు పారిశుద్ధ్యాన్ని పూర్తిగా గాలికి వదిలేశారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో వినూత్న నిరసన చేపట్టారు. పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజకుమార్ నాయకత్వంలో నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ మాతా శిశు సంరక్షణ కేంద్రం ఎదుట రహదారిపై చీపుర్లతో రోడ్లను ఊడ్చి అధికారుల తీరును ఎండగట్టారు.ఈ సందర్భంగా ఉప్పు రాజకుమార్,కౌన్సిలర్ వెన్నం సుజాత-రవీందర్,మాజీ కౌన్సిలర్ బిక్షపతి మాట్లాడుతూ ప్రస్తుతం పెద్దపల్లి కాస్త దుబ్బపల్లిగా మారిందని ఎద్దేవా చేశారు.ఆసుపత్రులు,పాఠశాలలు,కళాశాలలు ఉన్న ప్రధాన రహదారులతో పాటు కమాన్ రోడ్డు,బస్టాండ్,టీచర్స్ కాలనీ ప్రాంతాలన్నీ దుమ్ముతో నిండిపోయాయని మండిపడ్డారు.గతంలోలా రోడ్లను క్రమం తప్పకుండా శుభ్రం చేయకపోవడం వల్ల ప్రజలు,ముఖ్యంగా చిన్నపిల్లలు,వృద్ధులు శ్వాసకోశ సమస్యల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.అధికారులు ఇప్పటికైనా స్పందించి పట్టణంలో రోడ్ల శుభ్రతను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు పూదరి చంద్రశేఖర్,ఖదీర్ ఖాన్,కనుకుర్తి కార్తీక్,నాయకులు ఎండీ ఫహీం,జావీద్,పల్లె మధు,కొంతం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా జాడి శ్రీనివాస్ నియామకం

ధర్మారం, సెప్టెంబర్ 29 : (ప్రజా కలం ప్రతినిధి) మండలంలోని గోపాల్ రావుపేట గ్రామానికి చెందిన జాడి శ్రీనివాస్ తెలంగాణ జాగృతి రాష్ట్ర ఉ పాధ్యక్షులుగా నియామక మయ్యారు. స్వతహాగా కవి, గాయకుడు అయిన ఆయన



తెలంగాణ ఉద్యమం లో తన ఆట పాటలతో తెలంగాణ చైత న్యాన్ని కల్పించారు. ఉద్యమ సమయం లో తెలంగాణ విద్యావంతుల వేదికలో చురుకుగా పాల్గొన్న జాడి శ్రీనివాస్ కల్వకుంట్ల కవిత పిలుపు మేరకు జాగృతిలో ధర్మపురి నియోజకవర్గ కన్వీనర్ గా బాధ్యతలు చేపట్టి, అనతి కాలం లోనే ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి జాగృతి బలో పేతానికి విశేషంగా కృషి చేశారు. జాగృతి ఆశయా లైన తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణ తో పాటు కవి సమ్మేళ నాలు, తెలంగాణ చరిత్ర, విద్యపై విశేషంగా పనిచేసి శభాష్ అనిపించుకున్నారు. జాగృతి ఆధ్వర్యంలో ఎన్నో సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకుని పలువురు చేత మన్ననలు పొందారు. నిన్న ప్రకటించిన జాగృతి కమిటీ లో రాష్ట్ర ఉపాధ్య క్షులుగా నియామకం కావడం తో పలువురు అభినందించారు. రాష్ట్ర స్థాయి లో తనకు కీలక బాధ్యత అప్పగించిన జాగృతి వ్యవస్థాపకులు కల్వకుంట్ల కవిత కు ధన్యవాదాలు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా తెలంగాణ లో సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణ తో పాటు తెలంగాణ పండుగలు, కవి సమ్మేళ నాలు, సాహితీ కార్య క్రమాలు నిర్వహించి జాగృతి బలోపేతానికి కృషి చేసస్తూ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తా నని జాడి శ్రీనివాస్ తెలిపారు.

టిపిసిసి జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా కాంపెల్లి సతీష్

బెల్లంపల్లి,సెప్టెంబర్ 29(ప్రజాకలం):తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మంచిర్యాల జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా బెల్లంపల్లి పట్టణానికి



చెందిన కాంపెల్లి సతీష్ నియమి తులయ్యారు.ఈ మేరకు జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ నర్సింగ్ ఆయనకు అధికారిక నియామక పత్రాన్ని అందజేశారు.ఈ నందర్భంగా కాంపెల్లి సతీష్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని స్పష్టం చేశారు.కాంగ్రెస్ పార్టీ బలోపే తానికి నిరంతరం శ్రమిస్తూనే, ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రతి గడపకూ చేరేలా విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తానని తెలిపారు.తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ అధిష్ఠానానికి, సీనియర్ నాయకులకు మరియు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొని సతీష్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

పేదల సంక్షేమం పై కేటీఆర్ చిన్న చూపు

- సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ - సిరిసిల్ల సభను విజయవంతం చేయాలని పిలుపు



వెల్గటూర్, సెప్టెంబర్ 29, ప్రజాకలం, ప్రతినిధి :

సిరిసిల్ల నియోజకవర్గంలోని పేదలంటే కేటీఆర్ కు చిన్న చూపని, అధికారంలో ఉన్నప్పుడు ఏనాడు పట్టించుకోలేదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. సిరిసిల్లలో నేడు జరుగనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాదయాత్ర, బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్లను రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ లు ఆది శ్రీనివాస్, విజయ రమణారావు తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ 2014 నుండి 2023 వరకు మంత్రిగా పనిచేసిన కేటీఆర్ సిరిసిల్ల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు తాము భావించామని కాని అవేమీ ఇక్కడ జరగలేదని అన్నారు. సిరిసిల్ల ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని పెద్ద సంఖ్యలో వచ్చి విజ్ఞాపనలు చేస్తున్నారని తెలిపారు. దళితుల సమస్యల పై కేటీఆర్ కు చిత్తశుద్ధి లేదని సిరిసిల్లలో జరిగిన పలు సంఘటనలను చూస్తే అర్థమవుతుందని అన్నారు. సిరిసిల్లలో కరకట్ట నిర్మాణంతో పాటు సివరేజ్ ప్లాంట్ నిర్మాణంతో దళితులకు అసైన్మెంట్ చేసిన 300 ఎకరాల భూములు సాగుకు నోచుకోవడం లేదని అన్నారు. సిరిసిల్ల నియోజకవర్గంలోని అనేక గ్రామాలల్లో చాలా సమస్యలు నెలకొని ఉన్నాయని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిరిసిల్ల నియోజకవర్గ ప్రజల సమస్యలను పరిష్కారించేందుకోసం నేడు భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి హాజరు కానున్న బహిరంగ సభకు అన్ని వర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పుష్కరాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



జగిత్యాల ప్రతినిధి సెప్టెంబర్ 29 (ప్రజాకలం)

గోదావరి పుష్కరాలు-2027 నేపథ్యంలో జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనులు, భక్తులకు కల్పించాల్సిన మౌలిక వసతులు, భద్రతా ఏర్పాట్లపై మంగళవారం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పుష్కరాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.జిల్లాలో ధర్మపురి, కోటిలింగాల, వెల్గటూర్, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, బీర్పూర్, రాయికల్ మండలాల పరిధిలోని గోదావరి తీర ప్రాంతాల్లో పుష్కర ఘాట్లను అభివృద్ధి చేస్తున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. పుష్కరాల సందర్భంగా జిల్లాలో సుమారు 2.40 కోట్ల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు.పుష్కరాల ఏర్పాట్ల కోసం వివిధ శాఖలకు కలిపి రూ.220.41 కోట్ల నిధులు మంజూరైనట్లు వివరించారు. ఇరిగేషన్, ఎండోమెంట్స్, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, ప్రజారోగ్యం, నీటి సరఫరా-పారిశుధ్యం, పర్యాటకం తదితర శాఖల ఆధ్వర్యంలో వివిధ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని అన్నారు.ధర్మపురి ఉగ్ర నరసింహస్వామి ఆలయ పునరుద్ధరణకు రూ. 10 కోట్లు, కోటిలింగాల ఆలయ పునరుద్ధరణకు రూ. 10 కోట్లు మంజూరై పనులు ప్రారంభమైనట్లు అధికారులు తెలిపారు.కోటిలింగాల ఆలయ పునరుద్ధరణలో భాగంగా పాత ఆలయ కూల్చివేత పనులు పూర్తయ్యాయని వివరించారు.ధర్మపురి, కోటిలింగాల ఘాట్ల విస్తరణ, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. ధర్మపురి ఘాట్లకు, కోటిలింగాల ఘాట్‌కు ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు అధికారులు వివరించారు.పుష్కరాలకు వచ్చే భక్తుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రహదారుల అభివృద్ధి, విస్తరణ, ఘాట్లకు అనుసంధాన రహదారుల నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ధర్మపురి, కోటిలింగాల ప్రాంతాల్లో పలు రహదారి పనులకు టెండర్లు ఖరారైనట్లు అధికారులు తెలిపారు.భక్తులకు నిరంతర తాగునీటి సరఫరా, పారిశుధ్య సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ధర్మపురి మున్సిపాలిటీకి రూ.2 కోట్లు, కోటిలింగాలకు రూ.48 లక్షలతో శాశ్వత నీటి సరఫరా, పారిశుధ్య సదుపాయాల పనులు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.పుష్కరాల సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా అవసరమైన విద్యుత్ మౌలిక వసతులను ముందుగానే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వివిధ ఘాట్లు, పార్కింగ్ ప్రాంతాలు, ఆలయాల పరిసరాల్లో తాత్కాలిక, శాశ్వత విద్యుత్ ఏర్పాట్లను చేపడుతున్నట్లు అధికారులు వివరించారు.భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఘాట్ల వద్ద పోలీస్ బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, అత్యవసర సేవలకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని సూచించారు. వైద్య శిబిరాలు, పారిశుధ్య సిబ్బంది, తాగునీరు, విద్యుత్, రహదారులు, పార్కింగ్ తదితర అన్ని అంశాల్లో శాఖల మధ్య సమన్వయం ఉండాలని అధికారులకు సూచించారు. ప్రతి శాఖకు కేటాయించిన పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసి, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు.ఈ సమీక్షలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాజ గౌడ్, ఆర్డీవోలు, కలెక్టరేట్ ఏవో కిషన్, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ అధికారులు, తహసీల్దార్ లు, ఎంపిడివోలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాయికల్ మండలంలో రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీ

- విద్యార్థుల భద్రత, సౌకర్యాలకు అత్యంత ప్రాధాన్యత - జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్

- ఆహారం, పారిశుధ్యం, ఉపాధ్యాయులు-విద్యార్థుల హాజరు, మౌలిక వసతుల పరిశీలన



జగిత్యాల ప్రతినిధి సెప్టెంబర్ 29 (ప్రజా కలం)

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మంగళవారం రాయికల్ మండలంలోని జగన్నాథ్ పూర్, ఒడ్డె లింగాపూర్ గ్రామాల్లోని రెసిడెన్షియల్ విద్యాసంస్థలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, పాఠశాలల నిర్వహణ, ఆహారం, పారిశుధ్యం, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, మౌలిక వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఆహారం తయారీ, ఆహార పదార్థాల నిల్వ, వినియోగంలో నిర్దేశిత ప్రామాణిక నిర్వహణ విధానాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యత, వంటశాలల పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణ, ఉ పాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు తదితర అంశాలను సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో వంటశాలల పరిస్థితులను పరిశీలించి, అవసరమైన చోట ఆధునీకరణ పనులను వీలైనంత త్వరగా చేపట్టాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందుతున్నాయా, మౌలిక వసతుల్లో ఏవైనా లోపాలు ఉన్నాయా అనే అంశాలను క్షేత్రస్థాయిలో నిరంతరం పరిశీలిస్తూ, సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రానున్న శీతాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు స్నానానికి వెచ్చని నీరు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు చేపట్టాలని, అవసరమైన దుప్పట్లు, ఇతర వసతులను ముందుగానే సమకూర్చాలని తెలిపారు. రెసిడెన్షియల్ విద్యాసంస్థల భవనాల్లో అవసరమైన మార్పులు, మరమ్మతులు చేపట్టి విద్యార్థులకు సురక్షితమైన, అనుకూలమైన వాతావరణం కల్పించాలని సూచించారు.అనంతరం ఉప్పుమడుగు గ్రామంలో నిర్మాణంలో ఉన్న రెసిడెన్షియల్ పాఠశాల భవనాన్ని పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. మిగిలిన పనులను వేగవంతం చేసి నెలలోపు భవన నిర్మాణాన్ని పూర్తి స్థాయిలో పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి పి. నరేష్, జిల్లా విద్యాశాఖ అధికారి కె.రాము, తహసీల్దార్ నాగార్జున, ఎంపిడివో నాగార్జున, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో కాంస్య పతకం సాధించిన విద్యార్థి



ధర్మారం, సెప్టెంబర్ 29 : (ప్రజా కలం ప్రతినిధి) మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ చదువుతున్న సంపతి రక్షిత రాష్ట్రస్థాయి జూని యర్ అథ్లెటిక్స్ పోటీలలో అండర్ 18 బాలికల డిస్కస్ త్రో రాష్ట్ర స్థాయి లో మూడవ స్థానం సాధించి కాంస్య పథకాన్ని పొందినట్లు ప్రిన్సిపల్ ఈరవేణి రాజకుమార్ తెలిపారు. ఈనెల 26 నుండి 27 వరకు హనుమకొండ లో జరిగిన 12 వ తెలంగాణ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ అసోసి యేషన్ పోటీల లో పాల్గొని మూడవ స్థానం సాధించ డం జరిగిందని రాజ్ కుమార్ తో పాటు ఉపాధ్యాయులు బైకని కొమరయ్య, మేకల సంజీవరావు సంపతి రక్షిత ను అభినందించారు.

మెట్ పల్లి జర్నలిస్టు నాయకుల ఔదార్యం

- పేద పాత్రికేయుడి వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

- కుటుంబ సభ్యులకు రూ. 22 వేల ఆర్థిక సాయం అందజేత



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి సెప్టెంబర్ 29 (ప్రజా కలం) కష్టకాలంలో తోటి జర్నలిస్టుకు అండగా నిలుస్తూ మెట్ పల్లి ప్రెస్ క్లబ్ నాయకులు ఔదార్యాన్ని చాటుకున్నారు. రోడ్డు ప్ర



మాదానికి గురై కరీంనగర్ లోని ఓ ప్రైవేటు ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న పేద పాత్రికేయుడు గాజుల నాగరాజు వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సాయం అందించా రు.మంగళవారం కరీంనగర్ లోని ఐకాన్ ఆసుపత్రికి వెళ్లిన ప్రెస్ క్లబ్ నాయకులు నాగరాజును పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులు, కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. నాగరాజు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం వైద్య ఖర్చుల భారాన్ని కొంతమేర తగ్గించేందుకు తమ వంతుగా ఆర్థిక సహాయం రూ. 22 వేల ఆర్థిక సాయం కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా జర్నలిస్టు నాయకులు మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న తోటి జర్నలిస్టులకు తమ వంతు సహకారం అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటామని తెలిపారు. పాత్రికేయుల సంక్షేమం కోసం ప్రెస్ క్లబ్ తరఫున భవిష్యత్తులోనూ అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఐజేయూ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బూరం సంజీవ్, జనరల్ సెక్రెటరీ మహమ్మద్ అజీమ్, గౌరవ సలహాదారు దాసం కిషన్, ఉపాధ్యక్షుడు మహమ్మద్ అఫ్రోజ్‌తో పాటు ప్రింట్ మీడియా ప్రతినిధులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ రోడ్డుకు అడ్డుకట్ట..

చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు



మల్లాపూర్, సెప్టెంబర్ 29 (ప్రజా కలం ప్రతినిధి).మల్లాపూర్ మండలం లోని గొర్రెపల్లి-వాల్గొండ గ్రామాల మధ్య ఉన్న పంచాయతీ రాజ్ రోడ్డుకు అక్రమంగా అడ్డుకట్ట వేసి రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గొర్రెపల్లి, వాల్గొండ, వాల్గొండ తండా గ్రామాల ప్రజలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.గొర్రెపల్లి-వాల్గొండ గ్రామాల మధ్య ప్రజలు, రైతులు, వాహనదారులు నిత్యం వినియోగించే పంచాయతీరాజ్ రోడ్డుకు సందిరెడ్డి జీవన్, సందిరెడ్డి భూమక్కలు అడ్డంగా అడ్డుకట్ట వేసి, ఈ రోడ్డు తమదేనంటూ అడ్డుకట్ట వేశారు గ్రామాల ప్రజలు పిర్యాదు చేసారు. రోడ్డుకు అడ్డుకట్ట వేయడంతో గొర్రెపల్లి, వాల్గొండ, వాల్గొండ తండా గ్రామాల ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.ప్రభుత్వ ఆధీనంలోని పంచాయతీరాజ్ రోడ్డుకు అడ్డంకులు సృష్టించడం సరికాదని, వెంటనే అడ్డుకట్టను తొలగించి ప్రజల రాకపోకలకు మార్గం సుగమం చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



పెద్దపల్లి,సెప్టెంబర్ 29:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ అరుణశ్రీతో కలిసి రోడ్డు భద్రతా ప్రమాణాలపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెద్దపల్లి పట్టణంలోని జంక్షన్లలో ఆక్రమణలు తొలగించి,రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలన్నారు.సుల్తానాబాద్-కాట్నపల్లి నీరుకుళ్ల వద్ద అవసరమైన చోట యూ టర్న్ ఏర్పాటు చేయాలని సూచించారు.రోడ్లపై పశువులను వదిలే వారిపై రూ.10 వేల జరిమానా విధించి,వాటిని గోశాలలకు తరలించాలని స్పష్టం చేశారు.ప్రతి పాఠశాల వద్ద తప్పనిసరిగా స్కూల్ జోన్ బోర్డులు ఏర్పాటు చేయాలని,రామగుండంలో అవసరమైన చోట్ల సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.రహదారుల పక్కన పిచ్చి మొక్కలు తొలగించడంతో పాటు భారీ వాహనాలు,కార్లకు రేడియం స్టిక్కర్లు ఉండేలా చూడాలన్నారు.హెల్మెట్,సీట్‌బెల్ట్ ధరించడం,మద్యం సేవించి వాహనాలు నడపకపోవడం వంటి రోడ్డు భద్రతా నిబంధనలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో ఆర్ అండ్ బి ఈఈ భావ్ సింగ్, డీఎంహెచ్ఓ డాక్టర్ పవిత్ర తదితర అధికారులు పాల్గొన్నారు.

ప్రజా కలం
బుధవారం, సెప్టెంబర్ 30, 2026

ఐదు రోజుల బ్యాంకింగ్..

సేవలకు కోత వద్దు

బ్యాంకు ఉద్యోగులకు వారానికి ఐదు రోజుల పని విధానం కావాలన్న డిమాండ్ కొత్తది కాదు. కానీ సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు మూడు రోజుల దేశవ్యాప్త సమ్మెకు యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ పిలుపునివ్వడంతో ఈ అంశం మరోసారి చర్చకు వచ్చింది. చివరి క్షణంలో ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్‌తో జరిగిన చర్చల అనంతరం సెప్టెంబర్ 27 రాత్రి సమ్మె వాయిదా పడింది. దీంతో ఖాతాదారులకు తక్షణ ఇబ్బంది తప్పింది. అయితే ఐదు రోజుల బ్యాంకింగ్‌పై నిర్ణయం తీసుకునే ముందు అసలు భాగస్వామి అయిన ఖాతాదారుడి ప్రయోజనాన్ని విస్మరిస్తే అది సంస్కరణ కాదు. ప్రస్తుతం రెండో, నాలుగో శనివారాలు బ్యాంకులకు సెలవులు. మిగిలిన శనివారాలనూ సెలవులుగా ప్రకటించాలన్నది ఉద్యోగ సంఘాల ప్రధాన డిమాండ్. సుమారు ఎనిమిది లక్షల మంది బ్యాంకు ఉద్యోగులకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు యూఎఫ్‌బీయూ చెబుతోంది. పని ఒత్తిడి, లక్ష్యాల భారం, సాంకేతిక మార్పులతో పెరిగిన బాధ్యతలు, పనిజీవిత సమతుల్యత వంటి కారణాలను ఉద్యోగ సంఘాలు ముందుకు తెస్తున్నాయి. ఆ వాదనను తేలిగ్గా కొట్టిపారేయలేం. కానీ దేశంలో బ్యాంకింగ్ పరిధి ఎంత విస్తరించిందో గణాంకాలే చెబుతున్నాయి. ప్రధానమంత్రి జనధన్ యోజన కింద 59 కోట్లకు పైగా ఖాతాలు ఉండగా, వాటిలో అత్యధికం గ్రామీణ, అర్ధపట్టణ ప్రాంతాలకు చెందినవే. ఈ ఖాతాల్లో లక్షల కోట్ల రూపాయల డిపాజిట్లు ఉన్నాయి. అంటే బ్యాంకు శాఖ అనేది నగర ఉద్యోగి జేబుఖాతాకు మాత్రమే పరిమితమైన వ్యవస్థ కాదు; కోట్లాది సామాన్యుల పొదుపులు, పింఛన్లు, సబ్సిడీలు, ప్రభుత్వ ప్రయోజనాలకు ఆధారం. డిజిటల్ విప్లవం కూడా తిరుగులేని వాస్తవమే. నెలకు 2,400 కోట్లకు పైగా యూపీఐ లావాదేవీలు జరుగుతున్న స్థాయికి దేశం చేరింది. వాటి విలువ దాదాపు రూ. 30 లక్షల కోట్లకు చేరుతోంది. ఇది డిజిటల్ బ్యాంకింగ్ బలాన్ని చూపుతున్నా, యూపీఐ ఉన్నంత మాత్రాన శాఖ అవసరం ముగిసిపోయిందని భావించడం ప్రమాదకరం. రుణాలు, చెక్కులు, కేవైసీ సమస్యలు, నామినేషన్లు, డిపాజిట్లు, పింఛన్ వ్యవహారాలు, నగదు అవసరాలకు ప్రత్యక్ష సేవ ఇప్పటికీ కీలకమే. అందుకే ఐదు రోజుల బ్యాంకింగ్ అమలు చేయాలంటే కొన్ని ప్రశ్నలకు ముందుగానే సమాధానం ఉండాలి. శాఖల పనిగంటలు పెరుగుతాయా? శనివారం సేవలకు ప్రత్యామ్నాయం ఏమిటి? గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ ప్రతినిధుల వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందా? వృద్ధులు, డిజిటల్ పరిజ్ఞానం తక్కువగా ఉన్నవారికి ప్రత్యేక ఏర్పాట్లు ఉంటాయా? సమ్మె వాయిదా పడటం సమస్య పరిష్కారమైనట్లు కాదు. అది చర్చకు లభించిన మరో అవకాశం మాత్రమే. ఉద్యోగుల సంక్షేమాన్ని కాపాడాలి. అదే సమయంలో ప్రజల సేవలను కుదించే నిర్ణయానికి సంక్షేమం అనే ముద్ర వేయకూడదు. వారానికి ఐదు రోజుల పని కావచ్చు. కానీ ప్రజలకు ఐదు రోజులే బ్యాంకింగ్ అనే పరిస్థితి రాకూడదు. ఉద్యోగికి విశ్రాంతి హక్కు అయితే ఖాతాదారుడికి నిరంతర సేవ కూడా హక్కే. సెలవులు పెరగడం సంస్కరణ కాదు; సేవ తగ్గకుండా వ్యవస్థను మార్చగలగడమే అసలైన సంస్కరణ.

- సి.హెచ్. ప్రతాప్





హామీల అమలు చేతకాక.. కేంద్రంపై నిందలా

వైఫల్యాల నుంచి దృష్టి మళ్లించేందుకే ఎమ్మెల్యే ఆరోపణలు - ఎమ్మెల్యే నిరసనలపై బీజేపీ ధ్వజం ..సీఎం దిష్టిబొమ్మ దహనం

పెద్దపల్లి:సెప్టెంబర్ 29:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే స్థానిక ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు నిరసనల పేరుతో ప్రచారం చేసుకుంటున్నారని బీజేపీ పెద్దపల్లి పట్టణ అధ్యక్షుడు,కౌన్సిలర్ పెంజర్ల రాకేష్,జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానంద ఆరోపించారు.భారతీయ జనతా పార్టీ పెద్దపల్లి పట్టణ, మండల శాఖల ఆధ్వర్యంలో పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ పెంజర్ల రాకేష్,మండల అధ్యక్షుడు వేల్పు రమేష్ నేతృత్వంలో ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేసి రాజీవ్ రహదారిపై నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పెంజర్ల రాకేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానంద మాట్లాడుతూ కలెక్టరేట్ ఎదుట ఎమ్మెల్యే చేపట్టిన ధర్నా, దిష్టిబొమ్మ దహనం కేవలం ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకేనని విమర్శించారు. చేతనైతే రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించి, ఎస్సారెస్పీ నీళ్లు విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.ఓటర్ల జాబితా సవరణపై గందరగోళం సృష్టించడం తగదని,2002లో ఈ విధానాన్ని తెచ్చిందే కాంగ్రెస్ పార్టీ అని గుర్తుచేశారు.రాజ్యాంగబద్ధమైన ఎన్నికల కమిషన్ నకిలీ, డబుల్,వలస, మరణించిన ఓట్లను చట్టబద్ధంగా తొలగిస్తుంటే, ఓటమి భయంతో రాజ్యాంగ సంస్థలపై బురదజల్లుతున్నారని మండిపడ్డారు. పెద్దపల్లి నియోజకవర్గంలో 100 మందికి పైగా కాంగ్రెస్ సర్పంచులు ఉన్నారని,ఆ గ్రామాల్లో ఎంతమంది ఓట్లు తొలగించారో ఎమ్మెల్యే ఆధారాలతో సహా నిరూపించాలని సవాల్ విసిరారు. అధికారంలోకి వచ్చి ఇన్ని నెలలు గడుస్తున్నా ఆరు గ్యారెంటీలు,పూర్తిస్థాయి రైతు రుణమాఫీ,మహిళా సంక్షేమం, నిరుద్యోగ భృతి వంటి హామీలు ఏమయ్యాయని నిలదీశారు. ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయలేక,అభివృద్ధిని విస్మరించి కేంద్రంపై నిందలు వేయడం సరికాదన్నారు.కాంగ్రెస్ అధిష్టానం మెప్పు కోసమే ఎమ్మెల్యే డ్రామాలు ఆడుతున్నారని, ఆధారాలు లేకుండా తప్పుడు ప్రచారం చేస్తే ప్రజలకు క్షమాపణ చెప్పాలని హెచ్చరించారు.నియోజకవర్గ అభివృద్ధిని విస్మరించి రాజకీయ ప్రయోజనాల కోసం వ్యవహరించడం మానుకోవాలని వారు హితవు పలికారు. ఈ నిరసన కార్యక్రమంలో ఓదెల మండల అధ్యక్షులు కారెంగుల శ్రీనివాస్,కాల్వ శ్రీరాంపూర్ మండల అధ్యక్షుడు చిలివేరి సంపత్, సీనియర్ నాయకులు తంగెడ రాజేశ్వరరావు, పోల్సాని సంపత్ రావు,నగరెపల్లి నారాయణ స్వామి,వేల్లంపల్లి శ్రీనివాస్, జ్యోతిబసు,తూడు రవి,మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ గౌడ్,రాజేంద్ర ప్రసాద్, ఫహీమ్,రమేష్,వెంకటేష్, ఎర్రోళ్ల శ్రీకాంత్,ఉప్పు కిరణ్,మహంత కృష్ణ తో పాటు జిల్లా, మండల, పట్టణ కార్యవర్గ సభ్యులు, యువమోర్చా నాయకులు, పాల్గొన్నారు.

విదేశీ కొలువులకు దరఖాస్తుల ఆహ్వానం



- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి,సెప్టెంబర్ 29:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

జిల్లాలోని నిరుద్యోగ యువత విదేశాలలో లభించే ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.తెలంగాణ విదేశీ మానవవనరుల సంస్థ ఆధ్వర్యంలో పలు దేశాల్లో వివిధ రంగాల కొలువులు అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు.జర్మనీలో పరిచారికలు, వృత్తివిద్యా శిక్షణ ఉద్యోగాలు,భౌతిక చికిత్స నిపుణులు,వృత్తి చికిత్సా నిపుణులకు నెలకు రూ.2.25 లక్షల నుంచి రూ.2.70 లక్షల వరకు వేతనాలు లభిస్తాయన్నారు.అలాగే ఇజ్రాయెల్‌లో గృహ సంరక్షకులకు నెలకు రూ.1,99,000 పైగా లభిస్తుందని,ఆస్ట్రియా,ఐర్లాండ్,సౌదీ అరేబియా,మారిషస్, ఖతార్,అమెరికా దేశాల్లో గుర్తింపు పొందిన పరిచారికలకు ఆకర్షణీయమైన జీతభత్యాలు ఉన్నాయని వెల్లడించారు. దుబాయ్‌లో అద్దెకారు డ్రైవర్లు,ద్విచక్రవాహన చోదకులు,తాపీ కార్మికులు,ఇనుప చట్రాల నిపుణులు,కొయ్య చట్రాల మేస్త్రీలు,సాధారణ సహాయకుల పోస్టులు ఉన్నాయని, ఒమన్‌లో వ్యవసాయ పనుల కార్మికులకు,మలేషియాలో బరువైన పనులు చేసేవారు,పైపుల వెల్డర్లు,యంత్ర చోదకులకు మంచి వేతనాలు లభిస్తాయని పేర్కొన్నారు. అంతేకాకుండా ఆస్ట్రేలియాలో వడ్రంగులు,వెల్డర్ లేదా ఫిట్టర్లు,విద్యుత్తు కార్మికులు,నిర్మాణ రంగ పనులకు,ఫిజీలో పలు రంగాలకు వేతన అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. ఈ ఉద్యోగాలపై ఆసక్తి ఉన్న అభ్యర్థులు కలెక్టరేట్ మొదటి అంతస్తులోని జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో గది సంఖ్య 233 తమ పేర్లను నమోదు చేసుకోవాలని,ఇతర సమాచారం కోసం 08035524946, 8125737731, 9291237999, 0423342040 నంబర్లలో సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

స్వంత ఖర్చులతో హనుమాన్ ఆలయానికి పెయింటింగ్..



మల్లాపూర్ సెప్టెంబర్ 29 (ప్రజా కలం ప్రతినిధి) మల్లాపూర్ మండలం గొర్రెపల్లి గ్రామంలోని హనుమాన్ ఆలయానికి పత్తిపాక మల్లయ్య, పత్తిపాక రాధ దంపతుల కుమారుడు నవీన్ కుమార్ తన వంతు సేవగా సుమారు రూ. 40 వేల వ్యయంతో పెయింటింగ్ వేయించారు.ఆలయాన్ని అందంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో స్వంత ఖర్చుతో రంగులు వేయించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వెంకట్ రెడ్డి నవీన్ కుమార్‌ను అభినందించారు.

గ్రామపంచాయతీని సందర్శించిన డీఎల్‌పీవో..



ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 29(ప్రజా కలం ప్రతినిధి) జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోనికోజన్ కొత్తూరుగ్రామపంచాయతీని మెట్ పల్లి డివిజనల్ పంచాయతీ అధికారి రాజేంద్ర ప్రసాద్. సందర్శించి గ్రామపంచాయతీలోని వివిధ రికార్డులను మరియు పారిశుద్ధ్యాన్ని పరిశీలించారు. అనంతరం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులు తయారు చేసిన "స్వచ్ఛతా సే సమృద్ధి" మరియు "కబాడ్ సే కళా" ప్రదర్శనలను సందర్శించారు.వృథాగా భావించే వస్తువులను విద్యార్థులు కళాత్మకంగా, ఉపయోగకరమైన వస్తువులుగా రూపొందించిన తీరును డీఎల్‌పీవో అభినందించారు. విద్యార్థుల సృజనాత్మకతను ప్రశంసిస్తూ, స్వచ్ఛత పట్ల అవగాహన కల్పించడంలో ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు.ఇట్టి కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాకేష్, ఎంపీహెస్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పసిడి రుణాల్లో పెద్దపల్లి గోదావరి అర్బన్ జోరు

- గోదావరి అర్బన్ బ్రాంచ్‌కు రాష్ట్ర స్థాయి పురస్కారం



పెద్దపల్లి,సెప్టెంబర్ 29:(ప్రజా కలం జిల్లా ప్రతినిధి) బంగారు రుణాల విభాగంలో విశేష పనితీరు కనబరిచిన గోదావరి అర్బన్ మల్టీస్టేట్ క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ పెద్దపల్లి బ్రాంచ్ రాష్ట్ర స్థాయి ఉత్తమ బ్రాంచ్ అవార్డును దక్కించుకుంది. గోల్డ్ లోన్ వ్యాపార విస్తరణతో పాటు ఖాతాదారులకు పారదర్శకమైన,నాణ్యమైన సేవలు అందించినందుకు గాను బ్రాంచ్‌కు ఈ ప్రతిష్ఠాత్మక గుర్తింపు లభించింది. సెప్టెంబర్ 27న సంస్థ ప్రధాన కార్యాలయంలో ఘనంగా నిర్వహించిన 13వ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఈ అవార్డును ప్రదానం చేశారు.నాందేడ్ సౌత్ ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరైన ఈ వేడుకలో-సంస్థ చైర్‌పర్సన్ రాజశ్రీ తాయి,వ్యవస్థాపకులు హేమంత్ పాటిల్,ఎండీ ధనుజయ్ తంభేకర్ చేతుల మీదుగా పెద్దపల్లి బ్రాంచ్ మేనేజర్ కొమ్ము రమేష్ పురస్కారాన్ని స్వీకరించారు.ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ రమేష్ మాట్లాడుతూ ఖాతాదారులు తమపై ఉంచిన అపార నమ్మకం,సిబ్బంది నిరంతర సమష్టి శ్రమ ఫలితంగానే ఈ ఘనత సాధ్యమైందని హర్షం వ్యక్తం చేశారు.ఈ అవార్డు తమపై మరింత బాధ్యతను పెంచిందని,రాబోయే రోజుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి మరింత వేగవంతమైన, మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందిస్తామని స్పష్టం చేశారు.ఈ వార్షికోత్సవ కార్యక్రమంలో సంస్థ ఏజీఎం రవి ఇంగ్లే,డీజీఎం సురేఖ,బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు, హెడ్‌ఆఫీస్ అధికారులు,ఐదు రాష్ట్రాల నుంచి వచ్చిన ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.రాష్ట్ర స్థాయిలో పెద్దపల్లి బ్రాంచ్ ఉత్తమ అవార్డు సాధించడం పట్ల స్థానిక ఖాతాదారులు,సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ బ్రాంచ్ బృందానికి అభినందనలు తెలిపారు.

తెలంగాణ పునర్నిర్మాణం కేసీఆర్‌తోనే సాధ్యం

- బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష
- కేసీఆర్ సీఎం కావడమే లక్ష్యం.. 200 కిలోమీటర్ల కాలిబాట
- మంథని కార్యకర్తల పాద యాత్రకు దాసరి ఉష సంఘీభావం



పెద్దపల్లి,సెప్టెంబర్ 29:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి కావాలని,మంథనిలో పుట్ట మధు శాసనసభ్యునిగా విజయం సాధించాలని బలమైన సంకల్పంతో మంథని నుంచి గజ్వేల్‌లోని ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రం వరకు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు,ఉద్యమకారులు బుర్ర వెంకటేష్,కొండ వెంకటేష్,బెన్నీ పాల్ చేపట్టిన పాదయాత్ర సోమవారం రాత్రి పెద్దపల్లికి చేరుకోగా,బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష వారికి ఘనంగా స్వాగతం పలికి పూర్తి సంఘీభావం ప్రకటించారు.ఈ సందర్భంగా దాసరి ఉష మాట్లాడుతూ కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే తెలంగాణ 2.0 పునర్నిర్మాణం,రాష్ట్ర సంక్షేమం,ప్రగతి సాధ్యమవుతాయని,మంథని నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి పుట్ట మధు నాయకత్వం ఎంతో ఆవశ్యకమని పేర్కొన్నారు. ప్రజా క్షేత్రంలో వారిద్దరి విజయాలను ఆకాంక్షిస్తూ సుమారు 200 కిలోమీటర్ల మేర ఎక్కడా ఆగకుండా కార్యకర్తలు ఇంతటి కఠినమైన పాదయాత్రను చేపట్టడం వారి అంకితభావానికి, పార్టీపై ఉన్న తిరుగులేని నిబద్ధతకు నిదర్శనమని కొనియాడారు.పాదయాత్ర చేపట్టిన కార్యకర్తలకు రాత్రి పెద్దపల్లిలో బస,వసతి ఏర్పాట్లు చేసి, అనంతరం ఎర్రవల్లి వైపు ప్రయాణాన్ని కొనసాగిస్తుండగా వారికి దాసరి ఉష సాదరంగా వీడ్కోలు పలికి యాత్ర విజయవంతం కావాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ భిక్షపతి,ఓదెలు,అబ్దుల్ మాలిక్,కన్నం శ్రవణ్,సిద్దు,ఎండీ అజీమ్,శ్రీను,చరణ్ తేజ్,రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుల భద్రత కోసమే కాటమయ్య కిట్లు



పెద్దపల్లి,సెప్టెంబర్ 29:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

ధర్మారం మండల పరిధిలోని దొంగతుర్తి గ్రామంలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో గౌడ సంఘం సభ్యులకు కాటమయ్య రక్షణ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమానికి ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారితో పాటు సర్కిల్ ఇన్‌స్పెక్టర్,సబ్ ఇన్‌స్పెక్టర్ ముఖ్య అతిథులుగా హాజరై కార్మికులకు కిట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గీత కార్మికులు తాటి చెట్లు ఎక్కే సమయంలో ఎలాంటి ప్రమాదాల బారిన పడకుండా,క్షేమంగా తమ వృత్తి విధులు నిర్వహించుకునేందుకు ఈ అధునాతన కాటమయ్య కిట్లు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు.ప్రమాదాల నివారణకు ప్రభుత్వం అందిస్తున్న ఈ రక్షణ కవచాలను ప్రతి ఒక్కరూ నద్వినియోగం చేసుకోవాలని సూచించారు.తమ భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకంగా కిట్లను అందజేసినందుకు గానూ గ్రామ గౌడ సంఘం ప్రతినిధులు ఎక్సైజ్ అధికారులకు ధన్యవాదాలు తెలియజేస్తూ వారిని శాలువాలతో ఘనంగా నన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ గౌడ సంఘం నాయకులు,సభ్యులు, స్థానిక గీత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మహిళా మోర్చా జిల్లా కార్యదర్శిగా అనూష..



వెల్గటూర్, సెప్టెంబర్ 29, ప్రజాకలం, ప్రతినిధి :బీజేపీ మహిళా మోర్చా జిల్లా కార్యదర్శిగా వెల్గటూర్ మండలంలోని పైడిపల్లి గ్రామానికి చెందిన ఎనగందుల అనుషను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు మంగళవారం ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా ఎనగందుల అనూష మాట్లాడుతూ జిల్లాలో బీజేపీ పార్టీ అభివృద్ధికి తనమంతు కృషి చేస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన మహిళా మోర్చా అధ్యక్షురాలు దొరిశెట్టి మమత, జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, ఓబిసి మోర్చా కార్యవర్గ సభ్యులు మర్రిపల్లి సత్యం, ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓరుగంటి చంద్రశేఖర్, బీజేపీ మండల అధ్యక్షుడు గోపతి జనార్దన్, రాష్ట్ర నాయకులు దామెర రాంసుధాకర్ రావుకు అనూష కృతజ్ఞతలను తెలియజేసింది.

నూతన సీఐకి ఘన స్వాగతం

- శాంతిభద్రతల పరిరక్షణకు సమన్వయంతో పనిచేస్తాం.



సెప్టెంబర్ 29 ప్రజాకలం ప్రతినిధి: (వరంగల్ /వర్ధన్నపేట) వర్ధన్నపేట నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన సంజీవరావును పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈగ దామోదర్, పీఏసీఎస్ డైరెక్టర్ కొండేటి మహేందర్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన సీఐకు శుభాకాంక్షలు తెలియజేశారు. వర్ధన్నపేటలో ప్రజా సంక్షేమం, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు పట్టణ అభివృద్ధికి పోలీస్ శాఖతో సమన్వయంతో ముందుకు సాగుతామని దామోదర్, మహేందర్ తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ, ప్రజల పక్షాన నిరంతరం పనిచేస్తామని పేర్కొన్నారు.
కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మంచాల రామకృష్ణ, పులి శ్రీనివాస్, ఎలికట్ట ముత్తయ్య, ఎస్‌కే షబ్బీర్, తోటకూరి కార్తీక్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

తరాల మధ్య అనుబంధాన్ని బలోపేతం చేయాలి
-అంగన్వాడీ సూపర్వైజర్ చంద్రకళ



సెప్టెంబర్ 29 ప్రజాకలం ప్రతినిది (వరంగల్ /వర్ధన్నపేట) అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా వర్ధన్నపేట మండలం బండౌతపురం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం వద్ద మంగళవారం గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి అంగన్వాడీ సూపర్వైజర్ చంద్రకళ ముఖ్యఅతిథిగా హాజరై వయోవృద్ధులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వయోవృద్ధులు కుటుంబానికి విలువైన మార్గదర్శకులని, వారి అనుభవాలు భావితరాలకు ఎంతో ఉపయోగకరమని అన్నారు. పిల్లలు, యువత వయోవృద్ధులను గౌరవిస్తూ వారితో ఆత్మీయంగా మెలగాలని సూచించారు.పిల్లలు, వయోవృద్ధుల మధ్య అనుబంధాన్ని పెంపొందించేలా ఆటలు, వినోద కార్యక్రమాలు నిర్వహించారు. వయోవృద్ధులకు ప్రేమ, గౌరవం, భద్రత, అవసరమైన వైద్య సహాయం అందించడం ప్రతి కుటుంబ బాధ్యత అన్నారు. వయోవృద్ధులకు సహాయం లేదా సమాచారం అవసరమైతే 14567 టోల్‌ఫ్రీ నంబర్‌కు సంప్రదించవచ్చని తెలిపారు.అనంతరం వయోవృద్ధుల సంక్షేమం, గౌరవప్రదమైన జీవనం, కుటుంబంలో ఆత్మీయ వాతావరణం కోసం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అమరేందర్, అంగన్వాడీ టీచర్లు వజ్రమ్మ, బుజ్జమ్మ, ఆయా సుశీల, వయోవృద్ధులు, చిన్నారులు పాల్గొన్నారు.

రూ.11.28 లక్షల వ్యవహారం.. ఇద్దరు ఉద్యోగుల సస్పెన్షన్



గద్వాల ప్రతినిధి । సెప్టెంబర్ 29 । ప్రజా కలం
గద్వాల మున్సిపాలిటీలో మున్సిపల్ దుకాణాల అద్దెలకు సంబంధించి వసూలు చేసిన రూ. 11.28 లక్షలను మున్సిపల్ ఖాతాలో జమ చేయకపోవడాన్ని తీవ్ర తప్పిదంగా పరిగణిస్తూ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ మంగళవారం చర్యలు చేపట్టారు.ఈ వ్యవహారంలో సీనియర్ అసిస్టెంట్, ఇన్‌చార్జ్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజవర్ధన్, జూనియర్ అసిస్టెంట్, ఇన్‌చార్జ్ షరాఫ్ రాజవర్ధన్ నాయుడులను సస్పెండ్ చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణకు అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) నర్సింగరావును విచారణ అధికారిగా నియమించారు. సంబంధిత రశీదు పుస్తకాలు, రికార్డులు, నగదు జమ వివరాలను పరిశీలించి సమగ్ర నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు.

సోషల్ మ్యాప్‌తో గ్రామాభివృద్ధికి సమగ్ర ప్రణాళిక

గ్రామ సమస్యలు, వనరులు, అభివృద్ధి పనుల గుర్తింపు

గద్వాల ప్రతినిధి । సెప్టెంబర్ 29 । ప్రజా కలం
జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం చిన్నతాండ–పెద్దతాండ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ నార్య నాయక్ ఆధ్వర్యంలో సోషల్ మ్యాప్, రిసోర్స్ మ్యాప్ కార్యక్రమాన్ని నిర్వహించారు.గ్రామాభివృద్ధికి అవసరమైన సమగ్ర ప్రణాళిక రూపొందించడంలో భాగంగా గ్రామంలోని ప్రజల నివాస ప్రాంతాలు, మౌలిక వసతులు, అందుబాటులో ఉన్న వనరులు, సమస్యాత్మక ప్రాంతాలు, అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించారు. గ్రామ ప్రజల అవసరాలను తెలుసుకుని వాటిని మ్యాప్‌లో పొందుపరిచి, భవిష్యత్‌లో చేపట్టాల్సిన పనులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నార్య నాయక్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని అన్నారు. సోషల్ మ్యాప్, రిసోర్స్ మ్యాప్ ద్వారా గ్రామంలోని సమస్యలు, వనరులు, అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామ ప్రజలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపడతామని పేర్కొన్నారు. గ్రామంలో అవసరమైన రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, ఇతర మౌలిక వసతులు వంటి అంశాలను గుర్తించి, వాటి అభివృద్ధికి అవసరమైన చర్యలను చేపట్టేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఆయిల్‌పామ్‌తో రైతులకు స్థిరమైన ఆదాయం

జిల్లా ఉద్యాన అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ - అన్నదాతలకు ఆదర్శం

వావిలాల రాజేశ్వరి రావు



పెద్దపల్లి:సెప్టెంబర్ 29:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) రైతులు సంప్రదాయ వరి సాగుకే పరిమితం కాకుండా దీర్ఘకాలికంగా స్థిరమైన లాభాలనిచ్చే ఆయిల్‌పామ్ సాగు వైపు దృష్టి సారించాలని పెద్దపల్లి జిల్లా ఉద్యానవన శాఖ అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలిగేడు మండలం లోకపేట గ్రామానికి చెందిన రైతు వావిలాల రాజేశ్వరి రావు ఆయిల్‌పామ్ సాగు చేపట్టి ప్రతి రెండు నెలలకోసారి దిగుబడి ద్వారా క్రమం తప్పకుండా ఆదాయం పొందుతూ జిల్లాలోని ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు.గతంలో వరి సాగు చేసిన సదరు రైతు,నీటి వినియోగం, పెట్టుబడి వ్యయం,దీర్ఘకాలిక భరోసాను పరిగణనలోకి తీసుకుని ఆయిల్‌పామ్ వైపు అడుగులు వేశారని వివరించారు.తోట స్థిరపడిన తర్వాత ప్రతి రెండు నెలలకు ఫ్రెష్ ఫ్రూట్ బంచ్‌లను విక్రయించి మంచి లాభాలు పొందవచ్చని, పూర్తిస్థాయి దిగుబడి వచ్చే వరకు అంతర పంటల ద్వారా కూడా అదనపు ఆదాయం సమకూరుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఆయిల్‌పామ్ ధర మెట్రిక్ టన్నుకు రూ. 24,025గా ఉండటం రైతులకు ఎంతో ప్రోత్సాహకరమైన పరిణామమని చెప్పారు. అనుకూలమైన భూములు,సాగునీటి వనరులు ఉన్న రైతుల ంతా ఆయిల్‌పామ్ సాగును చేపట్టి రాజేశ్వరి రావు మాదిరిగానే ఆర్థిక స్థిరత్వాన్ని సాధించాలని ఆయన సూచించారు.

వావిలాకు కషాయం తయారీ విధానం పై రైతులకు అవగాహన



(వరంగల్/ పర్వతగిరి) సెప్టెంబర్ 29, ప్రజాకలం ప్రతినిధి:
మంగళవారం బూరుగుమల్ల గ్రామంలో బీసీఐ, ఆర్ఏ రైతులతో వావిలాకు కషాయం తయారీ ప్రదర్శన కార్యక్రమం గ్రామ సర్పంచ్ ఎలికట్టే కృష్ణవేణి సహకారంతో ప్రజ్వల్ సంస్థ పర్వతగిరి పియు మేనేజర్ గటిక మృదుల ఆధ్వర్యంలో నిర్వహించనైనది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రజ్వల్ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ ఇన్నారెడ్డి పాల్గొన్నారు. రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ముఖ్యంగా వ్యవసాయ సాగు విధానంలో కొన్ని మెలకువలు రైతులందరూ పాటించాలని, అందులో భాగంగా నవాజ సిద్ధ పద్ధతులైనటువంటి వావిలాకు కషాయం వేప కషాయం రైతులు ఎక్కువగా ఉపయోగించాలని అన్నారు. వీటివల్ల రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయని చెప్పడం జరిగినది. కషాయాల పిచికారి వల్ల పంటకు మేలు చేసే మిత్ర పురుగులు చనిపోకుండా ఉంటాయన్నారు. పంట నష్టపరిచే కీటకాలు కొంతవరకు అదుపు చేయడం జరుగుతుందని చెప్పడం జరిగినది. పర్వతగిరి పియు మేనేజర్ గటిక మృదుల మాట్లాడుతూ, రసాయనాలు వద్దు కషాయాలు ముద్దు అందువల్ల రైతులందరూ ముందుచూపుతో ప్రకృతి వ్యవసాయ సాగు విధానాలు అలవర్చుకోవాలని వివరించినారు. రైతులు ఎక్కువగా పురుగుమందులు వాడకుండా వర్మి వాష్, జీవామృతం, నీమస్త్రం లాంటివి వాడి భవిష్యత్ తరాలకు మంచి నేలని అందించాలని చెప్పడం జరిగినది. గ్రామ సర్పంచ్ ఎలికట్టె కృష్ణవేణి మాట్లాడుతూ, ప్రజ్వల్ సంస్థ వారు మంగళవారం మన గ్రామంలో వావిలాకు కషాయం తయారీ విధానం గురించి రైతులకు మహిళలకు యువకులకు అవగాహన చేయడం జరిగినది. దీని ద్వారా రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని అలవర్చుకోవాలని చెప్పడంతో పాటు ప్రజ్వల్ సంస్థ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు మహిళలు యువకులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి, ప్రజ్వల్ సంస్థ సీనియర్ సామాజిక కార్యకర్త గడ్డం యాకయ్య, వెంకన్న, స్కైలాబ్ బాబు, బద్రు నాయక్, సుజాత, మౌనిక, కోమల, సతీష్, రాజు, మమత, సరస్వతి, గ్రామ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా కంజర్ల మహేష్

- ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తా: కంజర్ల మహేష్



వర్ధన్నపేట, సెప్టెంబర్ 29
(ప్రజాకలం ప్రతినిధి):
కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా వర్ధన్నపేటకు చెందిన కంజర్ల మహేష్ నియమితులయ్యారు. గతంలో బీఆర్ఎస్‌లో జిల్లా స్థాయి బాధ్యతలు నిర్వహించిన ఆయన ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రజాపక్ష విధానాలకు ఆకర్షితుడై పార్టీలో చేరిన కొద్ది కాలానికే జిల్లా ఉపాధ్యక్ష పదవి దక్కడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.
ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు ఆదేశాల మేరకు, వర్ధన్నపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈగ దామోదర్ ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ మహేష్‌కు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు మహేష్‌ను అభినందించారు.
దళిత, బడుగు వర్గాల కోసం పోరాటం
కంజర్ల మహేష్ గతంలో దళిత, బడుగు, బలహీన వర్గాల సమస్యలపై నిరంతరం పనిచేస్తూ ప్రజల్లో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నారని ఆయన వర్గీయులు పేర్కొన్నారు. సామాజిక న్యాయం, అణగారిన వర్గాల హక్కుల కోసం వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.దళిత సామాజిక వర్గాల అభ్యున్నతికి చేసిన సేవలను గుర్తించిన దళిత సంఘాల పెద్దలు ఆయనకు 'దళిత రత్న' అవార్డు అందజేసినట్లు ఆయన అనుచరులు పేర్కొన్నారు. ఎలాంటి రాజకీయ అండదండలు లేకుండా స్వతంత్రంగా ప్రజా సమస్యలపై స్పందిస్తూ రాజకీయంగా ఎదిగారని వారు తెలిపారు.
బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ వైపు..
గతంలో బీఆర్ఎస్‌లో జిల్లా స్థాయి నాయకత్వ బాధ్యతలు నిర్వహించిన మహేష్ అనంతరం ఆ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాపక్ష విధానాలు,సామాజిక న్యాయం, సంక్షేమ కార్యక్రమాల పట్ల ఆకర్షితుడై కాంగ్రెస్ గూటికి చేరినట్లు ఆయన తెలిపారు. పార్టీలో చేరిన అనంతరం తనకు అప్పగించిన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ పార్టీ నాయకత్వం దృష్టిని ఆకర్షించారు.
బాధ్యతగా భావిస్తా
తన నియామకంపై కంజర్ల మహేష్ మాట్లాడుతూ.. జిల్లా ఉపాధ్యక్ష పదవిని పదవిగా కాకుండా బాధ్యతగా భావిస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యత అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు తన రాజకీయ ప్రయాణంలో ప్రోత్సహిస్తున్నందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.
పార్టీ నాయకత్వం ఆదేశాలను తుచ తప్పకుండా పాటిస్తూ, కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. ప్రజల సమస్యలను గుర్తించి వాటిని ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యకర్తలకు అండగా..
కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానని మహేష్ తెలిపారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు అర్హులైన ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా అవగాహన కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యకర్తల సమస్యలను నాయకత్వం దృష్టికి తీసుకెళ్లి వారి సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. తనకు సహకరిస్తున్న మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోషాల వెంకన్నగౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈగ దామోదర్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్‌లకు మహేష్ కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో పార్టీ అప్పగించే ప్రతి బాధ్యతను అంకితభావంతో నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిగా పనిచేస్తానని స్పష్టం చేశారు.

కేజీబీవీ హాస్టల్ లో ఆకస్మిక తనిఖీలు చేసిన ఎమ్మార్వో.



(వరంగల్/పర్వతగిరి) సెప్టెంబర్ 29, ప్రజాకలం ప్రతినిధి: వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రంలోని కేజీబీవీ హాస్టల్లో స్థానిక ఎమ్మార్వో వెంకటస్వామి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్ లోని వంట గదులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని హాస్టల్ సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సక్రమంగా అందించాలని తెలిపారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని ఆరా తీశారు. విద్యార్థులకు అందించే ఆహారాన్ని రుచి చూశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల హాజరు పట్టీలను, స్టాక్ రిజిస్టర్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ తనిఖీలో తహసీల్దార్ వెంట రెవెన్యూ సిబ్బంది, ఇతర అధికారులు కూడా పాల్గొన్నారు. విద్యార్థుల సంక్షేమం పట్ల ప్రభుత్వం ఎంత శ్రద్ధ తీసుకుంటుందో ఈ తనిఖీ తెలియజేస్తుందని, హాస్టల్ నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా చూసుకోవాలని, విద్యార్థులకు ఎలాంటి సమస్యలు రాకుండా జాగ్రత్త పడాలని ఎమ్మార్వో వెంకటస్వామి ఆదేశించారు. హాస్టల్ వార్డెన్‌కు, ఇతర సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంపై అవగాహన

ఐనవోలు, సెప్టెంబర్ 29:- (ప్రజా కలం ప్రతినిధి) వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని, డ్రోన్ల ద్వారా రైతులకు సమయం, కూలీ ఖర్చు ఆదా అవుతుందని జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి ఆడెపు విక్రమ్ అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రతిష్టాత్మక "దీదీ కే సాత్ ఏక్ డ్రోన్" కార్యక్రమంలో భాగంగా వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు రైతులకు డ్రోన్ల పనితీరు, ప్రయోజనాలు, సబ్సిడీ పొందే విధానం తదితర అంశాలను వివరించారు. మహిళలు, గ్రామీణ నిరుద్యోగ యువత డ్రోన్ పైలెట్ శిక్షణ పొందడం ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు పొందవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఆడెపు విక్రమ్ మాట్లాడుతూ.. వ్యవసాయంలో ఆధునిక సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా తక్కువ ఖర్చుతో మెరుగైన దిగుబడులు సాధించవచ్చన్నారు. డ్రోన్లతో పంటలకు మందులు పిచికారీ చేయడంతో పాటు పంటల పర్యవేక్షణ సులభతరం అవుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ అవకాశాలను రైతులు, మహిళలు, గ్రామీణ యువత సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు, గిరిక రాజిరెడ్డి, రాజారపు రాజు, పెంతల పద్మ, సునీత, సుమన్, గణేష్ తదితర రైతులు, కళాశాల విద్యార్థులు, మోర్చా కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దపల్లిలో దోమల బెడదకు చెక్.. ప్రతి వీధిలో స్ప్రే

ప్రజారోగ్యమే లక్ష్యంగా సర్పంచ్ అల్వాల శిరీష రాజశేఖర్ రెడ్డి ప్రత్యేక చర్యలు



గద్వాల ప్రతినిధి । సెప్టెంబర్ 29 । ప్రజా కలంజోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం పరిధిలోని పెద్దపల్లి గ్రామంలో దోమల బెడదను నివారించేందుకు సర్పంచ్ అల్వాల శిరీష రాజశేఖర్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. గ్రామంలోని ప్రతి వీధిలో దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. వర్షాకాలంలో దోమల కారణంగా జ్వరాలు, ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉన్న నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలోని వీధులు, పరిసర ప్రాంతాల్లో దోమల మందు పిచికారీ చేయించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా సర్పంచ్ అల్వాల శిరీష రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, "ప్రజల ఆరోగ్యమే మా ప్రధాన లక్ష్యం. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు, ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి" అని ప్రజలకు సూచించారు. గ్రామంలో పారిశుధ్యాన్ని మెరుగుపరచడంతో పాటు దోమల నివారణకు అవసరమైన చర్యలను నిరంతరం చేపడతామని సర్పంచ్ తెలిపారు.

శాస్త్రీయ విత్తనోత్పత్తితో రైతులకు అదనపు ఆదాయం

-నాణ్యమైన విత్తనాల ఉత్పత్తిపై రైతులకు అవగాహన

గద్వాల ప్రతినిధి । సెప్టెంబర్ 29 । ప్రజా కలం తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, గద్వాల ఆధ్వర్యంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, గద్వాల ద్వారా శాస్త్రీయ విత్తనోత్పత్తి కార్యకలాపాలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, గద్వాల సమన్వయకర్త డా. పి. అర్చన రైతులకు శాస్త్రీయ పద్ధతుల్లో విత్తనోత్పత్తి చేపట్టడం ద్వారా నాణ్యమైన విత్తనాలను ఉత్పత్తి చేయడంతో పాటు అదనపు ఆదాయం పొందవచ్చని వివరించారు. రాబోయే రబీ సీజన్‌లో విత్తనోత్పత్తిని అదనపు ఆదాయ వనరుగా స్వీకరించేలా రైతులను ప్రోత్సహించారు. విత్తనాల ఎంపిక, నాణ్యమైన విత్తనాల వినియోగం, పంటల ఎంపిక, విత్తనోత్పత్తిలో పాటించాల్సిన శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు, పంటల పరిశీలన, విత్తన ధృవీకరణకు సంబంధించిన అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ముఖ్య కార్యనిర్వహణ అధికారి శ్రీ అంజనేయులు, ప్రాంతీయ విత్తన ధృవీకరణ అధికారి శ్రీ చంద్రశేఖర్ పాల్గొని విత్తనోత్పత్తి, విత్తన ధృవీకరణతో పాటు రైతులు పాటించాల్సిన నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు అందించారు. ఈ అవగాహన కార్యక్రమంలో మొత్తం 30 మంది రైతులు పాల్గొన్నారు.



ప్రముఖ సంఘ సేవకులు గాదె మాధవ రెడ్డి ని పరామర్శించిన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు

ప్రజాకలం ప్రతినిధి భద్రాచలం, సెప్టెంబర్ 29 : భద్రాచలం వెంకటేశ్వర కాలనీ



మొదటి వీధిలో నివాసం ఉంటున్న ప్రముఖ సంఘ సేవకులు పట్టణ ప్రముఖులు గాదె మాధవ రెడ్డి ఇటీవల హైదరాబాద్‌లో గుండె శస్త్రచికిత్స చేయించుకుని ఇంటికి తిరిగి వచ్చిన విషయం తెలుసుకున్న భద్రాచలం నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు గారు మంగళవారం వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా మాధవ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. శస్త్రచికిత్స అనంతరం పూర్తిగా కోలుకునే వరకు తగిన విశ్రాంతి తీసుకోవాలని, ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని సూచించారు. త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.పరిపూర్ణమైన ఆరోగ్యం తర్వాత ప్రజల్లోకి వచ్చి ప్రజా సేవ చేయాలని చేయటానికి ఆ భగవంతుడు పూర్తిగా అనుగ్రహించాలని అప్పటివరకు తగిన విశ్రాంతి తీసుకుని టైం కు మందులు వేసుకోవాలని సూచించారు .ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు భీమవరపు వెంకటరెడ్డి, చేగొండి శ్రీనివాస్, యూత్ నాయకులు మాచినేని భాను గాడి విజయ్. తదితరులు పాల్గొన్నారు.

కపాస్ కిసాన్ పథకం కింద పత్తి రైతులకు శిక్షణ



పాలేరు సెప్టెంబర్ 29 (ప్రజా కలం న్యూస్)

కపాస్ కిసాన్ పథకం కింద పత్తి రైతులకు పత్తి పంటలో చీడపీడలు, తెగుళ్ల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కూసుమంచి మండలం తురకగూడెం గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని కూసుమంచి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు రాజేష్ నిర్వహించారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) వైరా శాస్త్రవేత్త డాక్టర్ పావని రైతులకు పత్తి పంటలో వచ్చే ప్రధాన చీడపీడలు, తెగుళ్లను గుర్తించడం, వాటి నివారణ, సమగ్ర సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. పంటలో చీడపీడలు, తెగుళ్లను ప్రారంభ దశలోనే గుర్తించి శాస్త్రీయ పద్ధతుల్లో నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించారు. అవసరానికి అనుగుణంగా వ్యవసాయ శాఖ సిఫారసు చేసిన పురుగుమందులను మాత్రమే వినియోగించాలని, మందుల పిచికారీలో తగిన జాగ్రత్తలు పాటించాలని రైతులకు సూచించారు. అనంతరం పత్తి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పంటలో వినియోగించే మొక్క పెరుగుదల నియంత్రకాలను సబ్సిడీపై రైతులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో కూసుమంచి ఏడీఏ రాజేష్, కేవీకే శాస్త్రవేత్త శ్రీమతి పావని, సర్పంచ్ బుర్ర కృష్ణ, మండల వ్యవసాయ అధికారి మతి రామడుగు వాణి, ఏఈఓ జానీతో పాటు పలువురు రైతులు, తదితరులు పాల్గొన్నారు.

550 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు పరిశీలించిన ఎమ్మెల్యే కూచికుళ్ళ రాజేష్ రెడ్డి



నాగర్‌కర్నూల్ సెప్టెంబర్ 29 (ప్రజా కలం): నాగర్‌కర్నూల్ పట్టణంలో మెడికల్ కాలేజీకి అనుబంధంగా 10 ఎకరాల విస్తీర్ణంలో రూ.235 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న 550 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి మంగళవారం పరిశీలించారు.ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతిపై అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. నిర్మాణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసి ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.నిర్మాణంలో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, నిర్దేశిత ప్రమాణాలు, నాణ్యతా ప్రమాణాల మేరకు నిర్మాణం జరిగేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.
550 పడకల ఆసుపత్రి అందుబాటులోకి వస్తే నాగర్‌కర్నూల్ జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు మరింత అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

రైతు సంఘం జిల్లా మహాసభను జయప్రదం చేయండి.... కరపత్రాల విడుదల



నిర్మల్ సెప్టెంబర్ 29 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

బైంసా మండలంలోని మహాగాం గ్రామంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా మహాసభల కరపత్రాలను తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఇప్ప లక్ష్మణ్, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు చిట్టెల్కర్ శంకర్ , మహాగామ్ రైతు లు రాజేశ్వర్,విట్టల్ లు విడుదల చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఇప్ప లక్ష్మణ్ మాట్లాడుతూ తెలంగాణ రైతు సంఘం నిర్మల్ జిల్లాలో రైతుల సమస్యలపై పోరాటాలు నిర్వహించింది. నకిలీ విత్తనాలను అరికట్టాలని పోరాడింది. యూరియా అదనపు రేట్లకి వ్యతిరేకంగా పోరాడింది. పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని పోరాటాలు నడిపింది. రైతుల సమస్యలను పరిష్కరించాలని రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని పోరాటాలు నిర్వహించింది. రైతు సంఘం జిల్లా మహాసభను రేపు 30 తేదీనాడు ఖానాపూర్ లోని పిఆర్టియు భవనంలో నిర్వహిస్తున్నమని నాయకులు ప్రతినిధులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

విదేశీ ఉద్యోగాల పేరుతో రూ.57 లక్షల మోసం.. నిందితుడి అరెస్ట్

- యూకే వీసా స్పాన్సర్‌షిప్, ఉద్యోగాల పేరుతో మాయమాటలు..
- రెండు సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్ స్వాధీనం.



(వరంగల్/పర్వతగిరి) సెప్టెంబర్ 29, ప్రజాకలం ప్రతినిధి:

విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి నిరుద్యోగులు, పరిచయస్తుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసి మోసాలకు పాల్పడుతున్నాడనే ఆరోపణలపై మార్క శివకుమార్ అనే వ్యక్తిని పర్వతగిరి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వరంగల్ రైల్వే స్టేషన్‌లో పర్వతగిరి ఎస్ఐ ప్రవిణ్ సిబ్బంది తో కలిసి అతడిని అదుపులోకి తీసుకొని విచారించినట్లు మామునూరు ఏసిపి వెంకటేష్ ప్రెస్‌నోట్‌లో పేర్కొన్నారు. ఏసిపి తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం తిమ్మంపేట గ్రామానికి చెందిన మార్క శివకుమార్ గతంలో పలు ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగం చేశాడు. ఉద్యోగాలు కోల్పోయిన అనంతరం ఆర్థిక ఇబ్బందులతో ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడి, సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో మోసాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. గతంలో తనతో కలిసి పనిచేసిన బోడ రవి ప్రస్తుతం యూకేలో ఉన్నాడని తెలుసుకున్న నిందితుడు, రాక్‌స్పేస్ టెక్నాలజీ సంస్థలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించినట్లు పేర్కొన్నారు. వీసా స్పాన్సర్‌షిప్, ఉద్యోగ ఆఫర్ లెటర్, జాయినింగ్ లెటర్, వీసా ప్రాసెసింగ్ తదితర కారణాలు చూపుతూ వివిధ దఫాలుగా డబ్బులు వసూలు చేసినట్లు తెలిపారు. హెచ్ఆర్ మేనేజర్, ఇతర అధికారుల పేర్లతో నకిలీ వాట్సాప్ ఖాతాల ద్వారా సంభాషణలు జరిపి, వాయిస్ మెసేజ్‌లు పంపిస్తూ బాధితుడిని నమ్మించినట్లు ప్రెస్‌నోట్‌లో వెల్లడించారు. ఈ క్రమంలో బాధితుడి నుంచి సుమారు రూ.26 లక్షలు తన బ్యాంకు ఖాతాల్లోకి, ఇతర బ్యాంకు ఖాతాలు, యూపీఐ మార్గాల ద్వారా మొత్తం సుమారు రూ.57 లక్షల వరకు బదిలీ చేయించినట్లు నిందితుడు అంగీకరించినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్ బెట్టింగ్‌లో పోగొట్టుకున్నట్లు విచారణలో వెల్లడైందని తెలిపారు. అంతేకాకుండా, మరో యువతికి ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు తీసుకొని మోసం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయని, ఈ ఘటనపై టేకుమట్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్లు ప్రెస్‌నోట్‌లో పేర్కొన్నారు.

బాధితుడికి డబ్బులు తిరిగి ఇస్తానని నమ్మించి రూ.50 వేలు తీసుకున్నట్లు కూడా విచారణలో వెల్లడైనట్లు తెలిపారు. నిందితుడి నుంచి నేరానికి ఉపయోగించిన రెండు సెల్‌ఫోన్లు, ఒక హెచ్‌పీ క్రోమ్‌బుక్ ల్యాప్‌టాప్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఫోన్లలోని వాట్సాప్ ఖాతాలు, ఇమెయిల్ వివరాలు, బెట్టింగ్ యాప్‌కు సంబంధించిన సమాచారాన్ని పరిశీలించి, అవసరమైన స్క్రీన్‌షాట్లను పెన్‌డ్రైవ్‌లో భద్రపరిచినట్లు వివరించారు. ఈ ఘటనకు సంబంధించి క్రైమ్ నంబర్ 205/2026 కింద భారతీయ న్యాయ సంహిత లోని పలు సెక్షన్లు, ఐటీ చట్టంలోని సెక్షన్ 66(D) ప్రకారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. విదేశీ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు అడిగే వ్యక్తుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, సంస్థల అధికారిక మార్గాల ద్వారా ఉద్యోగ ఆఫర్లు, వీసా వివరాలను నిర్ధారించుకున్న తర్వాతే డబ్బులు చెల్లించాలని ఏసిపి వెంకటేష్, సిఐ సంతోష్ నిరుద్యోగులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ శ్రావణ్ రెడ్డి లతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్‌పై ఉక్కుపాదం.. యువత భవిష్యత్ రక్షణే లక్ష్యం

- యాంటీ డ్రగ్ హెల్ప్‌లైన్ 1908పై విస్తృత అవగాహన..
- డ్రగ్స్ కేసుల దర్యాప్తుపై ప్రత్యేక సమీక్ష

గద్వాల ప్రతినిధి । సెప్టెంబర్ 29 । ప్రజా కలం

జోగులాంబ గద్వాల జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో మంగళవారం తెలంగాణ ఈగల్ ఫోర్స్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నియంత్రణ, నివారణ చర్యలపై ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఈగల్ ఫోర్స్ అధికారులు మాదకద్రవ్యాల కేసుల నమోదు నుంచి దర్యాప్తు, ఆధారాల సేకరణ, నిందితుల గుర్తింపు, న్యాయపరమైన చర్యల వరకు అనుసరించాల్సిన విధానాలపై పోలీసు అధికారులకు సూచనలు చేశారు. కేసుల దర్యాప్తులో ఎదురయ్యే సమస్యలను అధిగమిస్తూ మరింత పకడ్బందీగా చర్యలు చేపట్టాలని సూచించారు.ఎస్పీ పి.వి. పద్మజ, ఐపీఎస్ మాట్లాడుతూ... మాదకద్రవ్యాల సమస్యను కేవలం పోలీసింగ్ అంశంగా కాకుండా భవిష్యత్ తరాల భద్రతకు సంబంధించిన సామాజిక బాధ్యతగా చూడాలని అన్నారు. యువత, విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా విద్యాసంస్థలు, తల్లిదండ్రులు, పోలీసులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం, విక్రయం లేదా అనుమానాస్పద కార్యకలాపాలపై సమాచారం ఉంటే యాంటీ డ్రగ్ హెల్ప్‌లైన్ 1908కు తెలియజేయాలని కోరారు.జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు, ఐపీఎస్ మాట్లాడుతూ జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్యార్థులు, యువతను మాదకద్రవ్యాల ప్రభావం నుంచి రక్షించేందుకు విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు, పర్యవేక్షణ, ముందస్తు నివారణ చర్యలను మరింత సమర్థవంతంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.జిల్లాలోని కళాశాలల్లో ఏర్పాటు చేసిన యాంటీ డ్రగ్ స్క్వాడ్ల పనితీరు, అవగాహన కార్యక్రమాలు, విద్యార్థుల భాగస్వామ్యం తదితర అంశాలపై సమావేశంలో సమీక్షించారు. మాదకద్రవ్యాల వ్యతిరేక పోరాటంలో నివారణ, అవగాహన, నిఘా, చట్టపరమైన చర్యలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని అధికారులు సూచించారు.మాదకద్రవ్యాల సరఫరా మార్గాలను గుర్తించడం, వినియోగాన్ని అరికట్టడం, యువతను ముందుగానే అప్రమత్తం చేయడం, అవసరమైన వారికి సంబంధిత శాఖల సహకారంతో సహాయం అందించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ఈ సమావేశంలో తెలంగాణ ఈగల్ ఫోర్స్ డీఎస్పీ బుచ్చయ్య, గద్వాల డీఎస్పీ వై. మొగిలయ్య, ఈగల్ ఫోర్స్ బృందం, గద్వాల, అలంపూర్, శాంతినగర్ సర్కిల్ అధికారులు, ఎస్సైలు, డీసీఆర్‌బీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లోనే మెరుగైన వైద్యం అందించాలి

నిర్వహణ, పారిశుద్ధ్యంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు : జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ సెప్టెంబర్ 29 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

ప్రభుత్వాసుపత్రులకు వచ్చే ప్రజలకు అవసరమైన అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉండేలా పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా వైద్యారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఖానాపూర్ ప్రభుత్వాసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి పరిసరాలను పరిశీలించిన కలెక్టర్.. నిరంతరం పారిశుద్ధ్య పనులు చేపట్టి ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అనంతరం ఓపీ, ఐపీ, రోగుల నమోదు, సాధారణ వైద్య సేవలు, ప్రసూతి విభాగం, రక్త పరీక్షల విభాగం, మందుల గదిని పరిశీలించారు. ఆయా విభాగాల రిజిస్టర్లను తనిఖీ చేసి, ఆసుపత్రి నిర్వహణకు సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు పకడ్బందీగా నమోదు చేయాలని ఆదేశించారు. వివిధ విభాగాల్లో ప్రతిరోజూ అందుతున్న వైద్య సేవలు, వైద్యులు, సిబ్బంది అందుబాటుపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది విధులకు క్రమం తప్పకుండా హాజరై రోగులకు సకాలంలో మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వాసుపత్రుల్లో నాణ్యమైన వైద్యం అందించడం ద్వారా ప్రజల్లో ప్రభుత్వ వైద్య సేవలపై నమ్మకాన్ని పెంపొందించాలని పేర్కొన్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగితో మర్యాదగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, వారి సమస్యలను తెలుసుకుని అవసరమైన వైద్యం, మందులు అందించాలని తెలిపారు. అవసరమైన వారికి రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, చికిత్సకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. వైద్య సేవలు, ఆసుపత్రి నిర్వహణ, పారిశుద్ధ్యం విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఆసుపత్రికి సంబంధించిన సమస్యలు, అదనపు అవసరాలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు చేపడతామని తెలిపారు.

తనిఖీలో డీసీహెచ్ఎస్ కాశీనాథ్, తహసీల్దార్ సుజాత, మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్, మున్సిపల్ వైస్ చైర్మన్ సోయబ్ హుస్సేన్, వైద్యారోగ్య శాఖ అధికారులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాడిచర్ల పీహెచ్‌సీకి సర్పంచ్ బండి స్వామి ఆకస్మిక సందర్శన

- వైద్య సేవలు, సమస్యలపై డాక్టర్‌తో చర్చ



మల్హర్, సెప్టెంబర్ 29 ప్రజాకలం ప్రతినిధి... మండల కేంద్రమైన తాడిచర్ల గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం స్థానిక సర్పంచ్ బండి స్వామి ఆకస్మికంగా సందర్శించారు. పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని డాక్టర్ వినయ్ భాస్కర్‌ను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా డాక్టర్ వినయ్ భాస్కర్ మాట్లాడుతూ ప్రతిరోజూ 200 మందికి పైగా ఓపీకి వస్తున్నారని తెలిపారు. జ్వరం, ఇతర ఆరోగ్య సమస్యలతో వచ్చే ప్రతి ఒక్కరినీ పరీక్షించి, అవసరమైన చికిత్స అందిస్తూ ఆరోగ్య జాగ్రత్తలపై సూచనలు చేస్తున్నట్లు వివరించారు.పీహెచ్‌సీలో ఉన్న పలు సమస్యలను సర్పంచ్ దృష్టికి డాక్టర్ తీసుకెళ్లారు. సమస్యలను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేలా కృషి చేస్తానని సర్పంచ్ బండి స్వామి తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సేవలను మారుమూల దళిత కాలనీలలో నిర్వహించాలి




ప్రజాకలం ప్రతినిధి భద్రాచలం, సెప్టెంబర్ 29

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పరిధిలో దళిత కాలనీ లల్లో నాన్యమైన వైద్య సేవలు అందించాలి. వైద్యం అందక దళితులు అనేకమంది మృత్యువాత పడ్డారు. దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారు. అధిక శాతం దళిత కుటుంబాలకు సంబంధించిన వారే ఎక్కువగా రక్తహీనత వ్యాధితో బాధపడుతున్నారు. కావున నూతనంగా ఎన్నిక కాబడిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ దళిత కాలనీలలో మెడికల్ క్యాంపులు, రక్తదాన కార్యక్రమాలు, కంటి ఆపరేషన్లు, రక్తహీనత బాధితుల దళిత కుటుంబాలకు పూర్తి అండగా ఉండాలని విజ్ఞప్తి చేస్తున్నాము. చదువుకున్న ప్రతిభ కలిగిన యువతి యువకులైన దివ్యాంగులకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యాలయంలో అర్హతను బట్టి ఉద్యోగ ఉపాధి అవకాశం కల్పించాలి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సదరన్ క్యాంపులు ఏర్పాటు చేసే విధంగా చొరవ చూపి వారికి రక్షణగా ఉండాలని ఆశిస్తున్నాము.... గౌరవ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వం తరపున ఎమ్మార్పీఎస్, ఎంఎస్సీ,మహాజన మహిళ మండలి ఎం ఎం ఎం ,మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ ఎం ఎస్ యఫ్ , వికలాంగుల హక్కుల పోరాట సమితి వి హెచ్ ఎం , మాదిగ మహిళ సమైక్య ఎం ఎం ఎస్ , భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ తరుపున హృదయపూర్వక అభినందనలు శుభాకాంక్షలు... పోటీ తత్వంతో ఏర్పడ్డ మీ యొక్క నూతన కమిటీ ఎటువంటి విభేదాలు లేకుండా ప్రజా సేవలో మమైక్యమై ఐక్యతతో అందరికీ ఆదర్శంగా నిలవాలని మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

పిఆర్టియూ టీఎస్ మల్హర్ నూతన కార్యవర్గం ఎన్నిక

మండల అధ్యక్షుడిగా పాకాల తిరుపతిరెడ్డి..
కార్యదర్శిగా గజాడి మహేష్



మల్హర్, సెప్టెంబర్ 29 ప్రజాకలం ప్రతినిధి... పిఆర్టియూ టీఎస్ మల్హర్ మండల శాఖ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పాకాల తిరుపతిరెడ్డి, కార్యదర్శిగా గజాడి మహేష్ ఎన్నికయ్యారు.సహాయ అధ్యక్షులుగా మహేందర్, గీత, ఉపాధ్యక్షులుగా మహిపాల్, శైలజ, కార్యదర్శులుగా సాంబయ్య, శాంతిలత ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడు రేగురి సుభాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి కుసుమ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల పరిశీలకుడిగా సురేష్ వ్యవహరించారు.నూతన కార్యవర్గ సభ్యులను జిల్లా, రాష్ట్ర నాయకులు అభినందించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణతో పాటు సంఘం బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

2న చలో నిర్మల్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఆందోళన

- టియుడబ్ల్యూజె నిర్మల్ జిల్లా కమిటీ పిలుపు

నిర్మల్ సెప్టెంబర్ 29 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

దేశవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారం కోసం ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజెయు) ఇచ్చిన పిలుపు మేరకు అక్టోబర్ 2న ఆందోళన కార్యక్రమం నిర్వహించనున్నారు. తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టియుడబ్ల్యూజె) ఆధ్వర్యంలో ఈ నిరసన చేపట్టనున్నారు. ఈ కార్యక్రమం నిర్మల్ జిల్లా కేంద్రంలోని గాంధీ పార్క్ గాంధీ విగ్రహం ముందు జరగనుంది. కావున జిల్లాలోని అన్ని మండలాల నుంచి విలేకరులు, శ్రమజీవులైన పత్రికా విలేకరులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టియుడబ్ల్యూజె నిర్మల్ జిల్లా కమిటీ,జిల్లా అధ్యక్షులు కొండూరు రవీందర్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంక గారి భూమయ్య పిలుపుని నిచ్చారు.

నిర్మల్ పట్టణంలో ఘనంగా
'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమం.

నిర్మల్ సెప్టెంబర్ 29(ప్రజా కలం జిల్లా ప్రతినిధి) పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అనే సందేశంతో నిర్మల్ పట్టణంలో మంగళవారం 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. దేశవ్యాప్తంగా సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 17 వరకు నిర్వహిస్తున్న ఈ మాసోత్సవాల్లో భాగంగా, బ్యాంక్ ఉద్యోగులు, మున్సిపల్ సిబ్బంది నంయుక్తంగా ధర్మసాగర్ పరిసర ప్రాంతాలతో పాటు బస్ స్టాండ్ ఆవరణలో భారీ పారిశుధ్య కార్యక్రమాన్ని చేపట్టారు.



పట్టణాన్ని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో సాగిన ఈ కార్యక్రమంలో ప్రజా ప్రయోజనార్థం పరిసరాల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించారు.

ఈ కార్యక్రమంలో అధికారులంతా స్వయంగా పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టారు. వీధి పరిసరాలు, ప్రజా రవాణా కేంద్రాల వద్ద చెత్తను తొలగిస్తూ పరిసరాల శుభ్రత ప్రాధాన్యతను ప్రజలకు వివరించారు. పరిసరాల పరిశుభ్రత ప్రతి పౌరుని బాధ్యత అని గుర్తు చేశారు. ప్రతి పౌరుడు తమ ఇల్లు, చుట్టుపక్కల ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా నిర్వాహకులు పిలుపునిచ్చారు. ఈ ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవి బాబు, ఎల్డీఎం రామ్ గోపాల్, టీజీబీ రీజినల్ మేనేజర్ నవీన్ తో పాటు పలువురు బ్యాంకింగ్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది స్వయంగా పాల్గొన్నారు.

రూ. 7.95 కోట్లతో అత్యాధునిక భవన నిర్మాణం
త్వరలోనే శంకుస్థాపన చేయనున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లిశ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి సెప్టెంబర్ 29: మహబూబ్‌నగర్ పట్టణంలోని చారిత్రాత్మక ఎంవీఎస్ (వీఆర్) ప్రభుత్వ జూనియర్ కళాశాల రూపురేఖలు సమూలంగా మారనున్నాయి. పేద, మధ్యతరగతి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి వసతులతో నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం రూ. 7.95 కోట్ల భారీ నిధులను మంజూరు చేసింది. ఈ నూతన భవన నిర్మాణ పనులకు స్థానిక శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ లిశ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి లి అతి త్వరలోనే భూమిపూజ చేయనున్నారు. ఎంవీఎస్ (వీఆర్) జూనియర్ కళాశాల భవన నిర్మాణ ప్రాజెక్టు ముఖ్యాంశాలు:

విశాల ప్రాంగణం : ఏకంగా 6 ఎకరాల విస్తీర్ణంలో,రూ. 7.95 కోట్ల భారీ నిధులతో ఆహ్లాదకరమైన వాతావరణంలో నూతన భవన నిర్మాణం.


ఆధునిక వసతులు : విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా విశాలమైన క్లాస్‌రూమ్‌లు, ప్రత్యేక పరిపాలనా విభాగాలు.

అత్యాధునిక ల్యాబ్‌లు : సైన్స్ విద్యార్థుల ప్రాక్టికల్స్ కోసం ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ విభాగాలకు హైటెక్ ప్రయోగశాలలు.

డిజిటల్ విద్య ఽ లైబ్రరీ : విశాలమైన రీడింగ్ రూమ్‌తో కూడిన అత్యాధునిక గ్రంథాలయం, డిజిటల్ లెర్నింగ్ క్లాస్‌రూమ్‌లు.

మౌలిక సదుపాయాలు : నిరంతర శుద్ధ తాగునీరు, బాలబాలికలకు ప్రత్యేక శౌచాలయాలు, క్రీడా మైదానం అభివృద్ధి.

ఎండిపోయిన మినుముల పంటలకు ఎకరాకు రూ.70 వేల నష్ట పరిహారం చెల్లించాలి
రైతుల రుణమాఫీ వెంటనే అమలు చేయాలి
సీపీఎం మండల కార్యదర్శి దశరథం



నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 29 ప్రజా కలం (ప్రతినిధి): పెద్దకొత్తపల్లి మండలాన్ని కరువు ప్రాంతంగా గుర్తించి ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం అందించాలని సీపీఎం మండల కార్యదర్శి దశరథం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో చిన్నకార్పాముల, పెద్దకార్పాముల, నాయనోనిపల్లి గ్రామాల రెవెన్యూ పరిధిలో ఎండిపోయిన మినుముల పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా చిన్నకార్పాముల గ్రామానికి చెందిన రైతులు గువ్వల నరసయ్య, బండిపల్లి శంకర్ సాగు చేసిన మినుముల పంటలను సీపీఎం బృందం పరిశీలించారు. ఇరువురు రైతులు 9ఎకరాల్లో మినుముల పంట సాగు చేయగా విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, ట్రాక్టర్ దున్నకాలు, కూలీల ఖర్చులు తదితర వాటికి సుమారు రూ.లక్ష వరకు ఖర్చు చేసినట్లు తెలిపారు. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో నీటి కొరత ఏర్పడి పంట ఎదుగుదల తగ్గిందని దిగుబడి పూర్తిగా పడిపోయి తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.బోర్లు ఉన్నప్పటికీ విద్యుత్ సరఫరా సరిపోకపోవడం, కాలువల ద్వారా నీరు అందకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని సీపీఎం నాయకులు తెలిపారు. మండలంలో పెద్ద సంఖ్యలో రైతులు మినుముల సాగు చేయడంతో దిగుబడి లేక అప్పుల పాలయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు.ఎండిపోయిన పంటలను ప్రభుత్వం వెంటనే సర్వే చేసి రైతులకు ఎకరాకు రూ.70 వేల నష్టపరిహారం చెల్లించాలని దశరథం డిమాండ్ చేశారు. అలాగే రైతుల వ్యవసాయ రుణాలను తక్షణమే మాఫీ చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శాలిస్వర్, సీఐటీయూ మండల అధ్యక్షుడు ఇంద్రకంటి బాలస్వామి, సీపీఎం నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా
ధాన్యం సేకరణ చేపట్టాలి
అక్టోబర్ 1 నుండి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి :జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి సెప్టెంబర్ 29:

వానాకాలం (ఖరీఫ్) 2026-27 సీజన్‌లో ధాన్యం సేకరణను పకడ్బందీగా నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సూచించారు.మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరం లో ఖరీఫ్ 2026-27 ధాన్యం కొనుగోలుపై నిర్వహించిన అవగాహనా సదస్సు, శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు, సిబ్బంది, గన్నీ సంచులు, తూకం, తేమ పరీక్ష, ధాన్యం శుభ్రపరిచే పరికరాలు ముందుగానే సిద్ధంగా ఉంచాలని సూచించారు.జిల్లాలో ఖరీఫ్ 2026-27లో సుమారు 4.26 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా ఉండగా, అందులో 1.53 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం జిల్లాలో 163 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 1 నుంచి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. కొనుగోలు కేంద్రాలను ఎత్తైన, ముంపునకు అవకాశం లేని ప్రాంతాల్లో ఏర్పాటు చేయడంతో పాటు రైతులకు తాగునీరు, నీడ, కూర్చునే సౌకర్యం, విద్యుత్ తదితర వసతులు కల్పించాలని పేర్కొన్నారు.ప్రతి కొనుగోలు కేంద్రంలో సన్న, దొడ్డు రకం ధాన్యానికి వేర్వేరు కౌంటర్లు ఏర్పాటు చేయాలని, ధాన్యాన్ని ట్రూ అమర్చిన వాహనాల ద్వారా సంబంధిత మిల్లులు, గోడౌన్లకు మాత్రమే తరలించాలని సూచించారు. కొనుగోలు వివరాలను ఆన్‌లైన్‌లో అదే రోజు నమోదు చేసి, రికార్డులను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు.గ్రేడ్-ఏ ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,461, సాధారణ రకానికి రూ.2,441 కనీస మద్దతు ధరగా ప్రభుత్వం నిర్ణయించిందని అధికారులు తెలిపారు. ప్రభుత్వం గుర్తించిన ఏడు సన్న రకాల ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లించనున్నట్లు వివరించారు.

రైతులు ధాన్యాన్ని నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా శుభ్రపరిచి, ఎండబెట్టి, వ్యవసాయ శాఖ జారీ చేసిన టోకెన్ ప్రకారం నిర్ణయించిన తేదీన కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ధాన్యంలో తేమ శాతం గరిష్టంగా 17 శాతం ఉండాలని తెలిపారు.

కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పాటిస్తూ రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చూడాలని, కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన మద్దతు ధర మొత్తాన్ని 48 గంటల్లో రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఎల్ 3 కేటగిరీకి సరిపోయే కొనుగోలు కేంద్రాలను మాత్రమే ఓ.పి.ఎం.ఎస్.కు అనుసంధానం చేయడం జరుగుతుందని తెలిపారు. రబీ 2025-26 కు సంబంధించి ధాన్యం కొనుగోలు కమిషన్ 2 కోట్ల 61 లక్షల రూ.లు బుధవారం సాయంత్రం లోగా కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల ఖాతాల్లో జమ చేయాలని డి.ఆర్.డి.ఓ,సహకార శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని,అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె.ఎల్.బి.హరిప్రియ,పౌర సరఫరాల శాఖ డి. ఎం.రవి నాయక్,జిల్లా పౌర సరఫరాల అధికారి గంప శ్రీనివాస్,డి.ఆర్.డి.ఓ నర్సింహులు,జిల్లా సహకార అధికారి కృష్ణ,జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్, జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి రవీందర్,జిల్లా సహకార ఆడిట్ అధికారి లైటస్ పాల్,జిల్లా మార్కెటింగ్ అధికారిని బాల మణి,సంబంధిత శాఖల అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, పీఏసీఎస్, ఐకేపీ, మార్కెట్ కమిటీలు, పర్యవేక్షణ అధికారులు,వ్యవసాయ విస్తరణ అధికారులు, ధాన్యం రవాణా కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

వివాదాల పరిష్కారంలో మధ్యవర్తిత్వం కీలకం
- మీడియేషన్‌తో సమయం ఖర్చు ఆదా.. కోర్టులపై పనిభారం తగ్గుతుంది
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి. రమాకాంత్



నాగర్‌కర్నూల్ సెప్టెంబర్ 29 (ప్రజా కలం): రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ (డి ఎల్ ఎస్ ఏ) నాగర్‌కర్నూల్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రాంగణంలో మంగళవారం 'మీడియేషన్ 3.0' పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ శ్రీ డి. రమాకాంత్ హాజరై పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివాదాల పరిష్కారంలో మధ్యవర్తిత్వం మీడియేషన్ ఎంతో ప్రాధాన్యత కలిగిన ప్రత్యామ్నాయ న్యాయ పరిష్కార విధానమని తెలిపారు. మధ్యవర్తిత్వం ద్వారా కేసులను పరస్పర అంగీకారంతో త్వరితగతిన పరిష్కరించుకోవచ్చని, అదేవిధంగా కక్షిదారులకు సమయం, న్యాయపరమైన ఖర్చులు తగ్గుతాయని పేర్కొన్నారు. మధ్యవర్తిత్వం ద్వారా కుదిరే పరిష్కారానికి న్యాయపరమైన గుర్తింపు ఉంటుందని వివరించారు. చిన్నచిన్న వివాదాలను కోర్టు విచారణకు వెళ్లకుండా మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవడం వల్ల ఇరుపక్షాలకు ప్రయోజనం కలుగుతుందని అన్నారు. పరస్పర చర్చలు, రాజీ ద్వారా సమస్యకు పరిష్కారం లభించడం వల్ల సంబంధాలు కూడా మెరుగ్గా కొనసాగించే అవకాశం ఉంటుందని తెలిపారు. స్పెషల్ సెషన్స్ జడ్జి, పోక్సో కోర్టు శ్రీమతి నసీమ సుల్తాన మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించగల చిన్నచిన్న కేసులను త్వరితగతిన పరిష్కరించడం వల్ల కోర్టులపై ఉన్న పనిభారం తగ్గుతుందని తెలిపారు. తద్వారా ఇతర ముఖ్యమైన కేసుల విచారణకు న్యాయస్థానాలకు మరింత సమయం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రజలు అందుబాటులో ఉన్న న్యాయ సేవలను ఉపయోగాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి శ్రీమతి నిహారిక, సీనియర్ సివిల్ జడ్జ్ శ్రీమతి గోపిక నాగ శ్రావ్య తదితరులు పాల్గొన్నారు.

ధార్ కుభీర్, బెల్గావ్ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ
- ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



నిర్మల్ సెప్టెంబర్ 29 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

కుభీర్ మండలంలోని ధార్ కుభీర్, బెల్గావ్ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ భూమిపూజ నిర్వహించారు. ధార్ కుభీర్ గ్రామంలో మహిళా సమైక్య సంఘ భవనం, గోదాం నిర్మాణంతో పాటు బెల్గావ్ గ్రామంలో వీవో భవనాలు, అంగన్‌వాడీ కేంద్రం, గోదాం నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఎమ్మెల్యేను కలిసి తమ గ్రామాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ధార్ కుభీర్ నుంచి బెల్గావ్ వరకు రహదారి సౌకర్యం సరిగా లేక రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. గ్రామ ప్రజల ప్రయాణ సౌకర్యార్థం బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. అదేవిధంగా ఇరిగేషన్ పరిధిలో చెరువు నుంచి పంట పొలాలకు సాగునీరు అందించేందుకు రెండు కెనాల్స్ నిర్మించాలని బెల్గావ్ గ్రామస్థులు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు.గ్రామస్థుల విజ్ఞప్తులపై స్పందించిన ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. చెరువుల మరమ్మతులు, నీటి నిల్వ కోసం కెనాల్ నిర్మాణం, పంట పొలాలకు వెళ్లేందుకు రహదారుల ఏర్పాటు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు వంటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.అలాగే గ్రామాల మధ్య రాకపోకలు సులభతరం చేసేందుకు బీటీ రోడ్ల నిర్మాణం, గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం వంటి అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. భూగర్భ జలాలను పెంపొందించేందుకు ఇంకుడు గుంతల నిర్మాణం వంటి కార్యక్రమాలను కూడా చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ధార్ కుబీర్ సర్పంచ్ తోకల మరోతి,బెల్లాశే సర్పంచ్ గోవర్ధన్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, మండల సీనియర్ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నూతన రేషన్ కార్డుల పంపిణీ
పేద కుటుంబాలకు రేషన్ కార్డులతో మేలు
స్థానిక సర్పంచ్ వాసం సుస్మిత, కాంగ్రెస్ మండల అధ్యక్షులు వాసం శ్రీకాంత్



ఆళ్లపల్లి,సెప్టెంబర్29 (ప్రజాకలం)

ఆళ్లపల్లి మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వాసం సుస్మిత పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వాసం శ్రీకాంత్ మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి కుటుంబాలకు రేషన్ కార్డు ఎంతో ముఖ్యమని అన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవడంఅభినందనీయమని తెలిపారు. రేషన్ కార్డుల ద్వారా ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు మరింత చేరువవుతాయని పేర్కొన్నారు. సర్పంచ్ వాసం సుస్మిత మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. నూతన రేషన్ కార్డులు పొందిన లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.కొత్త రేషన్ కార్డులు అందుకున్న లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

సాతాపూర్‌లో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ మెరుపు దాడులు
3600 కిలోల నల్లబెల్లం స్వాధీనం.. ముగ్గురు అరెస్ట్.. ప్రధాన నిందితుడు పరారీ



నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 29 (ప్రజా కలం): నాగర్‌కర్నూల్ జిల్లాలో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు మెరుపు దాడులు నిర్వహించి భారీగా అక్రమంగా నిల్వ ఉంచిన నల్లబెల్లాన్ని స్వాధీనం చేసుకున్నారు. నాగర్ కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం సాతాపూర్‌లోని బాలాజీ రైస్‌మిల్‌పై సమాచారం మేరకు ఆకస్మికంగా దాడి చేసిన అధికారులు సుమారు 3,600 కిలోల నల్లబెల్లాన్ని పట్టుకున్నారు. అధికారుల వివరాల ప్రకారం రైస్‌మిల్‌లో 120 బస్తాల్లో నల్లబెల్లాన్ని అక్రమంగా నిల్వ ఉంచినట్లు గుర్తించారు. నల్లబెల్లంతో పాటు అక్రమ రవాణాకు ఉపయోగిస్తున్నట్లు భావిస్తున్న అశోక్ లేలాండ్ వాహనాన్ని సీజ్ చేసి కొల్లాపూర్ ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. ఈ వ్యవహారంలో అక్రమ రవాణాకు సహకరించిన ముగ్గురిని ఎక్సైజ్ అధికారులు అరెస్ట్ చేశారు. బీహార్‌కు చెందిన రాంబాబు రాయ్, కృష్ణ యాదవ్, తెలకపల్లికి చెందిన మహమ్మద్ అలీని అదుపులోకి తీసుకున్నారు. ఈ వ్యవహారంలో ప్రధాన నిందితుడిగా పేర్కొంటున్న సునీల్ కుమార్ పరారీలో ఉన్నట్లు అధికారులు తెలిపారు.ఈ ఘటనపై మొత్తం నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. స్వాధీనం చేసుకున్న నల్లబెల్లం వాహనాన్ని కొల్లాపూర్ ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించి తదుపరి చర్యలు చేపడుతున్నారు.నాగర్‌కర్నూల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వేణుగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ జిన్నా నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో ఈ దాడులు నిర్వహించినట్లు అధికారులు వెల్లడించారు. జిల్లాలో అక్రమ మద్యం తయారీ, రవాణాకు ఉపయోగించే పదార్థాల అక్రమ నిల్వపై నిఘా కొనసాగుతుందని ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి
-జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి,సెప్టెంబర్ 29:((ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

ప్రజలకు ప్రభుత్వ సేవలు సత్వరంగా,సమర్థవంతంగా అందించేందుకు అధికారులు,సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు.మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని వివిధ కార్యాలయాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి,కార్యాలయాల నిర్వహణ,ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులు,ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు.ఫైళ్లు, రికార్డులను క్రమపద్ధతిలో నిర్వహించాలని,కార్యాలయాలు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు.ప్రజలకు అవసరమైన సమాచారం,సేవలు సులభంగా అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని,ప్రజల సమస్యలను నిబంధనల మేరకు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు.ఈ తనిఖీల్లో కలెక్టరేట్ ఏవో బండి ప్రకాష్,సంబంధిత అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.



వైసీపీకి గడ్డుకాలం.. రాజీనామాల పర్వం..

విజయనగరం : స్థానిక సంస్థల ఎన్నికల ముంగిట వైసీపీకి వరస దెబ్బలు తగులుతున్నాయి. ఆ పార్టీలో రాజీనామాల పర్వం కొనసాగుతోంది. తాజాగా వైసీపీ సీనియర్ నాయకుడు మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ సొంత నియోజకవర్గమైన చీపురుపల్లిలో మెరకముడిదాం వైసీపీ మండల అధ్యక్షుడుతో పాటు.. 13 గ్రామాలకు చెందిన పలువురు మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర ముఖ్య నేతలు పార్టీని వీడారు. పైగా వీరంతా చిన్న శ్రీను అడుగుజాడల్లోనే నడుస్తామని చెప్పారు. త్వరలోనే వారంతా తెలుగుదేశం పార్టీలో చేరనున్నట్లు తెలుస్తోంది.వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి వరస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఈ మధ్య కాలంలో చాలామంది నేతలు ఆ పార్టీ నుంచి దూరమవుతున్నారు. ఇదే విధంగా వైసీపీ సీనియర్ నాయకుడు మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ సొంత నియోజకవర్గమైన చీపురుపల్లిలో వైసీపీకి బిగ్ షాక్ తగిలింది. మెరకముడిదాం మండలంలో పార్టీకి చెందిన పలువురు కీలక నేతలు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. దీంతో అక్కడి స్థానిక రాజకీయాలు ఒక్కసారిగా హీట్ ఎక్కాయి. మెరకముడిదాం వైసీపీ మండల అధ్యక్షుడు కోట్ల వెంకట్రావుతో పాటు 13 గ్రామాలకు చెందిన పలువురు మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర ముఖ్య నేతలు పార్టీని వీడారు. ఈ సందర్భంగా తమ రాజీనామా లెటర్లను వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి పంపుతున్నట్టు వారు వెల్లడించారు. కాగా ఇటీవలె బొత్స సత్యనారాయణ 229 అసెంబ్లీ ఎన్నికల్లో తాను చీపురుపల్లినుంచే పోటీ చేస్తానని ప్రకటించారు.ఇదే సమయంలో ఇంతమంది రాజీనామాలు చేయడం వైసీపీకి తీవ్ర ఇబ్బందికర పరిణామంగా మారిందనే చెప్పుకోవాలి.రీసెంట్‌గా బొత్స మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. ఈ సందర్భంగా బొత్స సత్యనారాయణ కూడా భావోద్వేగానికి గురయ్యారు. అయితే ఇప్పుడు మెరకముడిదాం మండలంలో రాజీనామా చేసినవారంతా కూడా చిన్న శ్రీను అడుగుజాడల్లోనే నడుస్తామని చెప్పారు. త్వరలోనే వారంతా తెలుగుదేశం పార్టీలో చేరనున్నట్లు తెలుస్తోంది.ఏపీలో వైసీపీలో రాజీనామాల పర్వం సాగుతుంది. ఈ మధ్యకాలంలో వరసగా పలువురు కార్యకర్తలతో పాటు కీలక నేతలు సైతం పార్టీని వదిలి వెళ్లిపోయారు. కాకినాడ జిల్లా తునికి చెందిన యనమల కృష్ణుడు వైసీపీకి రిజైన్ చేసి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు.ఇక బుక్కపట్నం నవీన్ నిశ్చల్ కూడా ఇదే బాటలో నడిచారు. హిందూపురం వైసీపీ మాజీ అధ్యక్షుడు బుక్కపట్నం నవీన్ నిశ్చల్ పార్టీకి రాజీనామా చేసి ఆ లేఖను అధిష్ఠానానికి పంపించారు. ఇక నంద్యాలలో మాజీ సర్పంచ్‌తోపాటు దాదాపు 200 మంది నేతలు, కార్యకర్తలు వైసీపీని వదిలి తెలుగు దేశం పార్టీలో చేరారు. అలాగే గతంలో చీపురుపల్లికి చెందిన ఓ మాజీ జడ్పీటీసీ దంపతులు కూడా పార్టీకి రాజీనామా చేశారు.

సజ్జలే టార్గెట్ గా సీనియర్లు

ఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత అసంతృప్తి దావానలంలా వ్యాపిస్తోంది. 2024 ఎన్నికల్లో ఘోర పరాభవం తర్వాత పార్టీని పునర్నిర్మించాల్సిన తరుణంలో.. తాడేపల్లి కేంద్రంగా నడుస్తున్న కోటరీ పెత్తనం పై సీనియర్ నేతల సహనం నశించిపోతోంది. స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి వైఖరిపై సొంత పార్టీ అగ్రనేతలే రగిలిపోతున్నారు. ప్రజల్లో బలమైన నేతలుగా ఎదిగి, దశాబ్దాలుగా ప్రజాక్షేత్రంలో గెలిచిన సీనియర్లు సైతం తమ సమస్యలు, నియోజకవర్గ పరిస్థితులను నేరుగా పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి చెప్పుకునే వీలు లేకుండా పోయింది. జగన్ చుట్టూ సజ్జల నిర్మించిన అభేద్యమైన ప్రహరీ ని దాటి ఏ ఫైల్ కానీ, ఏ సమాచారం కానీ అధినేత వద్దకు చేరకపోవడంతో పార్టీలో ముసలం తారస్థాయికి చేరింది.పార్టీ అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలోనూ, ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నా.. జగన్‌కు, క్షేత్రస్థాయి నాయకత్వానికి మధ్య సజ్జల ఒక సూపర్ పవర్‌లా వ్యవహరిస్తున్నారన్నది బహిరంగ రహస్యం. రాయలసీమలో బలమైన నేతగా ఉన్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉత్తరాంధ్రలో సీనియర్ నాయకుడైన బొత్స సత్యనారాయణ వంటి హేమాహేమీలు సైతం నేరుగా జగన్‌ను కలవలేక, సజ్జలకే రిపోర్ట్ చేయాల్సి రావడం వారిని ఇబ్బందుల్లోకి నెట్టింది. తమ రాజకీయ అనుభవం ముందు సజ్జల ఎక్కడా సరితూగరని, కనీసం ఒక పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా కూడా పోటీ చేసి గెలవలేని వ్యక్తి ముందు తాము చేతులు కట్టుకుని నిలబడాల్సి రావడంపై సీనియర్లు తీవ్ర అవమానంగా భావిస్తున్నారు. ప్రజాబలం ఉన్న తమపై, కేవలం జగన్ అండ చూసుకుని సజ్జల పెత్తనం చెలాయించడాన్ని పార్టీలోని పెద్ద తలకాయలు ఏమాత్రం జీర్ణించుకోలేకపోతున్నారు.క్షేత్రస్థాయిలో మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. నియోజకవర్గాల్లో కూటమి ప్రభుత్వం దూకుడు, స్థానిక నాయకుల వలసలతో కేడర్ చెదిరిపోతుంటే.. తాడేపల్లి నుంచి ఎలాంటి మార్గదర్శకత్వం లభించడం లేదు. ఏ చిన్న విషయమైనా సజ్జలను బతిమాలుకోవాల్సి రావడం, ఆయన ఇచ్చే అసంబద్ధమైన సలహాలు, తీసుకునే ఏకపక్ష నిర్ణయాలతో మాజీ ఎమ్మెల్యేల్లో సింహభాగం సజ్జల ముఖం చూడటానికే ఇష్టపడటం లేదు. ఈ పరిణామాలు చూస్తుంటే.. సజ్జల విధానాల వల్లనే పార్టీ 11 సీట్లకు పరిమితమైందన్న ఆగ్రహం నేతల్లో ఏ స్థాయిలో పేరుకుపోయిందో స్పష్టమవుతోంది.సజ్జల రామకృష్ణారెడ్డి నాయకత్వం, ఆయన పెత్తనంపై తిరుగుబాటు చేయడానికి పార్టీలోని సీనియర్లంతా వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు.

ఒకవేళ ఏ ఒక్క సీనియర్ నేత అయినా ధైర్యం చేసి సజ్జలపై బహిరంగంగా తిరుగుబాటు బావుటా ఎగరేస్తే.. ఆయనకు మద్దతు పలికేందుకు మెజారిటీ మాజీ ఎమ్మెల్యేలు, జిల్లా అధ్యక్షులు క్యూ కట్టడం ఖాయంగా కనిపిస్తోంది. ఎందుకంటే వైసీపీలో ప్రస్తుతం సజ్జలకు సొంత కేడర్ గానీ, ప్రజాబలం గానీ లేదు. ఆయనకు అండగా నిలబడే నేతలు పార్టీలో వేళ్లమీద లెక్కపెట్టే సంఖ్యలోనే ఉంటారని వైసీపీ వర్గాలకే స్పష్టంగా తెలుసు. ప్రజాక్షేత్రంలో తిరిగే నాయకులకు, తాడేపల్లి ఏసీ గదుల్లో ప్రెస్ మీట్లు పెట్టే నేతలకు మధ్య ఉన్న ఈ అంతరం ఇప్పుడు పార్టీని నిట్టనిలువునా చీల్చే స్థాయికి చేరింది.స్థానిక సంస్థల ఎన్నికలు ముంచుకొస్తున్న ఈ క్లిష్ట సమయంలో కూడా జగన్ తన పాత వైఖరిని మార్చుకోకపోతే పార్టీకి మరిన్ని గడ్డు పరిస్థితులు తప్పవు. కనీసం ఇప్పటికైనా సజ్జల పెత్తనానికి కళ్లెం వేసి, నేరుగా నాయకులకు అపాయింట్‌మెంట్లు ఇవ్వకపోతే.. అసంతృప్త నేతలంతా మూకుమ్మడిగా తిరుగుబాటు చేయడం లేదా ఇతర పార్టీల వైపు వలస వెళ్లడం ఖాయం. ఒక అనామక వ్యవస్థ చేతిలో పార్టీని బందీగా మార్చి, ప్రజానేతలను అవమానించే సంస్కృతిని కొనసాగిస్తే.. రేపు తాడేపల్లి ప్యాలెస్‌లో జగన్, సజ్జల తప్ప మిగిలే వారెవరూ ఉండరనే చేదు నిజాన్ని వైసీపీ శ్రేణులే బహిరంగంగా చర్చించుకుంటున్నాయి.

గ్రామకంఠం భూములపై సీఆర్డీఏ క్లారిటీ..

విజయవాడ : ఏపీ రాజధాని అమరావతి పరిధిలోని గ్రామకంఠం మినహాయింపులపై సీఆర్డీఏ స్పష్టత ఇచ్చింది. 08-12-2014ను కటాఫ్ తేదీగా నిర్ణయించి.. ఆ తేదీకి ముందే నిర్మాణాలు ఉన్న భూములు, చదరపు గజాల ప్రాతిపదికన రిజిస్ట్రేషన్లు చేసుకున్న ప్లాట్లను నిబంధనల ప్రకారం మినహాయింపునకు పరిశీలన చేసినట్లు తెలిపింది. గ్రామ నివాస ప్రాంతానికి దూరంగా ఉన్న ఖాళీ వ్యవసాయ భూములు, కటాఫ్ తర్వాత రిజిస్ట్రేషన్లు జరిగిన భూములకు మినహాయింపు వర్తించదని సీఆర్డీఏ తెలిపింది. ఇప్పటికే 6,473.72 ఎకరాలను ఎల్‌పీఎస్ నుంచి మినహాయించినట్లు సీఆర్డీఏ తెలిపింది. కమిటీకి వచ్చిన 685 దరఖాస్తులపై క్షేత్రస్థాయి పరిశీలన చేసినట్లు పేర్కొంది. రికార్డులు, శాటిలైట్ చిత్రాలు, రిజిస్ట్రేషన్ ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. తాజా అప్లికేషన్లు, అభ్యంతరాలను జేసీ ఆధ్వర్యంలోని కమిటీ పరిశీలించి ఖరారు చేస్తుందని సీఆర్డీఏ ఓ ప్రకటనలో తెలిపింది. అర్హులైన రైతులకు నిబంధనల ప్రకారం అన్ని ప్రయోజనాలు అందిస్తామని తెలిపింది. విజయవాడలో దశాబ్దాల నాటి ఇళ్ల పట్టాల సమస్యకు ఏపీ ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపించింది. పేదల సొంతింటి కలకు భరోసా కల్పించేందుకు రెడీ అయింది. విశాఖలో 28,445 కుటుంబాలకు పట్టాలిచ్చిన తరహాలో ఈనెల 30న విజయవాడలో మరో భారీ కార్యక్రమం చేపట్టనుంది. 24,057 కుటుంబాలకు రూ. 9,800 కోట్ల విలువైన భూమిపై క్రమబద్ధీకరణ పట్టాలను సీఎం చంద్రబాబు అందించనున్నారు. ఎన్టీఆర్ హయాంలో ఇచ్చిన పట్టాలకు సంపూర్ణ హక్కులు కల్పిస్తూ పేదల సొంతింటి కలను నెరవేర్చనున్నారు. ఇళ్ల పట్టాల పంపిణీతో ఒక్కో కుటుంబానికి సుమారు రూ. 40 లక్షల నుంచి రూ. 45 లక్షల వరకు ప్రయోజనం చేకూరనుంది. తమ ఇళ్లకు శాశ్వత హక్కులుకల్పించాలని ఎన్నోఏళ్లుగా పేద ప్రజలు కోరుతున్నారు. వారి కల సాకారం నేడు సాకారం కానుంది. ఎన్టీఆర్ జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గంలో ఇళ్ల పట్టాల పంపిణీ జరగనుంది. మొత్తం 15 మండలాల్లోని 617 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న 29.86 లక్షల చదరపు గజాల స్థలాలపై లబ్ధిదారులకు సంపూర్ణ హక్కులు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పట్టాలు పంపిణీ చేయనుంది.

ఎన్ఆర్ఐల భూములే టార్గెట్

విజయవాడ : కృష్ణా జిల్లా పెనమలూరులో మోసం బయటపడింది. ఎన్ఆర్ఐల భూములే టార్గెట్ చేస్తూ వాటిని అమ్మి సొమ్ము చేసుకుంటున్న గ్యాంగ్‌ని పోలీసులు అరెస్ట్ చేశారు. మొత్తం ఐదుగురుని అదుపులోకి తీసుకున్నారు. రీసెంట్‌గా విజయవాడ కేదారేశ్వరపేటకు చెందిన బిక్కిన సుబ్బారావుకు సంబంధించిన 800 గజాల భూమిని కొట్టేయడానికి ప్లాన్ చేసుకున్నారు. అయితే ఈ విషయం తెలుసుకున్న సుబ్బారావు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పోలీసులు దర్యాప్తు చేసి ముఠాను అరెస్ట్ చేశారు. ఈ గ్యాంగ్‌లో ఇంకొందరు పరారీలో ఉన్నారని, వారిని అరెస్టు చేసే అవకాశం ఉందని పోలీసులు వెల్లడించారు.కృష్ణా జిల్లా పెనమలూరులో ఘరానా మోసగాళ్లను పోలీసులు అరెస్ట్ చేశారు. ఔఖీఎల పొలాలను, భూములను టార్గెట్ చేస్తున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. బతికి ఉన్నవారు మరణించినట్టు సర్టిఫికెట్లను సృష్టించి, వారికి నకిలీ వారసులను కూడా సిద్ధం చేసి భూములను కొట్టేయడం వీరి పని. అరెస్టైన వారిలో ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలకు చెందిన ఎం. ఆదిరెడ్డి, ఎం. వెంకట రమణ ఫణి కుమార్, సాంబశివ ఉదయ భాస్కర్, శివ ఆంజనేయులు, అమలేశ్వర రావు ఉన్నారని గన్నవరం డీఎస్పీ ధర్మేంద్ర తెలిపారు. విజయవాడ కేదారేశ్వరపేటకు చెందిన బిక్కిన సుబ్బారావు దంపతులకు కానూరులో స్థలం ఉంది. వారి కుమార్తె హిమబిందు అమెరికాలో ఉంటున్నారు. ఈ ఫ్యామిలీ విషయం తెలుసుకున్న నిందితులు వారి 833 గజాల స్థలాన్ని స్వాహా చేసేందుకు ప్లాన్ చేశారు. ఇందులోభాగంగా నిందితులు బాధితుడి డాక్యుమెంట్ జెరాక్స్ కాపీని సంపాదించి బతికున్న సుబ్బారావు దంపతులు చనిపోయినట్టు ఫేక్ డెత్ సర్టిఫికెట్‌ను క్రియేట్ చేశారు. అమెరికాలో ఉన్న అసలు కుమార్తె స్థానంలో ప్రకాశం జిల్లాకు చెందిన మరో మహిళను తీసుకొచ్చి ఆమె పేరుతోనే నకిలీ కుటుంబ సభ్యుల సర్టిఫికెట్‌ను క్రియేట్ చేశారు. దాంతో ఆదిరెడ్డి పేరుతో జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ చేయించారు. అనంతరం ఆదిరెడ్డి తన గ్యాంగ్‌లోని మరో వ్యక్తికి ఈ స్థలాన్ని రిజిస్టర్ చేశారు. అయితే ఇక్కడే నిందితులకు ఊహించని ట్విస్ట్ ఎదురైంది. ఆ స్థలాన్ని ఓ వ్యక్తికి అమ్మేందుకు ప్రయత్నించగా అతను స్థలం పూర్వాపరాలను తెలుసుకున్నారు. దీంతో ఆ భూమి అసలు యజమాని బతికే ఉన్నట్టు తెలిసిపోయింది. తన భూమిపై అక్రమ లావాదేవీలు జరుగుతున్న తెలుసుకున్న అసలు ఓనర్ సుబ్బారావు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు ఈ దొంగ వ్యవహారాన్ని మొత్తం బయటకు తీశారుఈ గ్యాంగ్‌లో ఇంకొందరు పరారీలో ఉన్నారని, వారిని అరెస్టు చేసే అవకాశం ఉందని పోలీసులు వెల్లడించారు. ఈ సందర్భంగా విదేశాల్లో ఉన్నవాళ్లు తమ భూముల పట్ల జాగ్రత్తగా ఉండాలని, వాటికి సంబంధించిన ధ్రువపత్రాలను ఎవరికీ ఇవ్వొద్దని సూచించారు. దూరంగా ఉన్న తమ భూములను పర్యవేక్షించాలని సలహా ఇచ్చారు.

వైసీపీ ట్రాప్‌లో లోకేశ్

రాజమండ్రి : ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా డీఎస్సీ చుట్టూ జరుగుతున్న రాజకీయ పోరు తీవ్ర స్థాయికి చేరింది. ఈ అంశం వెనుక వైసీపీ రాజకీయ అస్త్రాలు, వ్యూహాలు ఉన్నాయనే విశ్లేషణలు రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా, విద్యాశాఖ మంత్రిగా ఉన్న నారా లోకేశ్ లక్ష్యంగా మరియు మిత్రపక్షాలైన టీడీపీ-బీజేపీ-జనసేన మధ్య సమతుల్యతను దెబ్బతీసే విధంగా ఈ వివాదాన్ని సజీవంగా ఉంచేందుకు వైసీపీ ప్రయత్నిస్తోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నారా లోకేశ్ లక్ష్యంగా వ్యూహంకూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి నియామక ప్రక్రియను వేగవంతం చేసింది. అయితే, నియామకాలు పూర్తయిన తర్వాత ఈ ప్రక్రియలో, ముఖ్యంగా స్పోర్ట్స్ కోటా, పేపర్ లీకేజీ మరియు టెట్ అర్హతలలో అక్రమాలు జరిగాయంటూ వైసీపీ ఆరోపిస్తోంది. గవర్నర్ కు కూడా ఫిర్యాదు చేశారు. ఎన్ని కేసులు పెట్టినా యుద్ధం ఆగదని జగన్ స్పష్టం చేయడంతో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఎదుట టీడీపీని పలుచన చేయాలని భావిస్తున్నట్లుంది.. విద్యా శాఖకు మంత్రిగా ఉన్న నారా లోకేశ్ ను నేరుగా టార్గెట్ చేయడం ద్వారా ఆయన రాజకీయ ప్రతిష్టను దెబ్బతీయడం వైసీపీ ప్రధాన వ్యూహంగా కనిపిస్తోంది. ఈ వ్యవహారంపై లోకేష్ రాజీనామా చేయాలని, సీబీఐ దర్యాప్తు జరిపించాలని జగన్ మోహన్ రెడ్డి డిమాండ్ చేస్తున్నారు. బీజేపీ ఎదుట టీడీపీని పలుచన చేసే వ్యూహమా?రాజకీయ విశ్లేషకుల ప్రకారం, వైసీపీ ఈ అంశాన్ని ఇంత పెద్ద ఎత్తున లేవనెత్తడం వెనుక కేంద్రంలో ఉన్న బీజేపీ పెద్దల దృష్టిని ఆకర్షించే వ్యూహం కూడా ఉండవచ్చు. పరిపాలనా లోపాలను ఎత్తిచూపడంతో అవినీతి రహిత, పారదర్శక పాలన అందిస్తామని కేంద్రానికి హామీ టీడీపీ ఇచ్చింది. రాష్ట్రంలో మొదటి పెద్ద రిక్రూట్‌మెంట్‌లోనే అక్రమాలకు పాల్పడిందనే ఇంప్రెషన్‌ను బీజేపీ హైకమాండ్ ముందు ఉంచాలని వైసీపీ భావిస్తుండవచ్చు. అందుకే మెగా డీఎస్సీని వదలకుండా పట్టుకుని బీజేపీ దృష్టిలో లోకేశ్ ను పలుచన చేస్తే ఆ ప్రభావం కూటమిపై పడుతుందని వైసీపీ అంచనా వేస్తున్నట్లు అనిపిస్తుంది. రాష్ట్ర దర్యాప్తు సంస్థలపై నమ్మకం లేదని, కేవలం సీబీఐ విచారణ ద్వారానే నిజాలు బయటపడతాయని జగన్ పదే పదే ట్వీట్లు మరియు ప్రెస్ మీట్ల ద్వారా ఒత్తిడి పెంచుతున్నారు. దీని ద్వారా కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య, ముఖ్యంగా టీడీపీ-బీజేపీ బంధంలో ఒక రకమైన ఇబ్బందికర వాతావరణాన్ని సృష్టించవచ్చునేది విపక్షాల అంతర్గత అంచనాగా కనిపిస్తోంది. గత వైసీపీ హయాంలో సరైన ఉద్యోగ నోటిఫికేషన్లు రాలేదనే అసంతృప్తి నిరుద్యోగుల్లో ఉందనే విమర్శలను కౌంటర్ చేయడానికి ఈ అంశం ఉపయోగపడుతుందని వైసీపీ భావిస్తోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం సాధించిన అతిపెద్ద విజయాల్లో ఒకటైన మెగా డీఎస్సీపై 'అక్రమాల మరక' వేయడం ద్వారా మైలేజ్ పొందాలని ప్రతిపక్షం భావిస్తోంది. నిరుద్యోగ యువతలో కూటమి ప్రభుత్వంపై నమ్మకాన్ని సడలించేలా ప్రచారం చేయడం కూడా ఇందులో భాగమే. వైసీపీ చేస్తున్న ఆరోపణలను అధికార టీడీపీ తీవ్రంగా ఖండిస్తోంది. ఇదంతా కేవలం "దుష్ప్రచార వ్యూహం" అని కొట్టిపారేస్తోంది. మరి బీజేపీ దృష్టిలో టీడీపీని పలుచన చేయాలన్న వైసీపీ వ్యూహం ఎంత మేరకు పలుచన చేస్తుందన్నది చూడాలి.

బాలినేని తగ్గని ప్రయారిటీ

ఒంగోలు : మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డికి పవన్ కీలక బాధ్యతలు అప్పగించారు. ఇది జనసేనలో చర్చనీయాంశమైంది. నిన్నమొన్నటి వరకూ బాలినేని శ్రీనివాసరెడ్డికి ప్రయారిటీ లేదని భావించిన వారి నోళ్లను పవన్ ఒక్క చర్యతో మూయించగలిగారు. స్థానిక సంస్థల ఎన్నికలు, డీ లిమిటేషన్ ప్రక్రియపై త్రీ మెన్ కమిటీలో స్థానం కల్పించారు. నిజానికి ఇటీవల పవన్ కల్యాణ్ అస్వస్థతకు గురయి కేరళలో ఆయుర్వేద చికిత్స చేయించుకోవడానికి వెళ్లిన సమయంలో ముఖ్యమైన సమావేశాలకు బాలినేని శ్రీనివాసరెడ్డి కి ఆహ్వానం అందలేదు. దీంతో జనసేనలో బాలినేని శ్రీనివాసరెడ్డికి ప్రయారిటీ తగ్గిందని అందరూ అనుకున్నారు. కొందరు ఆయన వ్యతిరేకులు గేలిచేశారు. మరికొందరు బాలినేని వైసీపీ కోవర్టు అంటూ ప్రచారాన్ని కూడా నిర్వహించారు. కానీ బాలినేని శ్రీనివాసరెడ్డి నిబద్ధత తెలిసిన పవన్ కల్యాణ్ ఆయనకు కీలక బాధ్యతలను అప్పగించడంతో ఆ ప్రచారానికి ఫుల్ స్టాప్ పడినట్లయింది. బాలినేని శ్రీనివాసరెడ్డిని ఉమ్మడి రాయలసీమ జిల్లాలతో పాటు ప్రకాశం, నెల్లూరు జిల్లాల బాధ్యతలను అప్పగించారు. సామినేని ఉదయ భానుకు, నాదెండ్ల మనోహర్ కు కృష్ణా, గుంటూరు జిల్లాల బాధ్యతను అప్పగించారు. దీంతో బాలినేని శ్రీనివాసరెడ్డికి ఏ మాత్రం ప్రాధాన్యత తగ్గలేదని చాటి చెప్పారు. బాలినేని శ్రీనివాసరెడ్డి వల్ల చేరికలు కూడా ఊపందుకుంటాయని పవన్ కల్యాణ్ భావిస్తున్నారు. రాయలసీమ ప్రాంతంలోనూ, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోనూ బలమైన నేతలను జనసేన పార్టీలోకి తీసుకు వచ్చేందుకు బాలినేని శ్రీనివాసరెడ్డి ఇప్పటికే కొందరితో టచ్ లో ఉన్నారు. రాయలసీమకు చెందిన ఒక వైసీపీ ముఖ్య నేత కూడా త్వరలో వస్తారని చెబుతున్నారు. అయితే ఆ నేత పేరు ఎవరన్నది బయటపెట్టకపోయినా త్వరలోనే ఆ నేత జనసేన తీర్థం పుచ్చుకుంటారని చెబుతున్నారు. పవన్ కల్యాణ్ అందుకే బాలినేనికి కీలక బాధ్యతలను అప్పగించారు. ఇప్పటి వరకూ తన చుట్టూ ఉన్న నేతలు ఎవరూ ఒక్క నేతను కూడా పార్టీలోకి తీసుకు వచ్చే ప్రయత్నంచేయలేదని పవన్ కల్యాణ్ గుర్తించినట్లు కనిపిస్తుంది. జనసేన ఎప్పుడూ ఇలాగే ఉంటే ఇక ఎదిగే అవకాశం లేదని భావించిన పవన్ కల్యాణ్ కొంత పార్టీలో దిద్దుబాటు చర్యలకు దిగారనిపిస్తోంది. వైసీపీ నుంచి వచ్చిన నేతలయినా అక్కున చేర్చుకుంటే వారు నమ్మకంగా ఉండటమే కాకుండా ఇతర నేతలను కూడా తీసుకు వస్తారని, కానీ తొలి నుంచి తన వెంటే నడుస్తున్నా, మరొక నేతను పార్టీలోకి తీసుకు రాకపోవడంపై పవన్ కు అనుమానం కలిగినట్లుంది.

అందుకే కొన్ని కీలక బాధ్యతలు బాలినేని శ్రీనివాసరెడ్డికి, సామినేని ఉదయభానుకు అప్పగించారు. ఇప్పటికే బాలినేని కొందరిని, సామినేని ఉదయభాను మరికొందరిని పార్టీలోకి తీసుకు వచ్చారు. దీంతో పవన్ కు మరింత నమ్మకం పెరిగింది. పార్టీ ఇంకా బలోపేతం కావాలంటే చేరికలు అవసరమని భావిస్తున్న పవన్ కల్యాణ్ తన ప్రయారిటీ ఇదీ అని ఇటు నేతలకు చెప్పకనే చెప్పారనిపిస్తుంది. మరి పవన్ కల్యాణ్ ఈ రకమైన చర్యలతోనైనా పార్టీ బలోపేతం అవుతుందా? లేదా? అన్నది చూడాలి.

మెగా బ్యాక్ స్టెప్...

కడప : ఆంధ్రప్రదేశ్ పునరుత్పాదక ఇంధన రంగంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. అన్నమయ్య జిల్లా కొమ్మూరు సమీపంలో ప్రముఖ మౌలిక వసతుల కల్పన సంస్థ మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్‌కు కేటాయించిన భారీ 2,000 మెగావాట్ల పంప్డ్ హైడ్రో స్టోరేజ్ పవర్ ప్రాజెక్ట్‌ను రద్దు చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. పర్యావరణపరమైన, భౌగోళికపరమైన అడ్డంకుల దృష్ట్యా ఈ ప్రాజెక్టును క్షేత్రస్థాయిలో చేపట్టడం సాధ్యం కాదని, అందువల్ల ప్రాజెక్ట్ కేటాయింపును రద్దు చేయాలని స్వయంగా మేఘా సంస్థే ప్రభుత్వానికి లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేయడంతో కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో 2022-2023 కాలంలో రాష్ట్రంలో భారీ ఎత్తున పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు చేశారు. పర్యావరణహిత హరిత ఇంధన నిల్వ విధానంలో భాగంగా అన్నమయ్య జిల్లా సంబేపల్లి పరిసర ప్రాంతాల్లోని కొమ్మూరు వద్ద 2 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంతో ఈ ప్రాజెక్ట్‌ను న్యూ , రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ద్వారా మేఘా సంస్థకు కేటాయించారు. భారీ ఎత్తున పెట్టుబడులు, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు వస్తాయనే ప్రచారంతో నాడు అనుమతులు వేగంగా మంజూరైనప్పటికీ.. ప్రాథమిక సర్వే దశలోనే అసలైన పర్యావరణ చిక్కులు తెరపైకి వచ్చాయి.ప్రాజెక్టు రద్దుకు గల ప్రధాన సాంకేతిక, పర్యావరణ కారణాలను పరిశీలిస్తే.. ప్రతిపాదిత కొమ్మూరు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్ అత్యంత సున్నితమైన పర్యావరణ పరిధిలోకి వస్తోంది. ఈ ప్రాజెక్ట్ కోసం గుర్తించిన ఎగువ, దిగువ జలాశయాలు , ప్రసార మార్గాలు నాగార్జునసాగర్-శ్రీశైలం టైగర్ రిజర్వ్ విస్తరణ ప్రాంతాలు, పరిసర అటవీ శ్రేణులు, శ్రీ లంకమల్లేశ్వర వన్యప్రాణి అభయారణ్యం పరిధిలోకి వస్తున్నట్లు క్షేత్రస్థాయి పరిశీలనలో తేలింది. కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ నిబంధనల ప్రకారం పులుల సంరక్షణ కేంద్రాలు, రక్షిత అటవీ ప్రాంతాల్లో ఇంతటి భారీ తవ్వకాలు, సొరంగాల నిర్మాణం, జల నిల్వలకు అనుమతులు లభించడం దాదాపు అసాధ్యం. తీవ్రమైన అటవీ, వన్యప్రాణి ఆంక్షల వల్ల ప్రాజెక్ట్ సాధ్యపడదని మేఘా సంస్థ నిర్ధారించుకుంది. జాతీయ వన్యప్రాణి బోర్డు నుంచి క్లియరెన్సులు సాధించడం సాధ్యం కాకపోవడం, చట్టపరమైన వివాదాలు తలెత్తే ముప్పు ఉండటంతో ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లలేమని మేఘా సంస్థ చేతులెత్తేసింది. ఈ మేరకు సంస్థ చేసిన అభ్యర్థనను క్షుణ్ణంగా పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం.. కేటాయింపులను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. కాగితాలపై ఎలాంటి క్షేత్రస్థాయి పర్యావరణ అధ్యయనాలు చేయకుండా గత ప్రభుత్వ హయాంలో గుడ్డిగా అనుమతులు ఇవ్వడం వల్లే ఇప్పుడు ప్రాజెక్టులు అర్ధాంతరంగా రద్దవుతున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

దాల్మియాకు భూ కేటాయింపులు

రాయలసీమ పారిశ్రామిక హబ్‌గా మారుతున్న వైఎస్సార్ కడప జిల్లాలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్రంలో పారిశ్రామిక రంగాన్ని పరుగులు పెట్టించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న కూటమి ప్రభుత్వం, కడప జిల్లాలో ప్రముఖ సిమెంట్ తయారీ సంస్థ 'దాల్మియా సిమెంట్స్' భారీ విస్తరణ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందులో భాగంగా పరిశ్రమ విస్తరణకు అవసరమైన 250 ఎకరాల భూమిని కేటాయిస్తూ ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. మైలవరం మండలం చిన్నకొమ్మర్ల గ్రామ పరిధిలో ఉన్న దాల్మియా సిమెంట్స్ ప్లాంట్ విస్తరణకు ఈ భూమిని కేటాయించారు. అయితే ఈ కేటాయింపుల్లో ప్రభుత్వం అత్యంత పారదర్శక విధానాన్ని అవలంబించింది. సాధారణంగా పరిశ్రమలకు ఇచ్చే రాయితీలు కాకుండా, వాస్తవ ఖరీదు ప్రాతిపదికన మాత్రమే ఈ 250 ఎకరాల భూమిని సంస్థకు బదిలీ చేయడం విశేషం. పారిశ్రామిక రంగానికి పెద్దపీట వేస్తూనే, ప్రభుత్వ ప్రయోజనాలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ఈ నిర్ణయం తీసుకున్నారు.

జాతీయ రాజకీయాల్లో జగన్ దారెటు?

హైదరాబాద్ : కేంద్ర ఎన్నికల కమిషనర్ల నియామకం, సవరణ చట్టంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సోషల్ మీడియాలో చేసిన ప్రకటన జాతీయ స్థాయిలో పెద్ద దుమారాన్నే రేపింది. పరీక్ష రాసే విద్యార్థే ఎగ్జామినర్‌ను నియమించుకున్నట్లుగా ప్రభుత్వమే సీఈసీని ఎంచుకోవడం ఏంటి " అని జగన్ లేవనెత్తిన ప్రశ్న సహేతుకమైనదే అయినప్పటికీ, దానికి ఆయన ఎంచుకున్న సమయం, గతంలో ఆయన పార్టీ తీసుకున్న పార్లమెంటరీ నిర్ణయాలు ఆయన రాజకీయ విధానాలను ప్రశ్నించేలా చేస్తున్నాయి. నిన్నటివరకు కేంద్ర చట్టాలకు సభలో మద్దతు పలికి, ఇప్పుడు విమర్శలకు దిగడంపై జాతీయ విపక్షాలు జగన్ మోహన్ రెడ్డిని ద్వంద్వ నీతి ప్రదర్శిస్తున్నారన్న విమర్శలకు కారణం అవుతున్నాయి. ముఖ్యంగా తృణమూల్ కాంగ్రెస్ ఫైర్‌బ్రాండ్ ఎంపీ మహువా మొయిత్రా సోషల్ మీడియా వేదికగా జగన్‌కు నేరుగానే ఘాటు కౌంటర్ ఇచ్చారు. వ్యవస్థలను ధ్వంసం చేసే వారికి ముందు పార్లమెంట్‌లో మద్దతు ఇవ్వడం ఆపండి.. ఆ తర్వాత గ్యాలరీ సమాధానాల కోసం మాట్లాడండి అంటూ ఆమె నేరుగా విమర్శలు గుప్పించారు. ఎన్నికల కమిషనర్ల నియామక ప్యానెల్ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తి ని తప్పిస్తూ కేంద్రం తీసుకువచ్చిన బిల్లుకు పార్లమెంట్‌లో వైఎస్సార్‌సీపీ మద్దతు పలికిన విషయాన్ని, కనీసం వాకౌట్ కూడా చేయకపోవడాన్ని ఈ సందర్భంగా జాతీయ నేతలు గుర్తు చేస్తున్నారు.వైఎస్ జగన్ రాజకీయ విధానంలో అనుసరిస్తున్న అంశాల వారీ మద్దతు వ్యూహమే ఆయనను డిఫెన్స్‌లో పడేస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు కేంద్రంలోని బీజేపీకి దాదాపు ప్రతి కీలక బిల్లు ఆర్టికల్ 370 రద్దు, త్రిపుల్ తలాక్, ఢిల్లీ సర్వీసెస్ బిల్లు, ఈసీ నియామక బిల్లు ముందస్తుగా మద్దతు పలికి, ఇప్పుడు ప్రతిపక్షంలోకి వచ్చాక అవే నిర్ణయాలను తప్పుపట్టడం వల్ల ఆయన రాజకీయ విశ్వసనీయత దెబ్బతింటోంది. జాతీయ స్థాయిలో ప్రతిపక్షాలు కూటమిగా ఏర్పడి బీజేపీ విధానాలను మొదటి నుంచీ సైద్ధాంతికంగా వ్యతిరేకిస్తుంటే, జగన్ మాత్రం సొంత రాష్ట్రాభివృద్ధి లేదా ఇతర సమీకరణాల పేరుతో కేంద్రానికి సహకరించారు. అయితే ఇప్పుడు ఏపీలో అధికారం కోల్పోయిన తర్వాత, ఎన్నికల కమిషన్ తీరుపై సొంతంగా అనుమానాలు వచ్చినప్పుడు మాత్రమే గళం విప్పడం వల్ల, జాతీయ విపక్షాలు ఆయనను సులభమైన రాజకీయ అవకాశవాది గా చూసే పరిస్థితి ఏర్పడింది. ఒక నిర్దిష్టమైన సిద్ధాంతం లేదా పొలిటికల్ ఐడియాలజీ లేకపోవడం వల్లనే ఆయన తీరుపై ఇలాంటి విమర్శలు వస్తున్నాయి.ప్రస్తుత పరిస్థితుల్లో జాతీయ స్థాయిలో కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, సమాజ్ వాదీ పార్టీ వంటివి జగన్ వైఖరిని ఎండగడుతున్నాయి.

ఘన సన్మాన కార్యక్రమం

బద్వేలు : బద్వేల్ మండల ప్రజా పరిషత్ సభ్యులు, జిల్లా ప్రజా పరిషత్ సభ్యులు సర్పంచుల పదవీకాలం పూర్తయిన సందర్భంగా, బద్వేల్ పట్టణంలోని నెల్లూరు రోడ్‌లో గల రాఘవేంద్ర గ్రాండ్ నందు ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి బద్వేల్ మున్సిపాలిటీ వైఎస్ఆర్సిపి పట్టణ అధ్యక్షులు సుందరరామిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా గౌరవ శాసన సభ్యురాలు శ్రీమతి డా. దాసరి సుధమ్మ , బద్వేల్ నియోజకవర్గ పరిశీలకులు,మాజీ ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లి మల్లికార్జున రెడ్డి , బద్వేల్ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథ రెడ్డి కూడా మాజీ చైర్మన్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కడప అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులు సింగసాని గురుమోహన్ , బద్వేల్ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ గోపాలస్వామి ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా సింగసాని శివయ్య , బద్వేల్ కౌన్సిలర్లు బి.రమణ , ఆవుల శ్రీనివాసులు , రజిని ,. రామచంద్ర రెడ్డి , మన్యం సాంబశివ రెడ్డి శివ కోటి రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు ఇటీవల పదవీ విరమణ పొందిన సర్పంచులకు, ఎంపీటీసీ సభ్యులకు, జడ్పీటీసి సభ్యులకు సభాముఖంగా అభినందనలు తెలియజేయడం జరిగినది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అధ్యక్షులు వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి , కడప పార్లమెంట్ సభ్యులు వై.ఎస్. అవినాష్ రెడ్డి ఆదేశాల మేరకు, పార్టీ సూచించిన ప్రతి అభ్యర్థి విజయానికి ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేస్తూ, జగనన్నను తిరిగి ముఖ్యమంత్రిగా చేసే వరకు అవిశ్రాంతంగా పోరాడాలని నాయకులు పేర్కొన్నారు. అనంతరం ఇటీవల పదవీకాలం పూర్తి చేసుకున్న జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు సర్పంచులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ అభిమానులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థుల భవితకు బాసటగా ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గ్ : భావి భారత పౌరుల చదువుల ప్రయాణానికి రెక్కలు తొడుగుతూ, కళ్యాణదుర్గం శాసనసభ్యులు అమిలినేని సురేంద్ర బాబు చేపట్టిన సేవా సంకల్పం పట్టణ ప్రజల మనసులను దోచుకుంది. స్థానిక కరణం చిక్కప్ప ప్రభుత్వ పాఠశాల మైదానంలో ఘనంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని దాదాపు 1500 మంది నిరుపేద విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు. పాఠశాలలకు వెళ్లేందుకు రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడే గ్రామీణ, పేద విద్యార్థులకు ఈ సైకిళ్లు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన ఆకాంక్షించారు.

హెచ్ఎన్ఎస్ఎస్ పనులకు రూ.337.90 కోట్లు మంజూరు

సవరించిన పరిపాలనా అనుమతులు జారీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

అమరావతి :హంద్రీ-నీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) ప్రాజెక్టు ఫేజ్-2 పనులకు ప్రభుత్వం సవరించిన పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పరిధిలోని ప్రధాన కాలువ లైనింగ్, సొరంగం పనుల కోసం మొత్తం రూ.337.90 కోట్లు కేటాయిస్తూ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్ ఉత్తర్వులు (జీవో ఆర్‌టీ నెం. 554) జారీ చేశారు.గతంలో ఈ ప్యాకేజీ-2 పరిధిలోని పనులకు రూ.158.19 కోట్లతో పరిపాలనా ఆమోదం లభించింది. ఇందులో కి.మీ. 260 నుంచి 280 వరకు కాలువ లైనింగ్‌కు రూ.64.20 కోట్లు, కి.మీ. 280 నుంచి 300 వరకు లైనింగ్ పనులకు రూ.57.80 కోట్లు, కి.మీ. 285.100 నుంచి 287.100 మధ్య సొరంగం పనులకు రూ.36.19 కోట్లు కేటాయించారు.అయితే, క్షేత్రస్థాయి అవసరాలు, ధరల సర్దుబాటు తదితర అంశాల నేపథ్యంలో ఇంజనీర్ ఇన్ చీఫ్ రూ.339.50 కోట్లతో సవరించిన అంచనాలను ప్రభుత్వానికి సమర్పించారు. ఆ ప్రతిపాదనలను సమగ్రంగా పరిశీలించిన ప్రభుత్వం రూ.337.90 కోట్లకు ఆమోదం తెలిపింది. పనుల నాణ్యత, నిబంధనలు, రేట్లలో ఎలాంటి లోపాలు లేకుండా చూసుకోవాలని అనంతపురం ప్రాజెక్ట్ చీఫ్ ఇంజనీర్‌ను ఆదేశించింది.

రద్దు చేసిన చట్టాన్ని ఇప్పుడు వాడుతున్నారు

హైదరాబాద్:పార్లమెంట్ రద్దు చేసిన బ్రిటిష్ యాక్ట్-1922తో రేవంత్ రెడ్డి ప్రభుత్వం మా మీద కేసులు నమోదు చేస్తుందని బీఆర్ఎస్ నేత క్రిశాంక్ అన్నారు. నా ఇంటి తాళాలు పగలగొట్టి, కుటుంబసభ్యులను భయభ్రాంతులకు గురి చేసి, నా కూతురును పరీక్ష రాయడానికి వెళ్లనివ్వకుండా 50 మంది పోలీసులు హల్చల్ చేశారు.రద్దు చేసిన బ్రిటిష్ చట్టాన్ని ఇప్పుడు వాడడంఅంటే లా అండ్ ఆర్డర్ ఫెయిల్ అయినట్లే నని అన్నారు. రూ.650 కోట్ల కుంభకోణంలో మంత్రి పొంగులేటి ఇంటిపై ఈడీ రైడ్స్ చేసి రెండేళ్లు అయినా ఎందుకు చర్యలు తీసుకోలేదు.. దీని మీద రేవంత్ ప్రభుత్వం సమాధానం చెప్పాలి కదా అని అన్నారు.

ప్రతి పంచాయతీలో వైసిపి జెండా ఎగురవేస్తాం

చిట్వేలి : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మొదటి నుండి పనిచేస్తున్న నిజమైన కార్యకర్తలకు నాయకులకు, రాబోయే స్థానిక సంస్థలు ఎన్నికల్లో ప్రతి ఒక్కరికి అవకాశం కల్పిస్తామని రైల్వేకోడూరు మాజీ శాసనసభ్యులు, వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. రైల్వే కోడూరు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కోడూరు మండల విస్తృత స్థాయి సమావేశంలో కార్యకర్తలు నాయకులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హాయంలో మనం చేసిన అభివృద్ధి పనులను గుర్తు చేస్తూ ప్రజల దగ్గరకి వెళ్లి ఓటు అడిగే హక్కు మనకు ఉందని, ప్రతి ఒక్కరూ ఐక్యమత్యంగా కలిసికట్టుగా ముందుకు వెళ్లి ప్రతి ఒక్క అభ్యర్థి గెలుపు కోసం కృషిచేసి గెలిపించుకొని, 2029లో కూడా వైయస్ జగన్మోహన్ రెడ్డి గారిని ముఖ్యమంత్రిగా చేసుకొని కోడూరు గడ్డ వైఎసిపి అడ్డాగా మరొక్కసారి నిరూపించుకుందామని అన్నారు. కూటమి నాయకులు గ్రామాల్లోకి వెళితే వాళ్లని తరిమి కొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, ఏవైనా సూచనలు సలహాలు ఉంటే మాకు తెలియజేస్తే అందరం కూర్చుని సమిష్టిగా మాట్లాడుకొని ముందుకు వెళదామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పంజం వేణుగోపాల్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సిహెచ్. రమేష్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మండల నాగేంద్ర, జిల్లా కో ఆప్షన్ సభ్యులు అన్వర్ భాష, జడ్పీటిసి రత్నమ్మ, ఎక్స్ ఎంపీపీ కనుపర్తి ఈశ్వరయ్య, మాజీ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గునిశెట్టి రమేష్, ముస్లిం మైనార్టీ స్టేట్ సెక్రటరీ ముజీబ్, రాఘవరాజు పురం మాజీ శివాలయం చైర్మన్ రవిచంద్ర రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ సుబ్బరామ రాజు, జిల్లా యూత్ సెక్రటరీ దమ్ము రఘు, జిల్లా యూత్ జనరల్ సెక్రటరీ రాజా పాల్గొన్నారు.

వ్యవసాయ భూములను కబ్జాదారుల నుంచి కాపాడండి

- కొంగర కుర్దు గ్రామ రైతుల విజ్ఞప్తి

సోమాజిగూడ : నకిలీ దస్తావేజులు సృష్టించి వ్యవసాయ భూములను రైతుల నుంచి బలవంతంగా లాక్కుంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకొని పచ్చని పొలాలను పరిరక్షించాలని కొంగర కుర్దు గ్రామ రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైతులు భూపాల్ రెడ్డి, పన్నాల యాది రెడ్డి, సమ్మి రెడ్డి కృష్ణా రెడ్డిలు మాట్లాడారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం కొంగర కుర్దు గ్రామంలోని 32 సర్వే నెంబర్ల పరిధిలో గల వ్యవసాయ భూములను గత 35 సంవత్సరాలుగా తాము వ్యవసాయం చేసుకుంటున్నట్లు తెలిపారు. కాగా గత రెండు నెలలుగా కొందరు భూ కబ్జాదారులు బినామీ పేర్లతో నకిలీ ఓ ఆర్ సి లను సృష్టించి కబ్జాకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ఈ విషయంపై రంగారెడ్డి జిల్లా కలెక్టర్, కందుకూరు ఆర్డీవో, మహేశ్వరం ఎమ్మార్వోకు ఫిర్యాదు చేసినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందని వాపోయారు. కబ్జాదారులతో స్థానిక రెవెన్యూ అధికారులు, పోలీసులు, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు కుమ్మక్కై పచ్చని పొలాలను కబ్జాదారుల హస్తగతం చేస్తున్నారని ఆరోపించారు. అధికారుల అండదండలతో రాత్రికి రాత్రే వ్యవసాయ పొలాల్లోకి అక్రమంగా చొరబడుతున్న కబ్జాదారులు పొలాలను నాశనం చేస్తున్నారని తెలిపారు.

మూడో ఉపఎన్నిక తప్పదా?

హైదరాబాద్: తెలంగాణలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలలో తొలి వికెట్ కింద ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మీద అనర్హత వేటు పడింది. దీంతో దీని ఉప ఎన్నిక ఎప్పుడు ప్రకటిస్తారో అన్న ఉత్కంఠ నెలకొన్నది. నిబంధనల ప్రకారం ఖాళీ అయిన ఆరు నెలల్లోగా ఎన్నికలు నిర్వహించాలి. ఈ లెక్కన 2027 మార్చి లేదా ఏప్రిల్ నెలల్లో ఉప ఎన్నికలు జరగవచ్చని భావిస్తున్నారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో స్పీకర్ ఖైరతాబాద్ సీటు ఖాళీ అయిందని ఎన్నికల సంఘానికి త్వరలో సమాచారం అందించనున్నారు. ఆ తర్వాత ఎన్నికల కమిషన్ ఉప ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తుందని తెలుస్తోంది! ఈ ఏడాది డిసెంబరులో గుజరాత్, వచ్చే ఏడాది ఫిబ్రవరి లేదా మార్చిలో గోవా, మణిపూర్, పంజాబ్, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గుజరాత్ ఎన్నికలతో పాటు, లేదా మిగతా రాష్ట్రాల ఎన్నికలతో పాటు ఖైరతాబాద్ ఎన్నిక నిర్వహిస్తారని భావిస్తున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సికింద్రాబాద్ కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత మరణంతో జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి శ్రీ గణేష్ విజయం సాధించారు. ఆ తర్వాత జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం సాధించాడు. ఇప్పుడు పార్టీ ఫిరాయింపుల నేపథ్యంలో ఖైరతాబాద్ ఉప ఎన్నిక రావడంతో ఎవరు గెలుస్తారు అన్న ఉత్కంఠ మొదలైంది. సుప్రీం తీర్పు నేపథ్యంలో ఎన్నికలకు సిద్ధం అని అనర్హత వేటు పడిన దానం నాగేందర్ ప్రకటించారు.

ఎన్నికలు నాకు కొత్త కాదు. ఖైరతాబాద్ నా కోట. ప్రజల మద్దతు ఉంది అని దానం అంటున్నారు. అనర్హత వేటు పడిన స్థానం, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మూడేళ్ల తర్వాత వస్తున్న ఎన్నిక కాబట్టి బీఆర్ఎస్ ఈ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. 2028 ఎన్నికల్లో వచ్చేది తమ ప్రభుత్వమేనని అంటున్న బీజేపీ కూడా దీనిని ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. ఉప ఎన్నికల షెడ్యూల్ వెలువడితే తప్ప అభ్యర్థులు ఎవరు అన్నది తేలుతుంది.

పాడిపై వేటు తప్పదా?



హైదరాబాద్ : పాడి కౌశిక్‌రెడ్డిపై అసెంబ్లీ ద్వారానే అనర్హత వేటు వేయించే యోచనలో కాంగ్రెస్ పార్టీ ఉందని బీఆర్ఎస్ నాయకులు బహిరంగ వ్యాఖ్యలే చేస్తున్నారు. ఇదే జరిగితే.. ఖైరతాబాద్‌తో పాటు హుజూరాబాద్కు కూడా ఒకే సారి ఉప ఎన్నిక వచ్చే అవకాశం ఉందని అంచనా అంటున్నారు. అయితే.. దీనిని కాంగ్రెస్ పార్టీ కక్షపూరిత చర్య అని బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు. కాదు.. సభను అగౌరవపరిచిన వారిపై చర్యలు తీసుకుంటున్నామని కాంగ్రెస్ చెబుతోంది. మొత్తంగా ఇప్పుడు పాడి చుట్టూ రాజకీయం మరోసారి రాజుకుంది. ఏడాది బడ్జెట్ సమావేశాల సమయంలో పాడి కౌశిక్ రెడ్డి సభలో తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా బీఆర్ ఎస్ నుంచి గెలిచి.. కాంగ్రెస్‌కు మద్దతుగా మారిన మాజీ మంత్రి కడియం శ్రీహరి ప్రసంగిస్తున్న సమయంలో ఆయనను అడ్డుకోవడంతోపాటు.. "నువ్వు" అని ఏకవచనంతో సంబోధించారు. అంతేకాదు.. దుర్భాషలాడారన్నది కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణ. అంతేకాదు.. తనను కాల్చేస్తానని కౌశిక్ రెడ్డి బెదిరించినట్టు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన కడియం ఆరోపిస్తున్నారు. దీంతో వ్యవహారం ముదిరిపోయి.. అసెంబ్లీ ఎథిక్స్ కమిటీకి ఈ విషయాన్ని రిఫర్ చేశారు. ప్రస్తుతం ఈ కమిటీ తీవ్రంగా శోధిస్తోంది. పాడిపై వచ్చిన ఆరోపణలు, ఆయన హావభావాలను వీడియోల రూపంలో కూడా పరిశీలన చేస్తోంది. కాగా.. ఇంతలోనే దానం వ్యవహారం ఒక కొలిక్కి వచ్చింది. దీంతో ఇప్పుడు పాడి విషయం మరింత సీరియస్ అయింది. ఎథిక్స్ కమిటీ తీసుకునే నిర్ణయం అత్యంత ముఖ్యంగా మారడంతో పాడిపై వేటు వేయించడమో.. లేక రాజీనామాకు సిఫారసు చేయడమో ఖాయమని అంటున్నారు ఎథిక్స్ కమిటీ అనేది రాజ్యాంగ బద్ధమైన కమిటీ కావడం, దీనికి స్పీకర్ అనుమతి ఉండడంతో ఈ కమిటీ నిర్ణయాన్నికోర్టుల్లో సవాల్ చేసేందుకు అవకాశం లేదని అంటున్నారు. పాడి అనర్హుడు కావడమో.. రాజీనామా చేయడమో తప్పదు. దీంతో హుజూరాబాద్‌కు కూడా ఉప ఎన్నిక తీసుకురావాలన్నది కాంగ్రెస్ ప్లాన్‌గా చెబుతున్నారు. దీనిని అడ్డుకునేందుకు బీఆర్ ఎస్ నాయకులు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా.. తను వివరణ ఇచ్చేందుకు ఆరు వారాలు గడువు ఇవ్వాలంటూ..పాడి కోరి మూడు వారాలైంది. దీంతో మరో రెండు వారాల్లోనే ఆయనపై నిర్ణయం వెలువడే అవకాశం ఉందని తెలుస్తోంది

భార్యను రోకలి బండతో కొట్టి హత్య

హైదరాబాద్ : హైదరాబాద్లోని చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధి (బాగ్లింగంపల్లి)లో దారుణం చోటుచేసుకుంది. తీవ్ర కుటుంబ కలహాల కారణంగా భార్యను భర్త రోకలి బండతో బాది దారుణంగా హతమార్చాడు. మృతురాలు తేజస్వి (28) భర్త ,కుప్పల నరేందర్ ఆర్టీసీ క్రాస్రోడ్స్‌లోని ఒక హోటల్ పని చేస్తున్నాడు. ఈ దంపతులు సుమారు 4 నెలల క్రితమే బాగ్లింగంపల్లికి వచ్చారు. వీరికి 5 ఏళ్ల కుమారుడు (లోహిత్) ఉన్నాడు. ఉదయం దంపతుల మధ్య కుటుంబ విషయమై తీవ్ర వాగ్వాదం జరిగింది. ఆవేశంతో రగిలిపోయిన నరేందర్.. ఇంట్లోని రోకలి బండతో భార్య తలపై బలంగా బాదాడు. తలకు తీవ్ర గాయమై రక్తస్రావం కావడంతో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. సమాచారం అందుకున్న చిక్కడపల్లి ఇన్స్పెక్టర్ ఎల్. మధుబాబు బృందం ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేశారు.

రీ చార్జీలకు 30 రోజుల వ్యాలిడిటీ

- ఏడాదికి 13 నుంచి 12 రీఛార్జ్‌లకు తగ్గింపు

హైదరాబాద్ : మొబైల్ ప్రీపెయిడ్ వినియోగదారులకు ట్రాయ్ గుడ్ న్యూస్ చెప్పింది. 30 రోజుల వ్యాలిడిటీతో రీఛార్జ్ ప్లాన్లు, అలాగే వాయిస్, మెసేజ్ మాత్రమే ఉండే ప్లాన్లు అందుబాటులోకి తీసుకురావాలని టెలికాం కంపెనీలను ట్రాయ్ ఆదేశించింది. టెలికాం వినియోగదారుల సెక్యూరిటీ (13వ సవరణ) నిబంధనలు, 2026ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ఎంపీ రాఘవ్ చద్దా వెల్లడించారు. ఈ కొత్త నిబంధనల ద్వారా వినియోగదారులకు ఎంతో లబ్ధి చేకూరుతుందని ఆయన తెలిపారు. గతంలో నెలవారీ రీఛార్జ్ పేరుతో వినియోగదా రులు ఏడాదికి 13 సార్లు రీఛార్జ్ చేసుకోవాల్సిన పరిస్థితి ఉండేదని, ఇకపై ఆ సమస్య ఉండదని రాఘవ్ చద్దా తెలిపారు. ట్రాయ్ కొత్త నిబంధనలతో 30 రోజుల రీఛార్జ్ ప్లాన్‌లు అందుబాటులోకి రావడంతో, ఇకపై వినియోగదారులు సంవత్సరానికి 13 సార్లు కాకుండా కేవలం 12 సార్లు మాత్రమే రీఛార్జ్ చేసుకోవచ్చని స్పష్టం చేశారు. ఇంటర్నెట్ లేదా డేటా అవసరం లేకుండా కేవలం కాల్స్ మాత్రమే కోరుకునే కస్టమర్ల కోసం ప్రత్యేకంగా వాయిస్ ఓన్లీ ప్లాన్‌లను ప్రవేశపెట్టాలని ట్రాయ్‌ని కోరినట్లు ఆయన తెలిపారు. ఈప్లాన్లలోఇన్‌కమింగ్ అవుట్‌గోయింగ్ సేవలు రెండూ అందుబాటులో ఉంటాయని, ముఖ్యంగా సీనియర్ సిటిజన్లకు, బడ్జెట్‌లో ఉండే మొబైల్ యూజర్లకు ఇవిఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. పరిమితమైన రీఛార్జ్ ఎంపికలపై ప్రజల నుంచివచ్చిన ఆందోళనలనుతానుమార్చి 11న పార్లమెంట్‌లో లేవనెత్తానని రాఘవ్ చద్దాతెలిపారు. ప్రజల డిమాండ్లను నెరవేర్చిన కేంద్ర ప్రభుత్వానికి,ట్రాయ్‌కి ఆయన కృతజ్ఞతలుతెలిపారు. ప్రజాసమస్యలను పరిష్కరించడంలో నిర్మాణాత్మక రాజకీయాలకు ఇదొక గొప్ప నిదర్శనమని ఆయన అన్నారు.

విద్యుత్ ఉద్యోగిపై కర్రతో దాడి

సరూర్ నగర్ : విద్యుత్ వినియోగదారుడు, విద్యుత్ ఉద్యోగిపై దాడి చేసిన ఘటన సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరి గింది. వివరాల్లోకి వెళితే ..సరూర్ నగర్ పోచమ్మబాగు చెందిన శివ నివా సంలో ఓ ఫేజ్ కరెంటు రాకపోవ డంతో ఆదివారం ఉదయం సంబం ధిత అధికారులకు ఫిర్యా దు చేశాడు. అదే సమయంలో విద్యుత్ అధికా రులు మరో పనులపై ఉన్న నేప థ్యంలో వీరి ఇంటి కరెంటు సరఫ రాను పునరుద్ధరించడంలో ఆలస్యం జరిగింది. దీంతో సదరు వినియోగదా రుడు ఫోన్ చేసి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదనే కోపంతో సరూర గర్ విద్యుత్ ఏఈ కార్యాలయానికి చేరుకుని ఆపరేటర్ శివ వాగ్వాదా నికి దిగాడు. ఈ సమాచారం అందు కున్న ఏఈతో పాటుగా గ్రీన్పార్కు కాలనీకి చెందిన విద్యుత్ ఉద్యోగి రాజి రెడ్డి సరూర్ నగర్ సెక్షన్ కార్యాలయా నికి చేరుకున్నారు. సమస్య ఏంటని ప్రశ్నిస్తున్న క్రమంలోనే వినియోగదా రుడు శివ తీవ్రమైన పదజాలంతో రాజిరెడ్డిని దూషించడంతో పాటు తీవ్ర ఆగ్రహానికి గురై ఓ కర్రతో రాజి రెడ్డిపై దాడి చేశాడు. దీంతో తీవ్ర గాయాలకు గురైన రాజిరెడ్డి సరూర్న గర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సరూర్ నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్ మాదిరి.. రేవంత్



హైదరాబాద్ : తెలంగాణలో త్వరలో జరగనున్న ఖైరతాబాద్ అసెంబ్లీ ఉపఎన్నిక కేవలం ఒక సాధారణ నియోజకవర్గ పోరుగానే కాకుండా, రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత ప్రభావం చూపే హై-వోల్టేజ్ ఫైట్ గా మారుతోంది. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వానికి, ఆయన వ్యూహాత్మక ఎత్తుగడలకు ఈ ఎన్నిక ఒక పెద్ద సవాల్‌గా నిలవనుంది. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలో దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర రెడ్డి ఎదుర్కొన్న రాజకీయ సవాళ్లను, నేటి రేవంత్ రెడ్డి రాజకీయ శైలితో బేరీజు వేస్తూ విశ్లేషకులు ఈ ఉపఎన్నికను అత్యంత ప్రతిష్టాత్మకంగా చూస్తున్నారు. ఒకప్పుడు వై.ఎస్.రాజశేఖర రెడ్డి హయాంలో ఇదే తరహా రాజకీయ పరిణామాలు తలెత్తాయి. అప్పుడు దానం నాగేందర్ టీడీపీని వీడి కాంగ్రెస్‌లో చేరి ఆసిఫ్ నగర్ ఉపఎన్నిక బరిలో నిలిచారు. అయితే ఆ ఎన్నికల్లో దానం నాగేందర్ ఓడిపోయారు. అప్పట్లో వైఎస్సార్ ఆ ఎన్నికను వ్యక్తిగతంగా తీసుకోలేదని, అందుకే ఓడిపోయారని చెప్పుకునే వారు. అయితే ఇప్పుడు తెలంగాణ రాజకీయ వాతావరణం పూర్తిగా భిన్నంగా ఉంది. ముఖ్యమంత్రి పీఠంపై ఉన్న రేవంత్ రెడ్డి ప్రతి చిన్న పరిణామాన్ని అత్యంత సూక్ష్మంగా పరిశీలిస్తూ వ్యూహాత్మక అడుగులు వేస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ గూటికి చేరిన దానం నాగేందర్ ఎదుర్కొంటున్న ప్రస్తుత రాజకీయ పరిణామాలు, భవిష్యత్ ఎన్నికల దిశను నిర్దేశించడంలో కీలక పాత్ర పోషించనున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడనప్పటికీ, అధికార పార్టీ తరఫున ఆయనే బరిలో నిలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఖైరతాబాద్ గడ్డపై త్రిముఖ పోరు అనివార్యంగా కనిపిస్తోంది. అధికార కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్ష పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీ ఈ ఉపఎన్నికను తమ సత్తా చాటుకునేందుకు సరైన వేదికగా భావిస్తున్నాయి. 2028 అసెంబ్లీ సాధారణ ఎన్నికలకు ముందు ప్రజల నాడి ఎలా ఉందో తెలుసుకోవడానికి ఈ ఉపఎన్నిక ఒక లిట్మస్ టెస్ట్ లాంటిదని అన్ని పార్టీలు నమ్ముతున్నాయి. ఒకవైపు అధికార పార్టీగా సంక్షేమ పథకాలు, పాలనాపరమైన విజయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కాంగ్రెస్ భావిస్తుండగా, మరోవైపు క్షేత్ర స్థాయిలో తమ పట్టును నిరూపించుకోవడానికి ప్రతిపక్షాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. సుప్రీంకోర్టు తీర్పుల నేపథ్యంలో నియోజకవర్గంలో తనకంటూ ఒక ప్రత్యేకమైన స్థానం ఉందనే ధీమాతో ఉన్న దానం, ప్రత్యర్థుల వ్యూహాలను ఎదుర్కొనేందుకు సరికొత్త ప్రణాళికలు రచిస్తున్నారు. నియోజకవర్గంలో ఎన్నికల ప్రచార సరళి, పోలీసులు, స్థానిక ప్రజల స్పందన అన్నీ కూడా రాజకీయంగా ఉత్కంఠను రేకెత్తిస్తున్నాయి. ఈ ఉపఎన్నిక కేవలం దానం నాగేందర్ రాజకీయ భవిష్యత్తును మాత్రమే కాదు, ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి నాయకత్వ పటిమను కూడా పరీక్షించనుంది. గతంలో వైఎస్సార్ ఎదుర్కొన్న రాజకీయ అడ్డంకులను అధిగమించి, ఈసారి రేవంత్ రెడ్డి సరికొత్త చరిత్రను తిరగరాస్తారా లేదా అనేది ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమైంది. స్వయంగా సీఎం రంగంలోకి దిగి ప్రచార వ్యూహాలను పర్యవేక్షించే అవకాశం ఉండటంతో, కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో కాస్త కాన్ఫిడెన్స్ కనిపిస్తోంది.

పడిపోతున్న భూగర్భ జలమట్టాలు

హైదరాబాద్ : లోటు వర్షపాతం, అధిక ఉష్ణోగ్రతల కారణంగా రాష్ట్రంలో భూగర్భ జలమట్టాలు నానాటికీ పడిపోతున్నాయి. చెరువులు, కుంటలు సైతం ఈసారి వానాకాలంలో నిండలేదు. గోదావరి, కృష్ణా బేసిన్లలోని జలాశయాల్లో నీటినిల్వలు తగ్గిపోవడంతో నీటి కొరత ఏర్పడుతుందేమోనన్న ఆందోళన పెరుగుతోంది. ఉమ్మడి జిల్లాలవారీగా చూస్తే.. రంగారెడ్డి, మెదక్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఇప్పటికే తాగునీటి ఎద్దడి కనిపిస్తోంది. ఉమ్మడి రంగారెడ్డిలో 50 శాతం గ్రామాలకు తాగునీటి సరఫరా సరిగా లేదు. మునిసిపాలిటీలతోపాటు గ్రామాల్లో కూడా బోర్లు అడుగంటుతున్నాయి. మిషన్ భగీరథ నీరు కూడా సక్రమంగా అందటంలేదు. నగర శివార్లలో కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో వర్షాలు పడక పోవటంతో చెరువులు, కుంటల్లోకి నీరు రాలేదు. అక్టోబరు, నవంబరు నెలల్లో ట్యాంకర్లపై ఆధారపడాల్సి వస్తుందని అధికారులే స్వయంగా చెబుతున్నారు. భూగర్భ జలాలు పడిపోవటంతో.. 1,000 అడుగుల నుంచి 1,500 అడుగుల వరకు బోర్లు వేస్తున్నప్పటికీ నీరు రాని పరిస్థితి నెలకొంది. మెదక్ ఉమ్మడి జిల్లాలో కొరత కారణంగా తాగునీటి సరఫరా తగ్గింది. ఉదాహరణకు... సదాశివపేట పట్టణానికి రోజూ 80 లక్షల లీటర్ల నీళ్లు అవసరంకాగా.. ప్రస్తుతం 50 లక్షల లీటర్ల నీరే సరఫరా చేస్తున్నారు. అదీ రెండు రోజులకోసారి వదులుతున్నారు. ఆదిలాబాద్ జిల్లా నుంచి గోదావరి నది పారుతున్నప్పటికీ.. ఎగువ ప్రాంతంలో నీటి లభ్యత, ప్రవాహం ఎక్కువగా లేదు. మిషన్ భగీరథ మోటార్ల మరమ్మతులు, లీకేజీలతో తాగునీటి సరఫరాకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఆదిలాబాద్ పట్టణానికి ఫిబ్రవరి, మార్చి నెలలకు తాగునీటి లభ్యత కనిపించట్లేదు. ఇక.. వరంగల్, నల్లగొండ, మహబూబ్‌నగర్, హైదరాబాద్, నిజామాబాద్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల్లోప్రస్తుతానికి తాగునీటి కటకటలేదని గ్రామీణ తాగునీటి సరఫరా అధికారులు చెబుతున్నారు.

ప్రత్యామ్నాయాలపై.. రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో సుమారు 56 శాతం గోదావరి బేసిన్, 43 శాతం కృష్ణా బేసిన్‌లో ఉంది. నదుల ప్రవాహం ప్రధానంగా జూన్ నుంచి సెప్టెంబరు వరకూ ఉండే నైరుతి రుతుపవనాలపైనే ఆధారపడి ఉంటుంది. కానీ, తీవ్ర ఎల్‌నినో కారణంగా నైరుతి అనుకూలించక వర్షాలు సరిగా పడలేదు. సెప్టెంబరు 30తో వర్షాకాలం సీజన్ ముగిసిపోతోంది. దీంతో, ఈ సీజన్‌లో సాధారణంతో పోలిస్తే లోటు వర్షపాతం ఏర్పడింది. పంటలు గట్టెక్కుతాయా? లేదా? అనే ఆందోళన నెలకొంది. అయితే సాగునీటి కన్నా తాగునీటికే అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, వచ్చే వేసవి పూర్తయ్యేవరకూ తాగునీటి ప్రణాళిక రూపొందించి ప్రజలకు ఎలాంటిఇబ్బందీ లేకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. దీంతో గ్రామీణ తాగునీటి సరఫరా శాఖతోపాటు మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు ప్రత్యామ్నాయ తాగునీటి ప్రణాళికలు రూపొందించాయి.

ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ను ప్రారంభించిన మంత్రి పొన్నం

హైదరాబాద్ : మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం ఉదయం ముషీరాబాద్ లో పర్యటించారు. ముందుగా బాగ్ లింగంపల్లి లో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ను ప్రారంభించారు. ఇందిరా మహిళా శక్తి ద్వారా నిర్వహించే స్ట్రీట్ వెండర్స్ కి సంబంధించిన ఎగ్స్ షాప్ ప్రారంభించారు. మహిళా సంఘాలకు 1.20 కోట్ల రూపాయల సున్నా వడ్డీ రుణాలు చెక్కు అందించారు. విద్యార్థులకు స్కూల్ యూనిఫారం అందించారు. ముషీరాబాద్ లోని బాగ్ లింగంపల్లి వార్డ్ 163 వద్ద 1.5 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో రూచిఅ డ్రెయిన్ సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, జిహెచ్ఎంసీ మున్సిపల్ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ,ఇతర ముఖ్య నేతలు అధికారులు పాల్గొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడెఉతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచనలకు అనుగుణంగా ఇందిరమ్మ క్యాంటీన్లను మహిళా స్వయం సహాయక సంఘాలకు అప్పగిస్తూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతోందని అన్నారు. హైదరాబాద్ నగరంలో ప్రతిరోజూ కష్టపడి పనిచేసుకుంటూ జీవనం సాగించే పేద, సామాన్య ప్రజలకు కేవలం రూ.5కే నాణ్యమైన భోజనం అందించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నాం. మహిళా సాధికారత దిశగా ప్రభుత్వం మహిళలకు ఆర్థిక వృద్ధి సాధించడానికి వారి చేత ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ లను ఏర్పాటు చేస్తుంది ప్రభుత్వం తరఫున అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తూ శాశ్వత నిర్మాణాలతో, అన్ని సౌకర్యాలతో క్యాంటీన్లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం సమీపంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభించడం సంతోషంగా ఉంది. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించాలన్నదే తెలంగాణ ప్రభుత్వం లక్ష్యం. గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాల్లోని మహిళలు కూడా పెద్ద సంఖ్యలో స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా చేరాలని కోరుతున్నాను.



కల్వకోల్ గ్రామంలో చేయూత పింఛన్ల వెరిఫికేషన్ చేసిన మండల అభివృద్ధి అధికారి శారదమ్మ గ్రామ సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ

మహేశ్వరం, సెప్టెంబర్ 29 (ప్రజా కలం):

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం కల్వకోల్ గ్రామంలో చేయూత పింఛన్ లబ్ధిదారుల వెరిఫికేషన్ కార్యక్రమం నిర్వహించారు.మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) శారద, గ్రామ సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ కలిసి లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి అర్హత గల వారికి సంబంధించి వెరిఫికేషన్ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న పింఛన్ పథకం అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనర్హులు ఎవరైనా ఉంటే తొలగించి, కొత్తగా అర్హులైన వారిని గుర్తించేందుకే ఈ తనిఖీలు చేపడుతున్నట్లు ఎంపీడీవో తెలిపారు.ఈ కార్యక్రమంలో విలేజ్ సెక్రటరీ వేణు, ఉప సర్పంచ్ జనార్దన్ గౌడ్, గ్రామ పెద్దలు బక్కని రవి మాదిగ, కొండని శేఖర్, బొజ్జం శ్రీనివాస్, గుర్రంపల్లి మహేందర్, అనిల్, కృష్ణ, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్ తీరుకు వ్యతిరేకంగా నేడు హైదరాబాద్‌లో అఖిలపక్ష మహా ధర్నా

టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు నీరుడి స్వామి

గజ్వేల్:29 సెప్టెంబర్ 2026 (ప్రజా కలం ప్రతినిధి)

ఎన్నికల కమిషన్ తీరుకు వ్యతిరేకంగా సెప్టెంబర్ 30న హైదరాబాద్‌లో అఖిలపక్ష మహా ధర్నా నిర్వహించనున్నట్లు తెలంగాణ జన సమితి పార్టీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు నీరుడి



స్వామి తెలిపారు.ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని, ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని, ఎస్ఐఆర్ ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయన్న ఆరోపణలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.తెలంగాణ జన సమితి,వామపక్ష పార్టీలు,కాంగ్రెస్,బీఆర్ఎస్ తదితర పార్టీల ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించనున్నట్లు స్వామి తెలిపారు.సెప్టెంబర్ 30న ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లోని లోయర్ ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం నుంచి బీఆర్‌కే భవన్‌లోని ఎన్నికల కమిషన్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం అక్కడ ధర్నా చేపట్టనున్నట్లు వెల్లడించారు.సిద్దిపేట జిల్లా నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు,ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నీరుడి స్వామి పిలుపునిచ్చారు.ఉదయం 10 గంటలలోపు అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకోవాలని ఆయన కోరారు.

కీర్తిశేషులు గోలి వెంకటేశం జ్ఞాపకార్థం అన్నదానం

గజ్వేల్:29 సెప్టెంబర్ 2026 (ప్రజా కలం ప్రతినిధి):

గజ్వేల్ పట్టణంలోని అంగడిపేట ఆంజనేయస్వామి ఆలయం వద్ద పితృపక్షాలను పురస్కరించుకుని కీర్తిశేషులు గోలి వెంకటేశం జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



2వ వార్డు కౌన్సిలర్ గోలి మమత సంతోష్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా కొమురవెల్లి ఆలయ డైరెక్టర్ నంగునూరు సత్యనారాయణ, ఇటిక్యాల మాజీ సర్పంచ్ రావికంటి చంద్రశేఖర్,అయ్యప్ప దేవాలయ కమిటీ ప్రధాన కార్యదర్శి అయిత సత్యనారాయణ మాట్లాడుతూ అన్నదానం మహాదానమని అన్నారు. పితృపక్షాల సందర్భంగా అంగడిపేట ఆంజనేయస్వామి ఆలయం వద్ద ప్రతిరోజూ అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఇందులో భాగంగా కీర్తిశేషులు గోలి వెంకటేశం జ్ఞాపకార్థం అన్నదానం నిర్వహించినట్లు పేర్కొన్నారు.కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు,గోలి మమత సంతోష్ కుటుంబ సభ్యులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సంఘాల వైఫల్యంతోనే సింగరేణి కార్మికులకు కష్టాలు

కమాన్ పూర్ : సింగరేణిలో జాతీయ సంఘాలైన ఏఐటీయూసీ, ఐఎన్టియుసి యూనియన్ల వైఫల్యం కారణంగానే కార్మికులు బొగ్గు ఉత్పత్తి, కార్మిక సంక్షేమం, వైద్యం తదితర అన్ని అంశాలలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం రామగిరి మండలం సెంట్రింగ్ కాలనీ ఆర్జీ 3 పరిధిలోని అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్ట్ వద్ద టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు నాగేల్లి సాంబయ్య ఫిట్ సెక్రెటరీ వివి గౌడ్, బ్రాంచ్ సెక్రటరీ తిప్పారపు తేజ నేతృత్వంలో గేట్ మీటింగ్ నిర్వహించగా ఓవర్ మెన్లు రాజేందర్, అనిల్ రామ్ తోపాటు పెద్ద సంఖ్యలో కార్మికులు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘంలో చేరగా ముఖ్య అతిథులుగా పాల్గొన్న మిర్యాల రాజిరెడ్డి వారందరికీ గులాబి కండువాలు కప్పి యూనియన్ లోకి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా రాజిరెడ్డి కార్మికుల ఉద్దేశించి మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం కార్మికులకు పని స్థలాలలో సరైన వసతులను సమకూర్చడంలో విఫలమవుతున్నదన్నారు. నాణ్యమైన పనిముట్ల సైతం అందించడం లేదని అవసరానికి తగ్గ సిబ్బందిని నియమించక పని భారాన్ని పెంచుతున్నదన్నారు. డ్రిల్ బిట్లు ఇవ్వడం లేదని చాలా రోజుల నుండి బూట్లు కూడా ఇవ్వలేకపోతున్నారని, మ్యాన్ రైడింగ్ సమస్యలు తీర్చలేకపోతున్నారని, నీటి సమస్యలు కూడా ఉన్నట్లు కార్మికులు ఆవేదన వ్యక్తం చేసినట్లు వివరించారు. అధికారులు వెంటనే స్పందించి గనిలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని సమావేశ అనంతరం మేనేజర్ పెంచలయ్య ని కోరారు

కేటీఆర్ చేసిన ఆరోపణలు పచ్చి అబద్ధాలు

- ఆరోపణలు చేసేవారు ఒకసారి ఆత్మవిమర్శ చేసుకోవాలని
- రాజకీయ లబ్ధి కోసం తనపై అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలి
- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 29 (ప్రజా కలం):

శంషాబాద్ మండలంలోని భూ సమస్యలపై తాను గత ప్రభుత్వాన్ని సంప్రదించలేదని మాజీ మంత్రి కేటీఆర్ చేసిన ఆరోపణలు పచ్చి అబద్ధాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఖండించారు. మీడియా ముందుకు రావడానికి ముఖ్య కారణం ఇదేనని ఆయన పేర్కొన్నారు. శంషాబాద్ మండలం లోని బహదూర్ గూడ భూములకు సంబంధించి, అలాగే గౌస్మియా గూడలోని పైగా ల్యాండ్స్ భూమస్యలపై తాను గత ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రిని, మంత్రులను ఎప్పుడూ సంప్రదించలేదని నిన్న కేటీఆర్ అసత్య ఆరోపణలు చేశారని, ఇవి పూర్తిగా అవాస్తవాలని ప్రకాష్ గౌడ్ అన్నారు. ఆరోపణలు చేసేవారు ఒకసారి ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవు పలికారు.

అప్పా జంక్షన్ సభ సాక్షిగా కెసిఆర్ , కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లా:

22 డిసెంబర్ 2022న అప్పా జంక్షన్ నుండి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వరకు మెట్రోకు శంకుస్థాపన చేసిన సందర్భంలో జరిగిన బహిరంగ సభలో సభా వేదిక సాక్షిగా తాను ఈ సమస్యను ఖజ=, ఖు= దృష్టికి తీసుకెళ్లానని గుర్తు చేశారు. అంత పెద్ద బహిరంగ సభలో మాట్లాడింది విని కూడా ఇప్పుడు తమ దృష్టికి తీసుకురాలేదని అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు.కేవలం బహదూర్ గూడ భూములే కాకుండా శంషాబాద్



మండలంలోని కొత్వాల్ గూడలోని ఎనిమీ ప్రాపర్టీస్, భూదాన్ భూములు, సుల్తాన్ పల్లి, మల్కారం, జూకల్, రామాంజాపూర్, పెద్ద గోల్కొండ, చౌదరిగూడ, నర్కుడా, పెద్ద షాపూర్ మరియు అత్తాపూర్ లోని భూపాల్ నగర్, జలాల్ బాబా నగర్, రాజేంద్రనగర్ లోని హనుమాన్ నగర్, గండిపేట్ మండలంలోని వట్టినాగులపల్లి తదితర ప్రాంతాల్లో ఉన్న భూ సమస్యలపై తాను గత ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రిని, మంత్రులను పలుమార్లు కలిసి వినతిపత్రాలు ఇచ్చానని తెలిపారు.

2017లోనే అసెంబ్లీలో ప్రస్తావించా:

6 నవంబర్ 2017లో జరిగిన అసెంబ్లీ సమావేశంలో జలాల్ బాబా నగర్, భూపాల్ నగర్, హనుమాన్ నగర్ భూ సమస్యలపై మాట్లాడిన వీడియోను మీడియా ముందు ఉంచుతున్నానని అన్నారు.

"నేను నా ప్రజల కోసం, వారి భూ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతూనే ఉన్నాను. ఇది ఈనాటిది కాదు. గతంలో వై.ఎస్. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి నుంచి ఈ భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని పోరాడుతున్నాను. అసెంబ్లీలో కూడా పలుమార్లు ప్రస్తావించాను" అని అన్నారు. కెసిఆర్ ప్రభుత్వంలో కూడా కెసిఆర్ , కేటీఆర్ లకు అధికారులకు ఎన్నో వినతిపత్రాలు ఇచ్చానని, ప్రత్యేకంగా 2020, 2022, 2023 సంవత్సరాల్లో అనేకసార్లు విన్నవించానని తెలిపారు. అప్పటి చీఫ్ సెక్రటరీ సోమేష్ కుమార్ నివాసానికి స్వయంగా వెళ్లి వినతిపత్రం ఇచ్చానని, దానికి సంబంధించిన ఆధారాలు తన వద్ద ఉన్నాయన్నారు.మాజీ పార్లమెంట్ సభ్యులు గడ్డం రంజిత్ రెడ్డి ద్వారా కూడా ఈ సమస్యను గత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానని, జిల్లా కలెక్టర్, అప్పటి ఆర్డీఓ చంద్రకళ ద్వారా కూడా పరిష్కారం కోరానని అన్నారు. తహసీల్దార్ నుండి కలెక్టర్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ వారికి జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ స్పష్టమైన ఆధారాలతో తన వద్ద ఉన్నాయని పేర్కొన్నారు.కేవలం రాజకీయ లబ్ధి కోసం తనపై అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. ప్రస్తుత ప్రభుత్వంలోనూ పోరాటం కొనసాగుతుంది:

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా ఈ సమస్యల పరిష్కారం కోసం తన పోరాటాన్ని కొనసాగిస్తున్నానని, రీసెంట్ గా జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో "ప్రజలు నన్ను నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించారు. నేను నా ప్రజలకు ఈ ఒక్క భూ సమస్యలు పరిష్కరిస్తే చాలు, నేను ధన్యుడిని అవుతాను" అని స్పీకర్ ద్వారా ప్రభుత్వాన్ని వేడుకున్నానని తెలిపారు. వచ్చే సమావేశాల నాటికి ఈ సమస్యకు పరిష్కారం చూపకపోతే అసెంబ్లీ పోడియం ముందు ధర్నాకు కూడా వెనుకాడనని స్పష్టంగా చెప్పానని గుర్తు చేశారు.నా ప్రజల ఆస్తులు, వారి హక్కులను కాపాడటం నా బాధ్యత అని, రాజశేఖరరెడ్డి ప్రభుత్వం నుండి నిన్నటి కెసిఆర్ ప్రభుత్వం వరకు, నేటి ప్రభుత్వం వరకు ఈ భూ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమిస్తున్నానని, అసత్యాలు ప్రచారం చేసేవారిని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.

గుండెను కాపాడే గొప్ప సేవ

- ఆర్‌వీఎం ఆసుపత్రిలో ఉచిత వైద్య శిబిరం
- గ్రామీణ,పట్టణ ప్రజలకు ఉచితంగా గుండె వైద్య పరీక్షలు



గజ్వేల్ నియోజకవర్గం:
29 సెప్టెంబర్ 2026 (ప్రజా కలం ప్రతినిధి)

వరల్డ్ హార్ట్ డే సందర్భంగా గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజల సౌకర్యార్థం ఎలాంటి లాభాపేక్ష లేకుండా సేవాభావంతో నిర్వహిస్తున్న 1,250 పడకల ఆర్‌వీఎం చారిటబుల్ ట్రస్ట్ హాస్పిటల్‌లో మంగళవారం ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గజ్వేల్ నియోజకవర్గంలోని లక్ష్మక్కపల్లి గ్రామంలో ఉన్న ఆర్‌వీఎం చారిటబుల్ ట్రస్ట్ హాస్పిటల్‌లో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం నుంచే పరిసర ప్రాంతాల నుంచి గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ప్రజలు పెద్ద సంఖ్యలో శిబిరానికి తరలివచ్చారు.ఈ సందర్భంగా రోగులకు ఈసీజీ (ECG), 2డీ ఎకో (2ణ–జుజుఌా),లిపిడ్ ప్రొఫైల్, ఆర్‌బీఎస్ (రాండమ్ బ్లడ్ షుగర్) తదితర పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. అవసరమైన కొంతమంది రోగులకు మందులను కూడా ఉచితంగా పంపిణీ చేశారు.ఈ వైద్య శిబిరం ద్వారా పలువురు రోగులకు గుండె సంబంధిత ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించే అవకాశం లభించింది.తమలో దాగి ఉన్న గుండె సమస్యలు వైద్య పరీక్షల ద్వారా వెలుగులోకి రావడంతో పలువురు రోగులు సంతోషం వ్యక్తం



చేశారు.గ్రామీణ,పట్టణ ప్రాంత ప్రజలకు ఇలాంటి ఉచిత వైద్య సేవలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్‌వీఎం ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్,గుండె వైద్య నిపుణులు డాక్టర్ భానుకిరణ్ రెడ్డి,డాక్టర్ లక్ష్మీనారాయణ,ఆర్‌వీఎం సీఈఓ దేవరకొండ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మృదువైన హృదయం

గుండె లోతుల్లోంచి ఆలోచించి ఆలోచించి
మనసు పొరల్లోంచి ఆలోచించి ఆలోచించి
సాహిత్యాన్ని ఆస్వాదిస్తాను
అయినా
నా మనసు'కు'కుదుట పడదు
ఎందుకంటే...సాహిత్యం అంటే స్వచ్ఛమైనది
సాహిత్యం అంటే స్వేచ్ఛకు అతీతమైనది,సాహిత్యం అంటే మకుటం లేనిది, సాహిత్యం అంటే స్వతంత్రంగా జీవించేది, ఇంతకుమించి చెప్పాలి అంటే..
సాహిత్యం అంటే హృదయ అంతరాల్లో నుంచి మానవత్వాన్ని మేలుకొలుపుకునేది
ఆ మానవత్వాన్ని సమ సమాజ స్థాపన కోసం, విశ్వజగతి లోక కళ్యాణం కోసం ఉపయోగించేది
నేడు అంతర్జాతీయ'ప్రపంచ' హృదయ దినోత్సవం సందర్భంగా దీనిని అమరికలు లేని స్వహృదయంతో మేల్కొల్పాలి!?
ఆ మానవత్వాన్ని మతం పేరుతోనో, కులం పేరుతోనో, జాతి పేరుతోనో, దైవం పేరుతోనో, మనిషి సహజత్వాన్ని దెబ్బతీయకూడదు అదే నిజమైన సాహిత్యం
అదే ప్రపంచ సంపద
ఇంకా చెప్పాలంటే మాటను తూటల పేల్చాలి అంటే
పుట్టడం గిట్టడం సహజం
మధ్యలో వచ్చిన అపోహలన్నీ వ్యక్తిగత స్వలాభం



(అంతర్జాతీయ హృదయ దినోత్సవం వర్ధిల్లాలి)
విజ్ఞాన కళా నేత్రం
- కవి రాజా

గ్రామస్థాయిలో కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి.

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జాల దుర్గ ప్రసాద్.

దుబ్బాక ప్రజాకలం సెప్టెంబర్ 29.

గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను అర్హులైన ప్రజలకు అందేలా కార్యకర్తలు కృషి చేయాలని మండల అధ్యక్షులు జాల దుర్గాప్రసాద్ అన్నారు. మంగళవారం మంతూర్, అనాజీపూర్, కొత్తపల్లి గ్రామాల్లో ఏఎంసీ చైర్మన్ గొల్లపల్లి కనకయ్యతో కలిసి గ్రామ కాంగ్రెస్ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ గ్రామ కమిటీల ద్వారా పార్టీ కార్యకలాపాలను మరింత విస్తృతం చేయడంతో పాటు ప్రజా సమస్యలను పార్టీ దృష్టికి తీసుకురావాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తలకు కమిటీల్లో ప్రాధాన్యం కల్పించినట్లు తెలిపారు. అనాజీపూర్ గ్రామ అధ్యక్షుడిగా రాచకొండ యాదగిరి, మంతూర్ గ్రామ అధ్యక్షుడిగా కాశ చందు, కొత్తపల్లి గ్రామ అధ్యక్షుడిగా ఎల్లం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు పాల రామాగౌడ్, ఉషనగల్ల స్వామి, ప్రధాన కార్యదర్శి పావని నరేష్, మాజీ మండల అధ్యక్షులు తప్పటి సుధాకర్, ఉప సర్పంచ్ రాజు, ఏఎంసీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



కమ్మర్‌పల్లిలో ఉత్సాహంగా దివ్యాంగుల క్రీడా పోటీలు

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) సెప్టెంబరు 29:

కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో దివ్యాంగ విద్యార్థుల కోసం నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీలు మంగళవారం ఉత్సాహభరితంగా సాగాయి. వివిధ పాఠశాలల నుంచి తరలివచ్చిన దివ్యాంగ విద్యార్థులు ఈ పోటీలలో



పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి (MEO) ఆంధ్రయ్య హాజరై పోటీలను ప్రారంభించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న వీణూ సదాశివ మాట్లాడుతూ.. దివ్యాంగ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంలో ఇటువంటి క్రీడా పోటీలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, క్రీడాస్ఫూర్తి, సమాన అవకాశాల భావన పెంపొందించేందుకు ఈ కార్యక్రమాలు దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం పి. సాయన్న, స్పెషల్ ఎడ్యుకేటర్ మధుశేఖర్, IERP రాజన్న పాల్గొని విద్యార్థులకు అవసరమైన సహకారం అందించారు. జక్రాలు అంజయ్య, రాజేష్, లలిత కార్యక్రమ నిర్వహణ బాధ్యతలు చూశారు. వివిధ క్రీడల్లో ప్రతిభ కనబరిచి విజయం సాధించిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు.



అవినీతికి పాల్పడుతున్న పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

-రంగాపురం గ్రామపంచాయతీ పాలకవర్గం

మండలంలో అక్రమ వసూళ్ల వెనుక మండల పంచాయతీ అధికారుల హస్తం?

గ్రామపంచాయతీకి రావలసిన నిధులు దారి మళ్లిస్తున్న చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలం?

బొమ్మలరామారం, సెప్టెంబర్ 29 (ప్రజా కలం)

యాదాద్రి భువనగిరి జిల్లా, బొమ్మలరామారం మండలం, రంగాపూర్ పంచాయతీ కార్యదర్శి స్థానిక పాలక వర్గాన్ని వక్కనపెట్టి కంపెనీల యాజమాన్యాలను భయాందోళనకు గురిచేస్తూ అవినీతికి పాల్పడుతున్నారని వెంటనే పంచాయతీ కార్యదర్శి పై చర్యలు తీసుకోవాలని రంగాపురం గ్రామపంచాయతీ సర్పంచ్ యంజాల సరస్వతి గణేష్,ఉప సర్పంచ్ తాళ్ల ప్రవీణ్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం రోజున మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి శ్యామలకి వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామిడి ప్రభాకర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ జూపల్లి వెంకటేష్,వార్డు సభ్యులు మర్రి ఉమారాణి గోపాల్ రెడ్డి,బిమరి బాలమణి రాజు,యంజాల మానస ప్రవీణ్, ఠాగూర్ రాజేందర్ సింగ్, మైలారం లావణ్య దర్శన్, మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు తాళ్ల రవీందర్ రెడ్డి, జూపల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు

మృతుడు ఉపేందర్ కుటుంబానికి తోటి ఉద్యోగుల ఆర్థిక భరోసా

-1,48,117 ఆర్థిక సహాయం

ధన్యవాదాలు తెలిపిన ఉపేందర్ కుటుంబ సభ్యులు

మేడిపల్లి సెప్టెంబర్ 30(ప్రజాకలం న్యూస్)

సౌత్ సెంట్రల్ రైల్వే సికింద్రాబాద్ డివిజన్ పర్సనల్ డిపార్ట్మెంట్‌లో ఆఫీస్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న వికారాబాద్ నివాసి ఉపేందర్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన కుటుంబానికి అండగా నిలిచేందుకు తోటి ఉద్యోగులు మానవతా దృక్పథంతో ముందుకు వచ్చారు.

ఉపేందర్‌తో కలిసి పనిచేసిన ఉద్యోగులంతా తమ వంతుగా విరాళాలు సేకరించి మొత్తం రూ.1,48,117 సమకూర్చారు. అందులో భాగంగా ఉపేందర్ ఇద్దరు పిల్లల భవిష్యత్‌కు ఆర్థిక భరోసా కల్పించే ఉద్దేశంతో సుకన్య సమృద్ధి యోజన పథకం కింద డిపాజిట్ చేశారు.ఈ సందర్భంగా ఉపేందర్ కుటుంబ సభ్యులు మాట్లాడుతూ తమ కుటుంబం కష్టకాలంలో ఉన్న సమయంలో తోటి ఉద్యోగులు స్పందించి ఆర్థికంగా అండగా నిలవడం ఎంతో గొప్ప విషయమని అన్నారు.తమ పిల్లల భవిష్యత్ కోసం పొదుపు రూపంలో సహాయం అందించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. సహాయం చేసిన ప్రతి ఒక్క ఉద్యోగికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఉపేందర్ తమతో కలిసి పనిచేసిన సహోద్యోగి మాత్రమే కాకుండా, కుటుంబ సభ్యుడిలా ఉండేవారని గుర్తుచేసుకున్నారు. ఆయన ఆకస్మిక మరణం తమను తీవ్రంగా కలిచివేసిందని తెలిపారు.





'బికమింగ్ ద డివైన్ యూ' పుస్తకావిష్కరణ

ఆత్మావగాహన.. ఆధ్యాత్మికత.. ఆనందాన్వేషణపై రచయిత అంతర్మథనం

ఆకట్టుకున్న పేరిణి శివతాండవ ప్రదర్శన

హైదరాబాద్, సెప్టెంబర్ 29 (ప్రజా కలం ప్రతినిధి)

బల్విందర్‌నాథ్ చాగన్ల రచించిన 'బికమింగ్ ద డివైన్ యూ-- అవేకెన్ ద పవర్ విథిన్ టు ఫైండ్ ట్రూ హ్యాపీనెస్' పుస్తకాన్ని మాదాపూర్‌లోని హోటల్ నరేన్‌లో మంగళవారం ఆవిష్కరించారు. నరేన్ గ్రూప్ ఛైర్మన్ నరేంద్రనాథ్ చాగన్ల ముఖ్య అతిథిగా, నటుడు, మోటివేషనల్ స్పీకర్ కె.వి. ప్రదీప్ గౌరవ అతిథిగా హాజరయ్యారు.

స్వీయ అవగాహన, ఆధ్యాత్మికత, ఆలోచనలు, భావోద్వేగాలు, భయం, సంబంధాలు, ఆనందాన్వేషణ వంటి అంశాలను ఈ పుస్తకంలో ప్రస్తావించినట్లు రచయిత తెలిపారు. యోగా, ధ్యానం, ఆధ్యాత్మిక అన్వేషణతో పాటు 'మనిషిగా ఉండటమంటే ఏమిటి?' అనే ప్రశ్నకు సమాధానం వెతికే క్రమంలో తన అనుభవాల ఆధారంగా పుస్తకాన్ని రూపొందించినట్లు పేర్కొన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా పేరిణి

పుస్తకావిష్కరణ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటేలా పేరిణి శివతాండవం ప్రత్యేక ప్రదర్శన నిర్వహించారు. పద్మశ్రీ డాక్టర్ నటరాజ రామకృష్ణ శిష్యుడు పేరిణి పవన్‌కుమార్, ఆయన బృందం ప్రదర్శించిన నృత్యం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పేరిణి నృత్యంలోని శక్తి, వీరత్వం, యోధుల స్ఫూర్తిని ప్రదర్శన ద్వారా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య, గౌరవ అతిథుల ప్రసంగాలతో పాటు రచయితతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. పుస్తకం రూపకల్పనకు దారితీసిన ఆలోచనలు, రచయిత ఆధ్యాత్మిక ప్రయాణంపై చర్చించారు.

ఘనంగా సత్కారం

కార్యక్రమంలో పేరిణి పవన్‌కుమార్, సంధ్యా పవన్‌లను ముఖ్య అతిథి, గౌరవ అతిథులతో కలిసి ఘనంగా సత్కరించారు. అతిథులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు, సాహిత్యాభిమానులు కార్యక్రమంలో పాల్గొన్నారు. సాహిత్యం, ఆధ్యాత్మికతతో పాటు తెలంగాణ సంప్రదాయ కళకు వేదిక కల్పించిన ఈ కార్యక్రమం ప్రత్యేకంగా నిలిచింది.



అక్లూర్‌లో ఘనంగా 'విలేజ్ మ్యాపింగ్'

ఒక సంవత్సరం అభివృద్ధి కార్యాచరణ ప్రణాళికకు శ్రీకారం

వేల్పూర్, సెప్టెంబరు 29 (ప్రజా కలం ప్రతినిధి)

వికసిత్ భారత్--వీబీ--జీ రామ్ జీ కార్యక్రమంలో భాగంగా వేల్పూర్ మండలం అక్లూర్ గ్రామ పంచాయతీలో వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళిక (వీజీపీపీ) రూపకల్పనకు మంగళవారం 'విలేజ్ మ్యాపింగ్' నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామంలో పర్యటించి ప్రస్తుత పరిస్థితులు, మౌలిక వసతులు, ప్రజలకు అవసరమైన సౌకర్యాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి మ్యాపింగ్ చేశారు.

అవసరాల గుర్తింపు

గ్రామంలో తాగునీరు, పారిశుధ్యం, డ్రైనేజీ, రహదారులు, వీధి దీపాల నిర్వహణతో పాటు నీటి సంరక్షణ, పచ్చదనం, ఉపాధి కల్పన తదితర అంశాలపై అవసరాలను గుర్తించారు. గ్రామానికి అవసరమైన అభివృద్ధి పనులను క్రోడీకరించి ఒక సంవత్సరం కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 'మన గ్రామం--మన ప్రణాళిక--మన అభివృద్ధి' అనే స్ఫూర్తితో ప్రజల భాగస్వామ్యంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. వికసిత గ్రామ పంచాయతీలే వికసిత్ భారత్‌కు బలమైన పునాదులని తెలిపారు.

కార్యక్రమంలో గ్రామ సర్పంచి జిన్నా జనార్ధన్, పంచాయతీ కార్యదర్శి మహేష్, ఎఫ్ఏ రాజేశ్వర్, సీఏ, ఐకేపీ సంఘాల నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మహిళా పోలీస్ స్టేషన్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేసిన నిజామాబాద్ పోలీస్ కమిషనర్

పోలీస్ స్టేషన్ కు వచ్చే ప్రతి ఫిర్యాదుతో మర్యాదగా ప్రవర్తించాలి

ప్రతి ఒక్కరూ పోలీస్ ఇమేజ్ పెంచే విధంగా కృషి చేయాలి

నిజామాబాద్

,(ప్రజా కలం ప్రతినిధి) సెప్టెంబర్ 29:

నిజామాబాద్ నగరంలోని మహిళా పోలీస్ స్టేషన్‌ను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐ.పి.యస్., మంగళవారం క్షుణ్ణంగా తనిఖీలు చేశారు.ముందుగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించి తదుపరి పోలీస్ స్టేషన్ లో చెట్లు నాటడం జరిగింది. అనంతరం సిబ్బందికి సంబంధించినటువంటి కిట్ ఆర్టికల్ క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. తదుపరి పోలీస్ స్టేషన్లో పూర్తిగా కలియతిరి. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని కేసుల నమోదు , దర్యాప్తు పురోగతి , పెండింగ్ కేసులు , ఫిర్యాదుల పరిష్కారం , స్టేషన్ రికార్డుల నిర్వహణ , సిబ్బంది విధుల నిర్వహణ తదితర అంశాలను కమిషనర్ సమగ్రంగా పరిశీలించారు. మహిళలు , బాలికలకు సంబంధించిన ఫిర్యాదులపై పోలీసులు త్వరితగతిన స్పందించి, బాధితులకు భరోసా కల్పిస్తూ , చట్టపరమైన నిబంధనల ప్రకారం సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళా బాధి తులు తమ సమస్యలను ఎటువంటి భయాందోళనలు లేకుండా పోలీసులకు తెలియజేసే విధంగా వారికి అనుకూలమైన వాతావరణాన్ని కల్పించాలని ఆదేశించారు. అదేవిధంగా మహిళలు , బాలికలకు సంబంధించిన కేసుల్లో దర్యాప్తును నిర్లక్ష్యం చేయకుండా , ప్రతి కేసును సున్నితమైన అంశంగా పరిగణిస్తూ , అవసరమైన ఆధారాలను సేకరించి , దర్యాప్తును నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని సూచించారు. కేసుల దర్యాప్తులో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు , బాధితులకు సకాలంలో న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశిం చారు. స్టేషన్‌లోని వివిధ రికార్డులు , కేసు ఫైళ్లు , పెండింగ్ కేసుల వివరాలను పరిశీలించారు. పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి , దర్యాప్తును వేగవంతం చేయాలని సూచించారు. మహిళా పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుతో మర్యాదగా , గౌరవంగా వ్యవహరిస్తూ , వారి సమస్యలను ఓర్పుతో విని , చట్టపరమైన పరిష్కారం చూపాలని సిబ్బందికి సూచించారు. ముఖ్యంగా మహిళలు, బాలికల భద్రతకు సంబంధించిన అంశాల్లో అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. ప్రజలకు ముఖ్యంగా మహిళలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. మహిళల భద్రత , రక్షణ కు పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని , మహిళలకు ఏవైనా సమస్యలు ఎదురైతే నిర్భయంగా పోలీసులను ఆశ్రయించాలని ఈ సందర్భంగా కమిషనర్ సూచించారు. అనంతరం సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ అధికారులు మరియు సిబ్బంది 24ఽ7 తమ హెడ్ క్వార్టర్స్ లో అందుబాటులో ఉండాలని , దూర ప్రాంతాల నుండి ప్రయాణాలకు దూరంగా ఉండాలని , సిబ్బంది ప్రతి ఆరు నెలలకు ఒకసారి తమ హెల్త్ చెకప్ చేయించుకోవాలని, ముఖ్యంగా బైక్ నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని అన్నారు. ట్రాఫిక్ రూల్స్ ను పాటిస్తూ ఇతరులకు ఆదర్శంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ ఏసిపి ప్రకాష్ , మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎస్. శ్రీలత , మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ లు ఎమ్. డి రహమతుల్లా , పి. రాజేశ్వర్, పి. జాన్సన్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.



జెన్ జీకి తగ్గట్టు 'వైబ్' ఆరోగ్య బీమా

రోజువారీ ఆరోగ్యం.. మానసిక శ్రేయస్సు.. రక్షణ ఒకే ప్యాకేజీలో

ఐసీఐసీఐ లొంబార్డ్ కొత్త ఆరోగ్య రక్షణ పరిష్కారం

ముంబయి, సెప్టెంబరు 29 (ప్రజా కలం ప్రతినిధి)

యువతరంలో మారుతున్న ఆరోగ్య అవసరాలకు అనుగుణంగా ఐసీఐసీఐ లొంబార్డ్ 'వైబ్ (విఐబిఇ)' పేరుతో కొత్త ఆరోగ్య రక్షణ పరిష్కారాన్ని పరిచయం చేసింది. ఆసుపత్రిలో చేరినప్పుడు లభించే బీమా కవరేజీతో పాటు రోజువారీ ఆరోగ్య సంరక్షణ, మానసిక శ్రేయస్సు, డిజిటల్ సేవలు, జీవనశైలికి అనుగుణమైన ప్రయోజనాలను ఇందులో అందిస్తున్నట్లు సంస్థ వెల్లడించింది.

యువత అభిరుచులకు అనుగుణంగా..

డిజిటల్ సౌకర్యాలకు అలవాటుపడిన యువత ఆరోగ్యంపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు మానసిక శ్రేయస్సుకూ ప్రాధాన్యం ఇస్తోంది. ఈ నేపథ్యంలో సంప్రదాయ ఆరోగ్య బీమా విధానానికి భిన్నంగా రోజువారీ జీవితంలోనూ ఉపయోగపడేలా 'వైబ్'ను రూపొందించినట్లు ఐసీఐసీఐ లొంబార్డ్ తెలిపింది. 'ఐఎల్ టేక్ కేర్' వ్యవస్థ ఆధారంగా మొబైల్-ఫస్ట్ విధానంలో సేవలు అందించనున్నట్లు పేర్కొంది.

నంత్ర నిర్వహించిన పరిశోధనలో 70.5 శాతం మంది ఆరోగ్యం, శ్రేయస్సును తమ ప్రధాన రక్షణ ప్రాధాన్యంగా పేర్కొనగా.. 54.5 శాతం మంది ఆరోగ్యంపై మరింత లోతుగా తెలుసుకోవడానికి ఆసక్తి చూపారు. ప్రత్యేకంగా ఓపీడీ కవరేజీ ఉంటే బీమా కొనుగోలు చేసే ఆసక్తి పెరుగుతుందని 40.4 శాతం మంది తెలిపారు.

'వైబ్'లో ఏమేం ఉన్నాయి?

కోర్ ప్రొటెక్ట్: ఆసుపత్రిలో చేరినప్పుడు అయ్యే ఖర్చులకు కవరేజీతో పాటు సమ్ ఇన్సూర్డ్‌ను అపరిమితంగా రీసెట్ చేసుకునే సదుపాయం. పాలసీ నిబంధనల మేరకు సమ్ ఇన్సూర్డ్‌పై 100 శాతం వరకు లాయల్టీ ప్రయోజనాలు అందనున్నాయి.

ఆరా పాయింట్స్: ఓపీడీ కన్సల్టేషన్లు, వైద్య పరీక్షలు, మందులు, దంత, కంటి సంరక్షణ వంటి రోజువారీ ఆరోగ్య అవసరాలకు నెలవారీ హెల్త్‌కేర్ క్రెడిట్లను వినియోగించుకునే అవకాశం.

మైండ్ అండ్ మూడ్ రికవర్: మానసిక ఆరోగ్యానికి సంబంధించిన నిపుణుల కౌన్సెలింగ్ సేవలు.

ప్లాన్ ఆధారంగా 3 నుంచి 10 వరకు కౌన్సెలింగ్ సెషన్లకు అవకాశం ఉంటుంది.

రిఫరల్ డిస్కౌంట్: విజయవంతమైన ప్రతి రిఫరల్‌కు 500 క్రెడిట్ పాయింట్లు పొందే అవకాశం.

గెట్‌ఫిట్: జిమ్, క్రీడలు, పైలేట్స్ తదితర అర్హత కలిగిన జీవనశైలి కార్యకలాపాలకు వెల్‌నెస్ క్రెడిట్లను వినియోగించుకోవచ్చు.

గ్రీన్ ఫ్లాగ్ బోనస్: ఎంచుకున్న ప్లాన్‌ను బట్టి ప్రతి పాలసీ సంవత్సరానికి సమ్ ఇన్సూర్డ్‌పై అదనపు బోనస్ లభిస్తుంది. ఇది సంబంధిత ప్లాన్‌కు నిర్దేశించిన గరిష్ఠ పరిమితికి లోబడి ఉంటుంది.



ఆరోగ్య బీమాలో కొత్త విధానం

ఐసీఐసీఐ లొంబార్డ్ చీఫ్--హెల్త్ అండర్‌రైటింగ్, క్లెయిమ్స్, కస్టమర్ సర్వీస్, ఆపరేషన్స్ గిరీష్ సెహగల్ మాట్లాడుతూ.. యువత అనారోగ్యం వచ్చినప్పుడు మాత్రమే కాకుండా ముందుగానే ఆరోగ్యంపై దృష్టి పెడుతోందన్నారు. తమ ఎంపికలపై నియంత్రణ, కవరేజీలో స్పష్టత, ఆసుపత్రి చికిత్సకు మించి రోజువారీ ప్రయోజనాలను యువ వినియోగదారులు కోరుకుంటున్నారని తెలిపారు. ఈ అంచనాలకు అనుగుణంగా ఆరోగ్య రక్షణను వారి రోజువారీ జీవితాలకు చేరువ చేయడమే 'వైబ్' ఉద్దేశమని పేర్కొన్నారు. 25 ఏళ్లుగా ఆరోగ్య రక్షణ రంగంలో ఉన్న ఐసీఐసీఐ లొంబార్డ్.. సాంకేతికత, ఆవిష్కరణ, కస్టమర్-కేంద్రిత ఉత్పత్తి రూపకల్పనకు అనుగుణంగా 'వైబ్'ను అందుబాటులోకి తెచ్చినట్లు సంస్థ తెలిపింది.

ఉప సర్పంచ్‌ల జాయింట్ చెక్ పవర్ కొనసాగించాలి

- శిలాఫలకాలపై సర్పంచ్‌లతో సమానంగా పేర్లు ఉండాలి
- ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు గౌరవ వేతనం చెల్లించాలి
- రాష్ట్ర ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బోట్ల కార్తీక్





మహేశ్వరం, సెప్టెంబరు 29 (ప్రజాకలం):

గ్రామ పంచాయతీల్లో ఉప సర్పంచ్‌లకు సర్పంచ్‌లతో పాటు జాయింట్ చెక్ పవర్‌ను కొనసాగించాలని తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బోట్ల కార్తీక్ ప్రభుత్వాన్ని కోరారు. మహేశ్వరం మండల పరిధిలోని గ్రాండ్ ఏరినా స్పోర్ట్స్ కౌంటీ రిసార్ట్స్‌లో మంగళవారం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉప సర్పంచ్‌ల ఫోరం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన ఉప సర్పంచ్‌లు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ఈ సందర్భంగా బోట్ల కార్తీక్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 33 జిల్లాల్లోని అన్ని గ్రామాల ఉప సర్పంచ్‌లకు సర్పంచ్‌లతో సమానంగా జాయింట్ చెక్ పవర్‌ను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలపై సర్పంచ్‌లతో సమానంగా ఉప సర్పంచ్‌ల పేర్లను కూడా ఏర్పాటు చేయాలని కోరారు. మండల స్థాయిలో నిర్వహించే జనరల్ బాడీ సమావేశాల్లో ఉప సర్పంచ్‌లకు అవకాశం కల్పించాలని అన్నారు.

హక్కులు కొనసాగించాలి

రంగారెడ్డి జిల్లా ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు అంగోత్ భాస్కర్ నాయక్ మాట్లాడుతూ ఉప సర్పంచ్‌ల జాయింట్ చెక్ పవర్ తొలగిస్తారన్న ప్రచారం నేపథ్యంలో ఇందిరాపార్క్ వద్ద సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి ప్రభుత్వానికి తమ అభిప్రాయాలను తెలియజేసినట్లు తెలిపారు. అనంతరం రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశామన్నారు.

పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ఉప సర్పంచ్‌లకు కల్పించిన హక్కులను కొనసాగించాలని కోరారు. గ్రామ పంచాయతీ నిధుల వినియోగం, తీర్మానాల విషయంలో ఉప సర్పంచ్‌లకు సమాన భాగస్వామ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సర్పంచ్, కార్యదర్శులు మాత్రమే నిర్ణయాలు తీసుకునే విధానం కాకుండా ఉప సర్పంచ్‌ల సంతకాలు కూడా తప్పనిసరి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సర్పంచ్‌లతో పాటు ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు కూడా గౌరవ వేతనం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మట్ట శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు శివకుమార్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మరి నరేష్, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు డి. బాల్‌రాజు, రోహిత్‌కుమార్, ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌గౌడ్, షాద్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి అభినవ్, మహేశ్వరం మండల అధ్యక్షుడు దయాకర్‌రెడ్డితో పాటు వివిధ గ్రామాలు, మండలాలకు చెందిన ఉప సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

హిందూ దేవుళ్లను రాజకీయాల్లోకి లాగడం బాధాకరం

- హరిహరులను విభజించే హక్కు నీకు ఎక్కడిది?
- హిందూ సమాజానికి రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలి
- బీజేపీ కొత్తూరు మండల అధ్యక్షులు అత్తాపురం మహేందర్ రెడ్డి

రంగారెడ్డి, సెప్టెంబర్ 29, (ప్రజా కలం)

హిందూ సమాజం అత్యంత పవిత్రంగా ఆరాధించే శ్రీరాముడు, పరమశివుడిని రాజకీయ ప్రయోజనాల కోసం పేదలు ధనికులు, ఉత్తరాది దక్షిణాది అంటూ విభజించేలా



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా బాధాకరమని బీజేపీ కొత్తూరు మండల అధ్యక్షులు అత్తాపురం మహేందర్ రెడ్డి మండిపడ్డారు. హరిహరులు ఒక్కటే.. భక్తికి ప్రాంతం, కులం, ఆర్థిక స్థాయి అనే భేదాలు లేవని ఆయన అన్నారు. తెలంగాణలోనే వేములవాడ రాజరాజేశ్వర స్వామి క్షేత్రం దక్షిణ కాశీగా, భద్రాచలం దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందాయని గుర్తుచేశారు.రాజకీయాల్లోకి దేవుళ్లను లాగి, భక్తుల విశ్వాసాలను విభజించే ప్రయత్నం చేయడం సరికాదని అన్నారు. హిందూ సమాజం ఆరాధించే దేవతలను రాజకీయాలకు ఉపయోగించుకునే బదులు ప్రజల సమస్యలపై దృష్టి పెట్టాలని సూచించారు. శ్రీరాముడు, పరమశివుడు కోట్లాది హిందువుల ఆరాధ్య దైవాలని, వారి మధ్య విభజన సృష్టించే వ్యాఖ్యలు చేయడం హిందూ సమాజం మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయని అన్నారు. తన వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాజకీయాల కోసం హరిహరులను కూడా విడదీయాలనుకోవడం ఏ సంస్కృతి హరిహరులను విభజించే హక్కు మీకు ఎవరిచ్చారు అని ఆయన ప్రశ్నించారు.

రూ.29.15 కోట్ల బకాయిపై ఆర్ఆర్ చట్టం కింద చర్యలు.

15 రోజుల్లో చెల్లించకుంటే ఆస్తుల జప్తు, వేలం.

రాయపోల్ తహసిల్దార్ కృష్ణమోహన్.

దుబ్బాక ప్రజాకలం సెప్టెంబర్ 29.

రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామంలోని ఎంఎస్ శ్రీ సాయి వీరభద్ర రైస్ ఇండస్ట్రీస్ యాజమాన్యం ప్రభుత్వ ధాన్యం నిల్వలను దుర్వినియోగం చేయడంతో రూ.29,15,49,811 నష్టం వాటిల్లిందని తహసీల్దార్ కృష్ణమోహన్ తెలిపారు. ఈ మొత్తాన్ని వసూలు చేసేందుకు రెవెన్యూ రికవరీ చట్టం కింద చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు సెప్టెంబర్ 29న తహసీల్దార్ కార్యాలయం నుంచి యాజమాన్యానికి నోటీసు జారీ చేశారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన రూ.29.15 కోట్లను 15 రోజుల్లోగా చెల్లించాలని ఆదేశించారు. గడువులోగా బకాయి చెల్లించకపోతే రెవెన్యూ రికవరీ చట్టం--1864లోని సెక్షన్ 5 ప్రకారం సంస్థకు చెందిన చర, స్థిరాస్తులను జప్తు చేసి ప్రభుత్వ బకాయిలను వసూలు చేస్తామని హెచ్చరించారు.



తెలంగాణ స్టేట్ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ నివేదికలు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు, జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపట్టినట్లు తహసీల్దార్ తెలిపారు.

మా శివారులు మాకే కావాలి

- రెవెన్యూ మంత్రిని కలిసిన శివారు వెంకటాపూర్ రైతులు
- మా రికార్డులు తొలగించి ఎర్రవల్లి రికార్డుల్లోకి మార్చారు: రైతుల ఆరోపణ
- అధికారులతో చర్చించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి





గజ్వేల్ :29 సెప్టెంబర్ (ప్రజా కలం ప్రతినిధి):

మా శివారులు మాకే కావాలని కోరుతూ గజ్వేల్ నియోజకవర్గం మర్కుక్ మండలం శివారు వెంకటాపూర్ గ్రామానికి చెందిన రైతులు మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణ,సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా సర్వే నంబర్ 325కు సంబంధించిన భూముల్లో కొంతకాలంగా వివాదం కొనసాగుతోందని రైతులు తెలిపారు.తమకు అన్యాయం జరుగుతోందని వారు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా, తమ గ్రామానికి సంబంధించిన సర్వే నంబర్లను శివారు వెంకటాపూర్ గ్రామ రెవెన్యూ రికార్డుల నుంచి తొలగించి ఎర్రవల్లి గ్రామ రికార్డుల్లోకి బదిలీ చేశారని రైతులు ఆరోపించారు.తమ భూ రికార్డుల్లో మార్పులు చోటుచేసుకోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.తమ సర్వే నంబర్లను తిరిగి శివారు వెంకటాపూర్ గ్రామ రికార్డుల్లో,నక్షా పటంలో నమోదు చేయాలని,తమ భూముల సరిహద్దులను స్పష్టంగా చూపించేలా చర్యలు తీసుకోవాలని వారు మంత్రిని కోరారు.రైతులు వివరించిన సమస్యలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. సమస్యను పరిశీలించి సంబంధిత అధికారులతో చర్చించి, సర్వే నంబర్లను తిరిగి గ్రామ రికార్డులు, నక్షా పటంలో నమోదు చేయించేలా, భూముల సరిహద్దులను స్పష్టంగా చూపించేలా చర్యలు తీసుకుని న్యాయం చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు రైతులు పేర్కొన్నారు.



ఎస్సీ, ఎస్టీల హక్కుల సంరక్షణకు విశేష కృషి

అట్రాసిటీ కేసుల్లో బాధితులకు త్వరిత న్యాయం చేయాలి: ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

ఉద్యోగ నియామకాల్లో రోస్టర్ విధానం తప్పనిసరిగా పాటించాలి

ప్రతి మూడు నెలలకు జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించాలి



సిద్దిపేట జిల్లా ప్రతినిధి:
సెప్టెంబర్ 29 (ప్రజా కలం ప్రతినిధి):

రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీల హక్కుల సంరక్షణకు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ విశేష కృషి చేసిందని కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. మంగళవారం సిద్దిపేట ఐడీఓసీ సమావేశ మందిరంలో కమిషన్ సభ్యులు నీలాదేవి,రాంబాబు నాయక్‌తో కలిసి ల్యాండ్ అట్రాసిటీస్, రోస్టర్ పాయింట్ల అమలు,బ్యాక్‌లాగ్ ఖాళీలపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బక్కి వెంకటయ్య మాట్లాడుతూ అక్టోబర్ 4వ తేదీతో ప్రస్తుత కమిషన్ పదవీకాలం పూర్తవుతుందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ చట్టానికి లోబడి రాష్ట్రవ్యాప్తంగా దళితులు,గిరిజనుల హక్కుల పరిరక్షణకు ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి సహకారంతో కృషి చేసినట్లు పేర్కొన్నారు.ఎస్సీ, ఎస్టీలు ఎన్నో ఏళ్లుగా అణచివేతకు గురయ్యారని, వారి హక్కులను కాపాడేందుకు అవసరమైన సందర్భాల్లో అధికారులతో కఠినంగా వ్యవహరించాల్సి వచ్చిందన్నారు. ప్రజలు ముఖ్యంగా దళితులు, గిరిజనులు తమ సమస్యల పరిష్కారం కోసం అధికారుల వద్దకు వచ్చినప్పుడు వారితో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు.ప్రతి నెల చివరి వారంలో సివిల్ రైట్స్ డే నిర్వహించి, మండల తహసీల్దార్, స్థానిక ఎస్సై, డీవీఎంసీ సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొని ఎస్సీ, ఎస్టీలకు చట్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు.ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించి వాటిని సద్వినియోగం చేసుకునేలా ప్రజలను చైతన్యపరచాలని అన్నారు.ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించాలని ఆదేశించారు.ఉద్యోగ నియామకాల్లో రోస్టర్ విధానాన్ని తప్పనిసరిగా పాటించాలని, ఎస్సీ, ఎస్టీల కోసం కేటాయించిన నిధులను వారి అభ్యున్నతికి మాత్రమే వినియోగించాలని స్పష్టం చేశారు. నిధులను ఇతర అవసరాలకు మళ్లిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు త్వరగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదు అందిన వెంటనే కాలయాపన లేకుండా కేసులు నమోదు చేయాలని అధికారులకు సూచించారు.బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీమ్‌కు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా రూ.102 కోట్ల బకాయిలను అక్టోబర్‌లో విడుదల చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌లు,కులాంతర వివాహాల ప్రోత్సాహకాలు తదితర సమస్యల పరిష్కారంపై కూడా ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.సిద్దిపేట అర్బన్ మండలం ఇమాంబాద్‌లో వినాయక చవితి సందర్భంగా భోజనాల వడ్డింపులో జరిగినట్లు వచ్చిన వివక్ష ఆరోపణలపై క్షేత్రస్థాయిలో విచారిస్తామని బక్కి వెంకటయ్య తెలిపారు.జిల్లాకు సంబంధించిన సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.ఎస్సీ, ఎస్టీ సమస్యలు పెండింగ్‌లో లేకుండా చర్యలు.జిల్లా కలెక్టర్ కె. హైమావతి మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ పెండింగ్‌లో లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వం నుంచి బడ్జెట్ విడుదలైన వెంటనే ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు నష్టపరిహారం అందిస్తున్నామని పేర్కొన్నారు.ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తన వ్యక్తిత్వంతో పదవికి వన్నె తెచ్చారని అభినందించారు.సిద్దిపేట కమిషనర్ ఆఫ్ పోలీస్ సాధన రష్మీ పెరుమాళ్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను సీరియస్‌గా తీసుకుని 60 రోజుల్లో దర్యాప్తు పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ప్రతి నెల అట్రాసిటీ కేసులపై డివిజన్ల వారీగా సమీక్ష నిర్వహిస్తూ బాధితులకు త్వరగా న్యాయం జరిగేలా చర్యలు చేపడుతున్నామని వివరించారు.

కమిషన్ చైర్మన్, సభ్యులకు సన్మానం

అక్టోబర్ 4వ తేదీతో కమిషన్ పదవీకాలం పూర్తవుతున్న సందర్భంగా జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆధ్వర్యంలో జిల్లా అధికారులు ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య,సభ్యులు నీలాదేవి,రాంబాబు నాయక్‌లను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి రాజా గంగారాం,ఈడీ ఎస్సీ కార్పొరేషన్ విజయ్ భార్గవ్,జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు,ఆర్డీవోలు,ఏసీపీలు,జిల్లా అధికారులు, ఎస్సీ,ఎస్టీ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com